1 KLVA102M372

రాబందుల రెక్కల చప్పుడు
పొగ గొట్టపు భూంకార ధ్వని
అరణ్యమున హరీంద్ర గర్జన
పయోదర ప్రచండ ఘోషలమధ్య
సిందూరం, రక్తచందనం
బందూకం, సంధ్యా రాగం
పులిచంపిన లేడినెత్తురూ
ఎగరేసిన ఎర్రజెండా - శ్రీశ్రీ

జూన్ 15 : మహాకవి శ్రీశ్రీ వర్ధంతి
(వ్యాసం 4వ పేజీలో)

ప్రజాపంథా

సి.పి.ఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) పక్షపత్రిక

సంపుటి : 29 సంచిక : 4 15.6.2012 పేజీలు : 12 పేజి-1 ప్రచురణ స్థలం : హైదరాబాద్ ఎడిటర్ : మాదాల నారాయణస్వామి వెల: 8/-

బడా కార్పోరేటు శక్తుల మధ్య పరస్పర ఆధిపత్య పోరుకి ప్రతిబింబమే

తాజా రాష్ట్ర రాజకీయ సంక్షోభం!

జగన్ కేంద్రంగా రాష్ట్ర రాజకీయ రంగంలో నేడు ఒక అల్పపీడన పరిస్థితి ఏర్పడి కొనసాగుతూ వుంది. అది రాష్ట్రంలోని రాజకీయ వర్గాలనే కాకుండా; సాధారణ ప్రజలను కూడా తన వైపుకు తిప్పుకున్నది. తమ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా విభిన్న వర్గాల, రంగాలప్రజలు నేడు యిదే అంశం మీద రాజకీయ చర్చలోకి మళ్ళించబడ్డారు. దానిని నిర్లక్ష్యం చేయడానికి వీలులేని ఓ ప్రత్యేక పరిస్థితి రాష్ట్ర ప్రజలకు కల్పించబడింది. సముద్రాలలో ఏర్పడే అల్పపీడనాలు సుడిగుండాలను సృష్టిస్తాయి. వాటి నుంచి బయట పడలేని పరిస్థితులుంటాయి. నేడు రాష్ట్ర ప్రజలు కూడా అలాంటి ఓ రాజకీయ సుడిగుండంలోకి బలవంతంగా యీడ్చబడ్డారు. 'నాకు సంబంధం లేని ఈ రాజకీయ చర్చలో నేను ఎంత మాత్రం పాల్గొనలేను' అని చెప్పగలిగే అవకాశం సామాన్య పౌరులకి లేకుండా పోయింది. బస్సులు, రైళ్ళు, క్లబ్బులు, హోటళ్ళు, చౌరస్తాలన్నింటా; అంటే ప్రజలు గుమిగూడే ప్రతి స్థలంలోనూ నేడు యిదే అంశం మీద చర్చ జరుగుతున్నది. వాద, ప్రతివాదనలు వేడివేడిగా వినిపిస్తున్నాయి. నలుగురు జనం కూడే ప్రదేశాలన్నీ వాదనా కేంద్రాలు (న్యాయ స్థానాలు)గా మారుతున్నాయి. లాయర్లు, కౌంటరు లాయర్లు జనంలో నుంచే పుట్టుకొస్తున్నారు. ఈ పరిస్థితిని ప్రజలమీద ఎవరు రుద్దారు?

ఈ అల్పపీడన తీవ్రతకు అద్దంపడుతున్న ఒక ఉదాహరణను ప్రస్తావించాలి. 15.6.2012న జరగబోవు ఎన్నికలు జరుగుతాయి. కానీ ఈ వ్యాసం రాసే సమయానికి (పోలింగ్‌కి ఒక రోజు ముందు) ఎన్నికలకమీషన్ ప్రకటన ప్రకారం ప్రచారంలో 42 కోట్ల డబ్బు, 13 కోట్ల విలువగలబంగారం, వెండి పట్టుపడ్డాయి. 2009లో 294 అసెంబ్లీ, 42 లోక్‌సభా స్థానాలలో కలిపి మొత్తం 38 కోట్ల డబ్బు పట్టుపడితే, ఈసారి కేవలం 18 అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికే అంతకంటే మించిన మొత్తం పట్టుబడింది. పంపకం చేసే మొత్తం దొంగ డబ్బులో పట్టుబడేది 'సముద్రంలో కాకి రెట్ట' వంటిదన్న సంగతి మరిచి పోరాదు. ఈ ఒక్క ఉదంతాన్ని బట్టి ఈసారి ఉప ఎన్నికల కార్పోరేటు శక్తులపాత్రను అర్థం చేసుకోవచ్చు.

బూర్జువా వర్గం ఒక వైపు ప్రజలను యదేచ్ఛగా దోచుకుంటుంది. మరోవైపు ప్రజలను దోచుకునే తమ ప్రాథమిక హక్కు కోసం తమలో తాము అంతర్గత కుమ్ములాటలకి దిగుతుంది. సాధారణంగా యిలాంటి కుమ్ములాటలు అంతర్గతంగానే పరిష్కారమవుతుంటాయి. తాము ఉమ్మడిగా దోచుకోవాల్సిన ప్రజలప్రమేయం లేకుండా తమ అంతర్గత వివాధాలను అవి సామరస్యంగా పరిష్కరించుకునేందుకు తొలి ప్రయత్నం చేస్తాయి. బూర్జువా వర్గంలోని వివిధ శిబిరాలు లేదా ముఠాలు తమ వివాధాలను అంతర్గతంగా పరిష్కరించుకునేందుకు సాగించే తొలి ప్రయత్నాలు ఒకవేళ విఫలమైతే; ఇక అవి బహిరంగంగా రచ్చకెక్కుతాయి. అప్పుడు అవి యిక అనివార్యంగా తాము ఉమ్మడిగా దోచుకోవాల్సిన ప్రజలనే ఆశ్రయిస్తాయి. ప్రజల అండదండలనే అభ్యర్థిస్తాయి. ప్రజల సహకారంతో పరస్పరం గెలవ జూస్తాయి. అలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో ప్రజలకి 'గుర్తింపు' పెరుగుతుంది. ప్రజలను 'గుర్తించడం'లో అవి పరస్పరం పోటీ పడతాయి. ఈ నేపథ్యంలో అనివార్యంగా బూర్జువా వర్గంలోని విభిన్న శిబిరాలు తమ అంతర్గత కుమ్ములాటలోకి ప్రజలను యీడుస్తాయి. నేడు మన రాష్ట్ర రాజకీయ పరిస్థితులు ఇందుకు అద్దం పడుతున్నాయి.

బూర్జువా 'వర్గ రాజ్యాలు' తమ రాజ్యాలసంరక్షణ కోసం రాజ్యాంగాలను రచించుకుంటాయి. అవి పీడిత వర్గ విప్లవాలను నియంత్రించడానికే పరిమితం కావు. తమ దోపిడీ వర్గానికి విధి విధానాలను కూడా రూపొందిస్తాయి. తమ దోపిడీ వర్గానికి చెందిన బూర్జువా రాజకీయ పార్టీలను నియంత్రించడానికి ఒక కోడ్ (ప్రవర్తనా నియమావళి)గా కూడా అవి రూపొందించుకుంటాయి. ప్రజలను అప్రజాస్వామికంగా దోపిడీ చేసుకునే హక్కును అనుభవించడంలో అవి పరస్పరం 'ప్రజాస్వామిక' స్వేచ్ఛను కోరుకుంటాయి. ఆ మేరకు తమ రాజ్యాంగాల్లో అవి నిర్దేశించుకుంటాయి. పంపకాలలో విశృంఖలత్వాన్ని నియంత్రించడానికి కొన్ని ఏర్పాట్లు రాజ్యాంగాలలో నిబంధనల రూపంలో చేసుకుంటాయి. అయితే వాటిని వినియోగించుకోవాల్సిన అవసరం సాధారణ సమయాలలో రాదు. అసాధారణ సమయాలలో మాత్రమే రాజ్యాంగం జోక్యం చేసుకుంటుంది. రాజ్యాంగాలను రాసుకున్న రాజ్యశక్తులమధ్య (అంటే పెట్టుబడిదారీ, దోపిడీ శక్తులు) ఏర్పడిన అంతర్గత కుమ్ములాటలు సామరస్యంగా పరిష్కారం కానప్పుడు రాజ్యాంగం క్రియాశీలతను (Constitutional Activism) ప్రదర్శిస్తుంది. యిప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ప్రత్యేక రాజకీయ పరిణామమిదే!

సంపద కేంద్రీకరణ, పెట్టుబడులసంచయం, సహజ వనరుల లూటీకి అవకాశాలతీవ్రత, లాభాలరేటు అసాధారణ పెరుగుదలకి అవకాశాలుండటం, విప్లవోద్యమాలశూన్యత లేదా బలహీనత వంటి పరిణామాలు ఏదేని ఒక సామాజిక వ్యవస్థలో తటస్థించిన ప్రత్యేక

థర్మల్ పవర్ ప్లాంట్లను, సెజ్‌లను వ్యతిరేకిస్తూ పోరాడుతున్న ప్రజలపై అమలవుతున్న నిర్బంధాన్ని వ్యతిరేకించండి!

జూన్ 25న రాష్ట్ర వ్యాపితంగా నిరసన దినం పాటించండి!!

భారత పార్లమెంటు 2005 సెజ్ చట్టాన్ని ఆమోదించినప్పటి నుండి దేశంలో వివిధ వర్గాలప్రజలు తమ నిరసనలను వివిధ రూపాలలో వ్యక్తం చేశారు. సెజ్ నిర్మాణాలకు అవసరమయ్యే భూసేకరణ కు వ్యతిరేకంగా నిర్వాసితులసమస్యలపరిష్కారాన్ని కోరుతూ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనల్లో పాల్గొన్నారు. విదేశీ పెట్టుబడులు భారీగా ఆకర్షించ వచ్చునని,నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి ఉపాధి కల్పిస్తామని పాలక పార్టీలు ఎన్ని మోసపు మాటలు చెప్పినా ప్రజలు మాత్రం ప్రతిఘటనకు సిద్ధమయ్యారు. పశ్చిమ బెంగాలులో సింగూరు, నందిగ్రాం, ఒరిస్సాలో కళింగనగర్, ఆంధ్రలో సోంపేట, కాకరాపల్లి వరకు ప్రజలు ప్రతిఘటించి తీవ్ర నిర్భంధాలకు గురయ్యారు. పోలీసు కాల్పుల్లో అనేక మంది గిరిజనులూ, దళితులూ, రైతులూ, కూలీలూ,మత్స్యకారులు తమ ప్రాణాలను పోగొట్టుకున్నారు. వందలాదిమందిపై కేసులు పెట్టారు. ప్రజలప్రతిఘటనను ఒక వైపు తీవ్ర అణచివేతలకు గురి చేస్తూనే మరోవైపు ఉద్యమాలను రకరకాల కుట్రలతో చీలికలకు గురి చేయాలని భారత ప్రభుత్వం చూసింది.

మన రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం అభివృద్ధి పేరుతో సముద్ర తీర ప్రాంతంలో విచ్చలవిడిగా కోస్టల్ కారిడార్ నిర్మాణానికి ,థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణానికి, పోర్టులు, పెట్రోకెమికల్ ప్లాంటులను నిర్మించడానికి పూనుకుంది. వాన్‌పిక్ పేరుతో గుంటూరు,ప్రకాశం జిల్లాలో 28 వేలఎకరాలభూములను రైతులనుండి,దళితులనుండి బలవంతంగా సేకరించింది. తూర్పుగోదావరి జిల్లాలో కెఎస్ఇజడ్ పేరుతో వేలఎకరాలభూములను రైతులనుండి సేకరించింది. అభివృద్ధి ముసుగులో సామ్రాజ్యవాద దేశాలు తమ బహుళజాతి సంస్థల పెట్టుబడులను భారత దేశానికి తరలించి మన దేశ సహజ వనరులను విచ్చలవిడిగా కొల్ల గొట్టడమే కాక మన దేశ వ్యవసాయ రంగాన్నితీవ్రంగా దెబ్బతీసే కుట్ర జరుగుతుందని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ చెబుతూ వస్తున్నది. పేదలు, రైతులు తమ భూములు నిలబెట్టుకోవాలని,సెజ్ చట్టం రద్దుకోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాపితంగా థర్మల్ ప్లాంటులు, అణువిద్యుత్ ప్లాంటులు, బీచ్‌శాండ్ మైనింగు రసాయన, మందుల పరిశ్రమలకు వ్యతిరేకంగా, వాన్‌పిక్‌కి వ్యతిరేకంగా ప్రజలను కదిలించి ఉద్యమాలు నిర్మించింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో సోంపేట, కాకరా పల్లి, కోటిఫాం థర్మల్ ప్లాంట్లకు వ్యతిరేకంగా మిలిటెంటు ఉద్యమాలను నిర్మించింది. కోటిఫాం థర్మల్ ప్లాంటు నిర్మాణానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంపై పోలీసులు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. స్త్రీలను అవమాన పరిచారు.

ఒక వైపు ప్రజల ప్రతిఘటనతోనూ అనేక యితర కారణాలతో తాత్కాలికంగా నిర్మాణాలు వాయిదా వేస్తున్న దశలో 2012 ఏప్రిల్ 30 న లోక్‌సభలో కేంద్ర, పర్యావరణ,అటవీశాఖా మంత్రి జయంతి నటరాజన్ మనరాష్ట్రంలో సోంపేట,కాకరాపల్లి తదితర ప్లాంట్లన్నింటికి అనుమతులు యిచ్చివేస్తానని చేసిన ప్రకటన తీవ్ర అభ్యంతరకరమైనది. థర్మల్ పవర్ ప్లాంటులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు, హైకోర్టు కేంద్ర అప్పిలేట్ అథారిటీ లలో వేసిన కేసులు పెండింగులో ఉండగా వాటిని బేఖాతరు చేస్తూ కేంద్రమంత్రి చేసిన ప్రకటన దుర్మార్గ పూరితమైనది. అడవిలోని ఖనిజ సంపదను,సహజ వనరులను యథేచ్ఛగా దోచిపెట్టడానికే కృత నిశ్చయంతో ఉన్నట్టు పాలకులు బరితెగించి చెబుతున్నారు. ప్రజలబ్రతుకులు బుగ్గిపాలయినా, ప్రజలప్రాణాలకంటే విదేశీ బహుళ జాతి సంస్థలప్రయోజనాలు, సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాలే తమకు ముఖ్యమని మన దళారీ పాలకులు మరో మారు స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రి జయంతి నటరాజన్ పార్లమెంటులో చేసిన ప్రకటనకు నిరసనగా, ఉత్తరాంధ్రలో థర్మల్ ప్లాంట్ల వ్యతిరేక ఉద్యమంపై ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా కొమరాడ మండలం కోటిఫాం, విశాఖ జిల్లా రాంబిల్లి మండలం చాటమెట్ట గ్రామంలో పెట్రోలియం కోక్ ప్లాంటు కివ్యతిరేకంగా జరిగిన ఉద్యమంపై జరుగుతున్న నిర్బంధానికి వ్యతిరేకంగా 2012జూన్ 25 (ఎమర్జన్సీ ప్రకటన రోజు) న రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రకమిటీ పిలుపు నిస్తోంది. ఈ పిలుపులో ప్రజలు ప్రజాస్వామిక వాదులు పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కోరుతున్నది.

రాష్ట్ర కమిటీ
సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ

సందర్భాలుంటాయి. అలాంటి నిర్దిష్ట సందర్భాలలో పీడిత వర్గానికీ, దోపిడీ వర్గానికీ మధ్య జరగాల్సిన వర్గ పోరాటం తాత్కాలికంగా తెరమరుగవుతుంది. లేదా బలహీన పడుతుంది. పీడిత వర్గాన్ని దోచుకోవాల్సిన దోపిడీ వర్గంలో అంతర్గత కుమ్ములాటలు తెర మీదికి వస్తాయి. ఇవి రాజకీయ రంగంలో వివిధ దోపిడీ రాజకీయ పార్టీల మధ్య అంతర్గత కుమ్ములాటలుగా ప్రతిబింబిస్తాయి. అవి క్రమంగా అంతర్గత రూపాన్ని వదిలేసి బహిరంగంగా బజారు కెక్కుతాయి. అప్పుడు అవి తాము దోచుకోవాల్సిన పీడిత వర్గ ప్రజలచెంతకు చేరతాయి. అట్టి ప్రజలఅండదండలకై పాకులాడతాయి. నేడు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రాజకీయ ప్రహసనమిదే!

సామరస్య పద్ధతుల్లో తమ మధ్య అంతర్గత కుమ్ములాటలను పరిష్కారానికి గలఅవకాశాలను కోల్పోయిన 'అసాధారణ సమయాల'లో మాత్రమే 'రాజ్యాంగ క్రియాశీలత' తలెత్తుతుంది. అప్పుడు రాజ్యానికి మూడు మూలస్తంభాలు లేదా పునాదులుగా పేరొందిన శాసన నిర్మాణ, కార్య నిర్వాహక, న్యాయ శాఖలలో 'క్రియాశీలత' చోటు చేసుకుంటుంది. రాజ్యాంగంలో నిర్దేశించక పోయినా, అనధికారికంగా నాలుగో స్తంభంగా పేరొందిన మీడియా మరింత ముందే క్రియాశీల మవుతుంది. నేడు మన రాష్ట్ర రాజకీయ రంగంలో ఈ రకమైన ప్రత్యేక 'క్రియాశీల' పరిస్థితులు ఏర్పడటం గమనార్హం!

'రాజ్యాంగ క్రియాశీలత' అంటే, దర్యాప్తు సంస్థలు, న్యాయ స్థానాలు, చట్ట సభలు, మంత్రి వర్గాలు, పత్రికలు, ఛానెళ్ళు తీవ్రస్థాయిలో కదలికలోకి వస్తాయి. వాటితోపాటు రాజకీయ పార్టీలు, సంస్థలు, పౌర సమాజాలు కదలికలోకి వస్తాయి. సమాజంలో రాజకీయ ఉష్ణోగ్రత పెరుగుతుంది. అది ఉక్కపోత దశకు కూడా చేరుతుంది. సాధారణ సమయాలలో పీడిత ప్రజలమీద ఎక్కు పెట్టాల్సిన రాజ్యాంగ నిబంధనలప్రయోగాన్ని దోపిడీ వర్గంలోని శిబిరాలమీదికి కూడా మళ్ళించబడుతుంది. తమ మధ్య సంప్రదింపులు లేదా దౌత్య ప్రక్రియలో పరిష్కరించుకోలేని వివాదాలను అసాధారణ రాజ్యాంగ పద్ధతులప్రయోగం ద్వారా పరిష్కరించుకోజూస్తాయి. అలాంటి సమయాలలో దోపిడీ రాజ్యం తన స్వంత వర్గానికి చెందిన ప్రముఖులనూ, శక్తులనూ, పార్టీలనూ నియంత్రిస్తుంది. అందుకు సోదాలూ, విచారణలూ, ఆస్తులస్తంభనలూ, అరెస్టులూ, బెయిల్ నిరాకరణ చర్యలూ తదితర నిర్బంధ లేదా నియంత్రణ పద్ధతులకు పాల్పడుతుంది. నేడు మన రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితి యిదే!

పెట్టుబడిదారీ దోపిడీ వర్గంలో ఎల్లప్పుడూ అంతర్గత వివాదాలుంటాయి. అది 'స్వేచ్ఛాయుత పోటీ' దశలోనైనా; 'గుత్త' దశలోనైనా వుండేదే! ఆడమ్ స్మిత్ 'స్వేచ్ఛ' ప్రాతిపదిక పై ప్రవచించిన అర్ధశాస్త్ర నీతిలోనూ వుంటుంది. కీన్స్ 'సంక్షేమం' ప్రాతిపదికపై ప్రవచించిన అర్ధశాస్త్ర నీతిలోనూ వుంటుంది. శ్రామిక వర్గ విప్లవం ద్వారా పెట్టుబడి ఒక రాజకీయ శక్తిగా అంతరించిపోయేంత వరకూ పెట్టుబడిదారులమధ్య పోటీ కొనసాగి తీరుతుంది. అయితే వర్గ చైతన్యంతో ఒక వర్గంగా అంత వరకూ సంఘటితం కాలేక పోయిన శ్రామిక వర్గాన్ని పెట్టుబడిదారీ వర్గం తమ కుమ్ములాటలమధ్య బలిపశువుగా వాడుకుంటుంది. కొన్ని సార్లు పీడిత ప్రజలను 'న్యాయమూర్తి'గా చేస్తుంది. 'ప్రజా న్యాయ స్థానం'లోనే తమ మధ్య అంతర్గత కుమ్ములాటలను పరిష్కరించుకునేందుకు 'పెట్టుబడి'కి చెందిన వివిధ మురాలు స్వయంగా 'ప్రజాకోర్టు'ను ఆశ్రయిస్తాయి. రాజ్యం రూపొందించిన అధికారిక న్యాయ ప్రక్రియ (కోర్టులు, దర్యాప్తు సంస్థలులు వగైరా) ద్వారా తమ అంతర్గత వివాదం పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేని పరిస్థితులు కూడా తలెత్తవచ్చు. అందుకే ఒకవైపు తమ పూజనీయ రాజ్యాంగం ద్వారా సామరస్య పరిష్కార ప్రయత్నాలు చేస్తూనే; మరోవైపు తమ వ్యూహాత్మక శత్రువర్గమైన పీడిత ప్రజలని తీర్పు చెప్పండంటూ ఆశ్రయిస్తుంది. నేడు మన రాష్ట్ర పరిస్థితి దీనికి అద్దం పడుతుందని చెప్పవచ్చును.

సులభ మార్గాలలో అత్యధిక స్థాయిలో అతి త్వరగా సంపదలను గడించే అవకాశాలు నేడు మన రాష్ట్రంలో వున్నాయి. 'ఎక్కువ స్థాయిలో మూలధనం – ఎక్కువ కాలంపాటు మౌలిక సదుపాయాలనిర్మాణం – దీర్ఘకాలిక లాభాలు' అనే ప్రక్రియ ప్రకారం ఎదిగిన బడా పెట్టుబడిదారీ వర్గాలను గతంలో చూశాము. ఇవన్నీ 'తక్షణ భారీ మదుపు – రేపు లోటు – ఎల్లుండి లాభాలు' అను ప్రాతిపదికతో ఏర్పడిన పారిశ్రామిక, వాణిజ్య రంగాలు మాత్రమే! ఒక బట్టలమిల్లు లేదా జూటు మిల్లు లేదా పంచదార ఫ్యాక్టరీ లేదా ఉక్కు కర్మాగారం లేదా ఆటో మోబైల్ పరిశ్రమలు యిలాంటివే! వాటికి పెట్టిన ప్రారంభ పెట్టుబడి మీద పరిశ్రమ రన్నింగ్ తర్వాత ఐదారేండ్ల వరకూ నికర లాభాలు రావు. చాలా ఏండ్ల వరకు నికర లోటు కొనసాగుతూనే వుంటుంది. ఆ తర్వాతే నికర లాభాలొస్తాయి. కానీ మద్యం, ఇసుక, ఇనపరాయి (ఐరన్ ఓర్), రియల్ ఎస్టేట్, కనస్ట్రక్షన్ వంటి రంగాలు అలా కాదు. ఒక బట్టలమిల్లు నిర్మాణ ప్రక్రియ వంటి అవసరం వీటికి వుండదు. రాజకీయ పలుకుబడితో ఒక ఏరు లేదా నదిలో ఒక ఎకరం ర్యాంపును మంజూరు చేయించుకుంటే, మరుసటి రోజు నుంచే ఇసుక వ్యాపారం మీద నికర లాభాలు రాలిపడుతుంటాయి. ఒక ఐరన్ లేదా స్టీల్ ప్లాంటు నిర్మాణానికి వేలకోట్ల ప్రారంభ పెట్టుబడులు కావాలి. కానీ వాటికి అవసరమైన ముడిసరుకు (ఐరన్ ఓర్ వంటి) తవ్వకానికి అందులో వందో వంతు ప్రారంభ పెట్టుబడులు కూడా అక్కర లేదు. ఇలాంటి సులభ సంపాదనావకాశాలు నేడు మన రాష్ట్రంలో బాగా పెరిగాయి. ఈ నేపథ్య పరిస్థితులే తాజా రాజకీయ అల్పపీడనానికి కారణమయ్యాయి.

ఓబులాపురం మైనింగ్ కంపెనీ స్థాపన ద్వారా రాష్ట్రంలో సులభ సంపాదనా ప్రక్రియకి ఓ నూతనాధ్యాయం ప్రారంభమైనది. అది అనేక ఆర్థిక ఆధిపత్య వర్గాలమధ్య వివాదాలకి తెరలేపింది. అతి తక్కువ వైశాల్యం గలమైనింగ్, భూములు లక్షలకోట్ల రూ॥లఆస్తులకు నిలయం అయ్యాయి. ఒక్కొక్క ఎకరంలో ఏటా పదులకోట్ల రూ॥ల లాభాల సంపాదించుకునే అవకాశాలు ఏర్పడ్డాయి. గాన ఆలిండియా బడా పారిశ్రామిక, వాణిజ్య వర్గాలదృష్టి కూడా ఓబుళాపురం వైపుకు మళ్ళింది. అందులో ముఖేశ్ అంబానీ ఒకరు! అయితే అలాంటి వారి ప్రయత్నాలు ఫలించలేదు. గాలి జనార్థన్ రెడ్డి స్థానాన్ని వారు ఖాళీ చేయించలేక పోయారు. గాలికి అండగా వై.యస్. ప్రభుత్వం నిలబడింది. అందుకే అంబానీ పెట్టుబడులు తెలుగు మీడియా సంస్థ 'ఈనాడు, ఈ-టీవీ'లను ఆక్రమించాయి. అక్షరాన్ని చేజిక్కించుకున్నాయి. తద్వారా గాలి జనార్థన్ రెడ్డి అవకతవకలనూ, అక్రమాలనూ, అవినీతినీ రాష్ట్ర ప్రజల్లో బహిర్గతం చేసే పనిని అంబానీ చేపట్టాడు. గాలి జనార్థన్ రెడ్డిని 'గాలి, గాలి' చేయడంలో తెలుగు మీడియా ద్వారా ఉత్తరాది రిలయన్స్ సంస్థ విజయవంతమైనది. ఇక గాలి జనార్థన్ రెడ్డిని కని, పెంచిన ఆనాటి వై.యస్. ప్రభుత్వానికి యిది మింగుడు పడలేదు. ఈ 'మీడియా పోటీ' నుంచి పై ఆస్తులపరిరక్షణకై 'పోటీ మీడియా'ను సృష్టించుకోక తప్పలేదు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీని రిలయన్స్ చేజిక్కకుండా ఎన్ని చర్యలు చేపట్టాలో; అన్ని చర్యలను వై.యస్. ప్రభుత్వం చేపట్టింది. అందులో కేంద్ర ప్రభుత్వంతో రాజకీయంగా ఘర్షణ పడటానికి సిద్ధం కావడం కూడా ఒక చర్యే! ఈ విధంగా మన రాష్ట్ర ప్రజలకి చెందిన సహజ వనరులను కొల్లగొట్టే లక్ష్యంగలవిభిన్న పెట్టుబడిదారీ శిబిరాలమధ్య వైరుధ్యాలతీవ్రతకు ఓబుళాపురం గనులు ఓ అల్పపీడన కేంద్రంగా మారింది. అయితే అది ఎందుకు 'పోటీ కేంద్రం'గా మారిందో మరో నేపథ్యం కూడా వుంది.

కేంద్రానికీ, రాష్ట్రాలకూ మధ్య వైరుధ్యం మన దేశ రాజకీయ రంగంలో కొత్తకాదు. దీనిపై 80వ దశకంలో సర్కారియా కమీషన్‌నే వేయాల్సి వచ్చింది. ఇది ప్రజలదృష్టిలో కేవలం రాజకీయాధికారం కోసం పోటీ మాత్రమే! కానీ మార్క్సిస్టు దృక్కోణంలో ప్రతి రాజకీయ పోటీ వెనక ఒక ఆర్థిక పోటీ విధిగా వుంటుంది. అందుకే కేంద్రానికీ, రాష్ట్రాలకీ మధ్య రాజకీయ పోటీ వెనక కూడా ఆర్థిక పోటీయే నేపథ్య కారణంగా వుంటుంది. ఈ విషయంలో మన దేశంలో మొట్టమొదట కేంద్రంతో ఆర్థిక రంగంలో ఘర్షణపడిన చరిత్ర తమిళనాడుకే

పి.ప్రసాదు

దక్కుతుంది. క్రమంగా గుజరాత్, మహారాష్ట్ర, బెంగాల్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలు కూడా ఓ మేరకు యిలాంటి ఘర్షణకి దిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో వెంగళరావు ప్రభుత్వం మొదటిసారి ఒక మేరకు కేంద్రంతో 'సాపేక్షిక స్వతంత్రత'ను ప్రదర్శించింది. అది ఎన్టీఆర్ హయాంలో కొత్త దశకు చేరింది. వైయస్ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఈ 'స్వతంత్ర్యత' రాజకీయ రంగానికే పరిమితం కాదు. ఆర్థిక రంగంలోనూ ప్రదర్శించింది. నిజం చెప్పాలంటే, సాపేక్షికంగా ఆర్థిక రంగంలో ప్రదర్శించే 'స్వతంత్రత'కి ప్రతిబింబమే రాజకీయ 'స్వతంత్రత! అదే 'గాలి జనార్ధన్ రెడ్డి' వంటి నూతన కార్పోరేట్ సంస్థలసృష్టికి కారణమైనది.

ఢిల్లీ అధిష్టానికి ఎందుకు లొంగి వుండాలన్న ద్రవిడ కజకమ్ వుద్యమ పునాదులు తెల్సిందే! ఢిల్లీ పీఠం చేత ముఖ్యమంత్రులఎంపిక పద్ధతిపై తిరుగుబాటుకు అది కారణమైనది. అది రాజకీయంగా ఆనాడు కేంద్రంతో ఘర్షణ పడటం వెనక తమిళ ప్రాంతీయ ఆర్థిక వర్గాలప్రయోజనాలున్నాయి. ఒకటిన్నర దశాబ్దాలతర్వాత ఎన్టీఆర్ ప్రభుత్వం ఢిల్లీ పెత్తనంపై 'ఆంధ్రులఆత్మగౌరవం' పేరుతో సాగించిన రాజకీయ తిరుగుబాటు వెనక కూడా మన రాష్ట్ర ఆర్థిక వర్గాల (ముఖ్యంగా కోస్తాంధ్ర) ప్రయోజనాలున్నాయి. అది కోస్తాంధ్ర ఆర్థిక వర్గాలను పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార రంగాలలో బలోపేతం చేసింది. చంద్రబాబు, వై.యస్‌లహయాంలో రాయలసీమలో కూడా ఒక నూతన బడా సంపన్న వర్గం ఉనికిలోకి వచ్చింది. 'కోస్తాంధ్ర'కు బదులు 'సీమాంధ్ర' కార్పోరేటు శక్తులుగా మాట్లాడుకునే స్థాయికి ఈ పరిణామం చేరింది. కోస్తా, రాయలసీమలప్రజలు తెలంగాణా ప్రజలకంటే అదనంగా తమ జీవన పరిస్థితుల్లో మౌలిక పురోగతిని ఏదీ పొందలేక పోయారు. కానీ తెలంగాణా సంపన్న వర్గంతో పోల్చితే; సీమాంధ్ర సంపన్న వర్గాలు మౌలికంగానే భిన్న స్థితిని పొందాయి. (ఇదే తెలంగాణా ప్రాంతీయ ప్రజాస్వామిక వుద్యమ వుధృతికి దారి తీయడం గమనార్హం). ఈ నూతన రాష్ట్ర రాజకీయ పరిస్థితి ఢిల్లీ కేంద్రంగా రూపొందిన ఆలిండియా స్థాయి బడా కార్పోరేటు శక్తులకు ఒకింత యిబ్బంది కలిగించింది. వీరి నుంచి మున్ముందు సమాంతర పోటీని ఎదుర్కొవాల్సిన పరిస్థితికి కారణమైనది. వై.యస్. హయాంకి వచ్చేసరికి ఈ నూతన పోటీ ఒక నిశ్చిత దశకి చేరింది. అదే ఈనాటి రాష్ట్ర రాజకీయ రంగంలో తాజా అల్పపీడన పరిస్థితిని సృష్టించింది.

వై.యస్. ప్రభుత్వం రాక ముందే క్రిష్ణా – గోదావరి ప్రాంతంలోని కేజీ బేసిన్ సహజవాయువు (గ్యాస్)ను చంద్రబాబు ప్రభుత్వం అంబానీకి చెందిన రిలయన్స్‌కి కారుచౌకగా అప్పగించింది. అది అత్యంత విలువైనది. అది విస్తృతిలో ఓబుళాపురం ఐరన్ ఓర్ కంటే వందలరెట్లు ప్రాధాన్యత గలది. ఒకప్పుడు ప్రపంచంలో పెట్రోలియం, బొగ్గు మాత్రమే ఇంధన వనరులుగా రాజ్యమేలాయి. కానీ సహజవాయువు ఉనికిలోకి వచ్చాక పరిస్థితి మారింది. ఇరాన్, రష్యాలు సహజవాయువుకి ప్రపంచ స్థాయి నిలయాలుగా (గ్యాస్ హబ్స్)గా పేరొందిన తర్వాత భూగోళ రాజకీయాలలో కూడా మార్పులొచ్చాయి. నేటి సమాజంలో సహజవాయువుకి చాలా ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యతలు ఏర్పడ్డాయి. కాండ్లా, ముంబాయి, కచ్‌రేవులతో కూడిన పశ్చిమ తీరంలో విదేశీ బహుళ జాతి సంస్థలు 'కోస్టల్ కారిడార్'ను తలపెట్టిన విషయం తెల్సిందే! (మన రాష్ట్రంలోని కోస్టల్ కారిడార్ వంటిది) అందులో నిర్మించే బడా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకి అవసరమైన సహజ వాయువును మన కేజీ బేసిన్ నుంచే సరఫరా చేయాలని కేంద్రం నిర్ణయించింది. అందుకే మన క్రిష్ణా, గోదావరి బేసిన్ గ్యాస్‌ను నర్మద, తపతి బేసిన్‌లోని పరిశ్రమలకు సరఫరా కానున్నది. దీన్ని కేంద్రానికి ఆర్థిక దన్నుగా నిలుస్తున్న రిలయన్స్ సంస్థ చేపట్టింది. దాని మీద కోస్తాంధ్ర బడా సంపన్న వర్గం దృష్టి పడింది. వైయస్ పరిపాలనకి పూర్వమే కుదిరిన కేజీ బేసిన్ గ్యాస్ ఒప్పందాలు కూడా ఈ నేపథ్యంలోనే వివాదాస్పదమయ్యాయి. అది కూడా ఈనాటి రాష్ట్ర రాజకీయ సంక్షోభానికి ఓ కారణమైనది.

గాలి జనార్థన్ రెడ్డి సాంప్రదాయ సంపన్న కుటుంబీకుడు కాదు. ఆయన పిత్రార్జితాలు, పూర్వార్జితాలు గలకుటుంబంలో పుట్టలేదు. ఒక ఆర్డినరీ పోలీసు కానిస్టేబుల్ కొడుకు మాత్రమే! పైగా కాంగ్రెసు వాది కూడా కాదు. బి.జె.పి. నాయకుడు కూడా! రాజకీయ ప్రయోజనాల కంటే ఆర్థిక ప్రయోజనాలకే వై.యస్. అధిక ప్రాధాన్యతనిచ్చాడు. ఢిల్లీ కేంద్రంగా గలకార్పోరేటు శక్తులకి సమాంతర కార్పోరేటు శక్తులసృష్టి కోసం వ్యూహాత్మకంగానే వై.యస్. పావులు కదిపాడు. అందుకే క్రోనీ కాపిటలిస్టు ప్రక్రియలో గాలి జనార్థన్ రెడ్డి అతి తక్కువ కాలంలో అత్యధిక సంపన్నుడయ్యాడు. ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాదు వంటి సాంప్రదాయ రాష్ట్ర కార్పోరేటు శక్తులకి యిది రుచించలేదు. అంతేకాకుండా జి.యం.ఆర్. వంటి నూతన కార్పోరేటు శక్తులకి కూడా మింగుడు పడలేదు. అంతెందుకు, వై.యస్.ను గెలిపించేంత వరకూ ఆర్థిక దన్నుగా నిలిచిన లగడపాటి వంటి రాజకీయ ఆశ్రిత కార్పోరేటు శక్తులకి (పొలిటికల్ కమ్ ఎకనామిక్ పవర్స్) కూడా ఒకింత అసూయ కలిగించింది. ఒకవైపు ఢిల్లీ కేంద్రంగా గలరిలయన్స్ వంటి సంస్థలతోనూ; మరో వైపు కోస్తాంధ్రలోని సాంప్రదాయ రాజకీయ కార్పోరేటు శక్తులతోనూ వై.యస్. ప్రభుత్వం ఘర్షణ పడాల్సి వచ్చింది. తెరవెనక సాగిన ఈ ఆర్థిక పోటీయే; తెరమీద రాజకీయ పోటీ రూపంలో బహిర్గతమైనది.

రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య రంగాలతో కూడిన ఆర్థిక రంగంలో ఢిల్లీ కేంద్రంగా గలబడా కార్పోరేటు శక్తులకి రాష్ట్ర ప్రభుత్వం సహకరించిన గత సందర్భాలున్నాయి. ఆనాడు సీల్డ్ కవర్స్ ద్వారా ముఖ్యమంత్రులనియామ కొన్ని ఢిల్లీ అధిష్టానం చేపట్టేది. ఆనాడు ఢిల్లీ అధిష్టానం పట్ల రాజకీయ రంగంలో కూడా అది విధిగా విధేయతను ప్రదర్శించాల్సి వుంటుంది. ఢిల్లీ అధిష్టానం పట్ల ఆర్థిక విధేయతకూ, రిలయన్స్ వంటి బడా కార్పోరేటు సంస్థలపట్ల రాజకీయ విధేయతకూ మధ్య అవినాభావ సంబంధం వుంది. ఆర్థిక రంగంలోని విధేయతకు రాజకీయ రంగంలోని విధేయత అనివార్యంగా లోబడి వుంటుంది. ఆర్థిక రంగంలో 'అవిధేయత'కి సిద్ధపడ్డ సమయంలో రాజకీయ రంగంలో కూడా 'అవిధేయత'కి సిద్ధంకాక తప్పదు. అందుకే 30కి పైగా లోక్‌సభ స్థానాలను గెలిపించి యు.పి.ఎ.కి కానుకగా అందిస్తాననీ, రాష్ట్ర రాజకీయాలలో జోక్యం చేసుకోవద్దనీ ఢిల్లీ అధిష్టానానికి ముందే వై.యస్. స్పష్టం చేసినట్లు జరిగిన ప్రచారాన్ని ఈ వెలుగులోనే అర్థం చేసుకోవాల్సి వుంది. అంతేకాకుండా గతంలో రాష్ట్ర వాణిజ్య, పారిశ్రామిక సంస్థలనుంచి కేంద్రం స్వయంగా ఎన్నికలనిధిని వసూలు చేసుకునేదనీ; వై.యస్. హయాంలో తానే స్వయంగా నిధిని వసూలు చేసి కేంద్రానికి స్వహస్తాలతో యిచ్చినట్లు జరిగే ప్రచారం కూడా కొట్టి వేయలేనిది. ఇవన్నీ కేవలం రాజకీయ రంగంలోని వివాదాలుగా కాకుండా; ఆర్థిక రంగానికి లోబడిన అనుబంధ వివాదాలుగానే చూడాలి. వీటి కొనసాగింపు క్రమమే నేటి పరిస్థితికి మూలం!

అంతకు ముందే రాష్ట్ర ప్రజల్లో వేళ్ళూనుకున్న 'ఈనాడు' మీడియా సంస్థల్లో చొరబడి నూతన సంపన్న మైనింగ్ రాజ్యం మీద రిలయన్స్ తనదాడిని కేంద్రీకరించింది. అంతేకాకుండా దానిని మైనింగ్ మాఫియాగా కూడా ప్రజల్లో బహిర్గతం చేయగలిగింది. అయితే అంబానీ ఆధ్వర్యంలోని గ్యాస్ మాఫియా మాత్రం బహిర్గతం కాలేదు. నిజానికి ఈ రెండు వ్యాపారాలూ మాఫియా తరహాలోనివే! ఒక ఆర్థిక శక్తి తన ప్రత్యర్థిని బట్టబయలు చేయగలుగుతున్నది. మరో ఆర్థిక సంస్థ విఫలమవుతున్నది. తన చేతిలో స్వంత మీడియా లేక పోవడమే అందుకు కారణం! ఈ నేపథ్యంలోనే వైయస్ దృష్టి మొదట 'పోటీ మీడియా' మీద పడింది. మొదటి దశలో 'సాక్షి మీడియా'ను వై.యస్. ఉనికిలోకి తెచ్చాడు. అందులో తన ద్వారా లబ్ధిపొందిన అనేక ప్రాజెక్టులనుంచి 'క్విడ్-ప్రో-కో' (నీకు నేను – నాకు నీవు) పద్ధతిలో భారీ పెట్టుబడులను 'సాక్షి' సేకరించింది. అంతటితో వూరు కోలేదు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రిలయన్స్‌కి అప్పగించిన కేజీ గ్యాస్ వనరులనుంచి రాష్ట్రానికి వాటా కావాలన్న కొత్త డిమాండును వై.యస్. ప్రభుత్వం రెండవ దశలో ముందుకు తెచ్చింది. 2009 ఎన్నికలప్రచారంలోనే రాష్ట్ర ప్రజలకు చౌకగా వంట గ్యాస్ పేరుతో ఈ డిమాండును ప్రజల్లోకి వైయస్ తీసుకెళ్ళాడు. రెండోసారి గెలిచిన తర్వాత 'రిలయన్స్'తో కేజీ బేసిన్ గ్యాస్‌కై పాత ఒప్పంధాలను

(మిగతా 5వ పేజీలో)

పశ్చిమం నుండి వీస్తున్న కొత్త గాలులు

2008-09 ప్రపంచ ఆర్థిక సంక్షోభం కోలుకోక ముందే ప్రపంచం మరో ఆర్థిక సంక్షోభపు సుడిగుండంలోకి ప్రవేశించిందని పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలంతా అంగీకరిస్తున్నారు. యూరపులో సంక్షోభం మరింత తీవ్రంగా వుంది. అది ప్రభుత్వ అప్పులసంక్షోభం (సావరిన్ డెట్ క్రైసిస్) రూపంలో వుంది. దీని నుండి బయటపడటానికి యూరోపియన్ యూనియన్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలత్రయం రుణగ్రస్త దేశాలప్రభుత్వాలకు 'పొదుపు చికిత్స'ను ప్రతిపాదించాయి. ఈ పొదుపు చర్యలలో భాగంగా రుణగ్రస్త దేశాలు కార్మికులసంఖ్యను తగ్గించటం, వారి వేతనాలను తగ్గించటం, కార్మికులపదవీ విరమణ వయస్సును పెంచటం, కార్మికులఇతర సౌకర్యాలను తగ్గించటం, ప్రజా సంక్షేమ పథకాలను కత్తిరించటం వంటి చర్యలు చేపట్టాలి. ఈ విధంగా ప్రభుత్వాలబడ్జెట్‌లోట్లను పథకం ప్రకారం తగ్గించాలి. ఈ చర్యలు అమలు జరిపే షరతు మీద పై దుష్టత్రయం ఈ దేశాలకు కొత్త రుణాలను మంజూరు చేస్తుంది. గ్రీస్, ఐర్లాండ్, స్పెయిన్, ఇటలీ మొదలైన దేశాలు అప్పులవూబిలో కూరుకుపోయాయి. ఈ దేశాలన్నీ పొదుపు పథకాలఅమలు కోసం వప్పందాలు కుదుర్చుకున్నాయి.

1980 నుండే అంతర్జాతీయ గుత్తా ద్రవ్య పెట్టుబడిదారీ వర్గం కీన్సీనియన్ విధానాలకు (సంక్షేమ రాజ్య విధానం) స్వస్తి చెప్పి నయా వుదారవాద విధానాలను చేపట్టింది. పర్యవసానంగా యూరోపు రాజ్యాలన్నిటా దారిద్ర్యం, అసమానతలు, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయాయి. 21వ శతాబ్దం ప్రారంభం నుండే ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక పోరాటాలు ప్రారంభమయ్యాయి. 2002లో ఈ శతాబ్దపు తొలి సార్వత్రిక సమ్మె స్పెయిన్‌లో జరిగింది. 2008-09 ఆర్థిక సంక్షోభం కాలం నుండి కార్మికులపోరాటాలు తీవ్రమయ్యాయి. 2008 నుండి గ్రీస్‌లో నిరంతరాయంగా కార్మికులసమ్మె పోరాటాలు జరుగుతూ వచ్చాయి. ఫ్రాన్సులో 2008 నుండి మూడు సంవత్సరాలు వరుసగా సమ్మెలు జరిగాయి. లండన్‌లో 2010 నవంబరులో భారీ విద్యార్థి ప్రదర్శనలు జరిగాయి. 2011 మార్చిలో 4 లక్షలమంది కార్మికులు మహా ప్రదర్శన చేశారు. గత 20 ఏళ్లలో యిదే కార్మిక సంఘాలపెద్ద ప్రదర్శన. స్పెయిన్‌లో 2011లో మరో జనరల్ సమ్మె జరిగింది. ఇందులో స్పెయిన్ శ్రామికశక్తిలో సగం మంది పాల్గొన్నారు. 2011లోనే స్పెయిన్ ఇండిగ్నినాడోల (ఆగ్రహ పూరితులు) వుద్యమం జరిగింది. 2011 ప్రారంభంలో యూరోపియన్ యూనియన్ మొత్తం మీద నిరుద్యోగం 25 ఏళ్ల లోపు యువతలో 20 శాతానికి పైగా వుంది. ఇటలీలో 26 శాతం, గ్రీస్‌లో 30 శాతం, స్పెయిన్‌లో 43 శాతం వుంది. దారిద్ర్యం, అసమానతలు విపరీతంగా పెరిగాయి. రుణగ్రస్తత పెరిగింది.

2010లో బెయిలవుట్ అగ్రిమెంట్లు చేసుకున్న దేశాల పరిస్థితులు మెరుగుపడక పోగా మరింత దిగజారాయి. గ్రీసు ఉదాహరణ కళ్లు తెరిపించేదిగా వుంది. నాలుగు విడతలబెయిలవుట్ల తర్వాత గ్రీసు పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ప్రజలఆదాయాలు దారుణంగా పడిపోయాయి. దీనితోపాటు వుత్పత్తీ తీవ్రంగా పడి పోయింది. నిరుద్యోగం విపరీతంగా పెరిగి పోయింది. ప్రజల ఆదాయాలు పడిపోవటంతో ప్రభుత్వాదాయమూ పడిపోయింది. గ్రీస్ అప్పును 2020 నాటికి జి.డి.పి.లో 160 శాతం నుండి 120 శాతానికి తగ్గించాలనే లక్ష్యాన్ని సాధించటం అసంభవంగా రుజువయింది. వేతనాలకోతలూ, పెన్షన్ల కోతలూ, ఆరోగ్య పథకాలకోతలూ, ప్రభుత్వ వుద్యోగాలకోతలూ, యింకా అనేక యితర అంశాలూ ప్రజల్లో బెయిలవుట్ వప్పందాలపట్ల, పొదుపు పథకాలపట్ల తీవ్ర వ్యతిరేకతను, ఆగ్రహావేశాలను సృష్టించాయి.

ఈ నేపథ్యంలో గ్రీస్ ప్రధాని జార్జి పాపండ్రూ నాల్గవ విడత రుణాన్ని దుష్టత్రయం నుండి తీసుకునే ముందు ఈ బెయిలవుట్ అగ్రిమెంటు షరతులగురించి రెఫరెండం ద్వారా ప్రజాభిప్రాయాన్ని తీసుకుంటానని 2011 అక్టోబరు 31న ప్రకటించాడు. ఇందుకు దుష్టత్రయం, జర్మనీ, ఫ్రాన్సు లాంటి దేశాలు ఆగ్రహావేశాలను వ్యక్తం చేశాయి. రెఫరెండం తీసుకోనవసరం లేదని, బెయిలవుట్ అగ్రిమెంట్లను అమలు జరిపి తీరాల్సిందేనని హెచ్చరించాయి. దీనితో, పది రోజులతర్వాత పాపండ్రూ తన పదవికి రాజీనామా చేశాడు. గ్రీస్‌లోని రెండు ప్రధాన పాలకవర్గ పార్టీలు - మధ్యేమార్గ మితవాద పార్టీ అయిన న్యూడెమోక్రసీ పార్టీ, పాన్‌హెలెనిక్ సోషలిస్టు మూవ్‌మెంట్ (షోసోక్) పార్టీ కలిసి "జాతీయ ప్రభుత్వాన్ని" యేర్పాటు చేశాయి. ఎన్నికలను వాయిదా వేసి 'పొదుపు చర్యలకు' పార్లమెంటు ఆమోదాన్ని తీసుకున్నాయి. పార్లమెంటులో ఈ చర్చ జరుగుతున్న సమయంలో ఈ పొదుపు చర్యలకు వ్యతిరేకంగా పార్లమెంటు బయట ప్రజలు పెద్ద యెత్తున ప్రదర్శనలు చేశారు. చివరికి పొదుపు చర్యలు అమలు జరిగాయి.

కాస్త ఆలస్యంగానైనా ఈ సంవత్సరం (2012) మే 6న ఎన్నికలు జరపవలసి వచ్చింది. మొరటుగా 'పొదుపు చర్యలను' అమలు చేసిన సంకీర్ణ ప్రభుత్వంలోని రెండు భాగస్వామ్య పార్టీలను (ప్రధాన బూర్జువా పార్టీలు) ప్రజలు అవమానకరంగా ఓడించారు. ఇంత వరకూ ఈ రెండు పార్టీలే ఒక దానికి ప్రత్యామ్నాయంగా మరొకటి అధికారాన్ని చలాయిస్తూ వచ్చాయి. 300 స్థానాలున్న గ్రీకు పార్లమెంటులో పాలక పోసోక్ పార్టీ 160 స్థానాలనుండి 41 స్థానాలకు కుదించబడింది. దాని ఓటింగు శాతం 44 నుండి 13కు పడిపోయింది. న్యూడెమోక్రసీ పార్టీ ఓటింగు శాతం 33.5 శాతం నుండి 18.9 శాతానికి పడిపోయింది. కాని, దాని స్థానాలు మాత్రం 91 నుండి 108కి పెరిగాయి. దీనికి కారణం - గ్రీకు రాజ్యాంగం ప్రకారం అతిపెద్ద పార్టీగా అవతరించిన పార్టీకి 50 సీట్లు అదనంగా కలుస్తాయనే నిబంధన వుండటమే. అయినా, ఈ రెండు పార్టీలలో దేనికీ కాని, లేక ఈ రెండు పార్టీలకు కలిసి కానీ 300 స్థానాలున్న పార్లమెంటులో మెజారిటీ రాలేదు.

ఈ ఎన్నికల్లో మరో ముఖ్యమైన పరిణామం 2009 ఎన్నికల్లో 4.5 శాతం ఓట్లు, 13 స్థానాలు మాత్రమే సాధించుకున్న రాడికల్ లెఫ్టు సంఘటన (సిరీజా) ఈ ఎన్నికల్లో 16.8 శాతం ఓట్లు, 52 సీట్లు సంపాదించుకొని రెండవ అతిపెద్ద పార్టీగా అవతరించటం. ఈ సంఘటనలో కొన్ని యం.యల్. సంస్థలు వుండటం విశేషం. కి.కి.ఇ.గా పిలువబడే గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (రివిజనిస్టు పార్టీ) మాత్రం తన బలాన్ని పెద్దగా పెంచుకోలేక పోయింది. ఇది, ఈ ఎన్నికల్లో తన ఓటింగును ఒక్క శాతం పెంచుకొని 26 స్థానాలకు ఓటు సాధించింది. గతంలో వున్న 21 స్థానాలను 26 స్థానాలకు పెంచుకుంది. 'పొదుపు చర్యల' పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వున్న పరిస్థితుల్లో, సాపేక్షికంగా బలంగా వున్న కె.కె.ఇ. దీనిని సొమ్ము చేసుకోలేక పోవటం దాని విధానాల్లోని లోపాన్ని (రివిజనిస్టు స్వభావాన్ని) వెల్లడిస్తుంది.

సంపాదకీయం

ఇంకొక ప్రమాదకరమైన పరిణామం కూడా ఈ యెన్నికల్లో చోటుచేసుకుంది. అతి మితవాద ఫాసిస్టు శక్తులు కూడా ఈ ఎన్నికల్లో బలం పుంజుకున్నాయి. 'గోల్డెన్ డాన్' అనే పచ్చి ఫాసిస్టు పార్టీ 2009 ఎన్నికల్లో కేవలం 0.3 శాతం ఓట్లు సాధించుకున్న స్థితి నుండి ఈ ఎన్నికల్లో 7 శాతం ఓట్లను సాధించగల్గింది. గతంలో పార్లమెంటులో ఒక్క స్థానం కూడా లేని స్థితి నుండి ఈ ఎన్నికల్లో 21 స్థానాలు సాధించగల్గింది. మరొక పచ్చి మితవాద పార్టీ అయిన ఇండిపెండెంట్ గీక్ 10.6 శాతం ఓట్లను, 33 స్థానాలను సంపాదించగల్గింది.

ఈ ఎన్నికల ఫలితాల నుండి ఈ క్రింది గుణపాఠాలను తీసుకోవచ్చు. 'బెయిలవుట్ వప్పందాలను', 'పొదుపు పథకాలను' ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అదే సమయంలో ప్రజలకు యెంచుకోవలసిన ప్రత్యామ్నాయం గురించి తగినంత సిద్ధాంత చైతన్యం లేదు. ప్రజలను క్రమబద్ధంగా సరియైన ప్రత్యామ్నాయం వైపు సంఘటితం చేసి పోరాటాన్ని సాగించగల్గిన రాజకీయ శక్తీ యింకా యేర్పడలేదు.

మే 6 ఎన్నికలతర్వాత బెయిలవుట్ వప్పందాలను, పొదుపు చర్యలను అమలు చేయటానికి అంకితమైన పార్టీలకు ప్రభుత్వం యేర్పరచటానికి మెజారిటీ రాలేదు. ఈ పార్టీలను బలపరచటానికి యితర పార్టీలేవీ ముందుకు రాలేదు. పర్యవసానంగా రాజకీయ పార్టీలన్నీ మళ్లీ జూన్ 17న ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించు కున్నాయి. జూన్ 17న జరిగే ఎన్నికలలో సిరిజా పార్టీ తన బలాన్ని మరింత పెంచుకోవచ్చునని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అయితే సిరీజాకే మెజారిటీ వస్తుందని చెప్పలేం. అలాంటప్పుడు పొదుపు చర్యలను వ్యతిరేకించే పార్టీలకూటమి ప్రభుత్వాన్ని యేర్పరచగల్గు తుందా? అలాంటి ప్రభుత్వ మొకటి ఏర్పడినా దుష్టత్రయాన్ని, జర్మనీ, ఫ్రాన్సులను ధిక్కరించి బెయిలవుట్ వప్పందాలను రద్దు చేయగల్గు తుందా? ఈ శక్తులు విధించే ఆర్థిక ఆంక్షలను తట్టుకొని నిలబడగల్గు తుందా? మనగల్గుతుందా? అన్నీ సమాధానాలు లేని ప్రశ్నలే!

ఇటీవలఫ్రాన్సులోనూ ఎన్నికలు జరిగాయి. అక్కడా, బెయిలవుట్ వప్పందాలు, పొదుపు పథకాలను బలపరుస్తున్న సర్కోజీ పార్టీని ప్రజలు మట్టి కరిపించారు. సోషలిస్టు పార్టీ నాయకుడు హొలండ్ గెలిచాడు. ఇతడు గెలవగానే 'యూరపుకు పొదుపు అనివార్యం కాదని తన ఎన్నిక నిరూపించిందని' ప్రకటించాడు. జర్మనీలోని అతిపెద్ద రాష్ట్రంలో యిటీవలజరిగిన ఎన్నికల్లో పొదుపు చర్యలను వ్యతిరేకించే కమ్యూనిస్టు పార్టీ (రివిజనిస్టు పార్టీ) మెజారిటీ సాధించటం కూడా ప్రముఖమైన విషయమే. యూరపంటిలోనూ యిదే ధోరణి ముందుకు వస్తున్నది. ప్రజలు ఈ పొదుపు 'చర్యలను' అంటే ద్రవ్య పెట్టుబడి నయా వుదారవాద విధానాలను వ్యతిరేకిస్తున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా వుద్యమాల్లోకి ముందుకు వస్తున్నారు. ఎన్నికలలోనూ ఈ విధానాలను అమలు జరిపే పార్టీలను తిరస్కరిస్తున్నారు.

2008-09 ఆర్థిక సంక్షోభం అమెరికా ఆంతరంగిక వైరుధ్యాలను తీవ్ర రూపానికి చేర్చింది. దారిద్ర్యం, నిరుద్యోగం, అసమానతలు, కుటుంబాలరుణ గ్రస్తత గతంలో యెన్నడూ లేనంతగా బట్టబయలయ్యాయి. అవి నేడు బాగా చర్చనీయాంశమయ్యాయి. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత 'సామాజిక వప్పందం' కాలంలో యేర్పడిన వర్గ సామరస్యం, వర్గ శాంతి గురించి భ్రమలు, నేటి నయా వుదారవాద విధానాలకాలంలో, మరీ ముఖ్యంగా, 2008-09 ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రజల్లో పటాపంచలవుతూ వచ్చాయి. కార్మిక సంఘాలు మళ్లీ పెంపొందటం, సమ్మె పోరాటాలు పెల్లుబకటం ఒక ఎత్తు కాగా, 'వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించుకోండి' అనే వుద్యమం వినూత్నమయింది. ఇంటర్నెట్ ద్వారా పరస్పరం అభిప్రాయాలు కలబోసుకొని శ్రామిక ప్రజలు కార్యరంగంలో దిగిన వుద్యమం మరో ఎత్తు. పార్కులలోనో, యితర ప్రభుత్వ స్థలాలలోనో టెంట్లు వేసుకొని ఈ అసమ, అన్యాయ సామాజిక వ్యవస్థ పట్ల, దీర్ఘకాలం నిరసన తెలిపే ఒక వినూత్న పోరాట రూప మిది. ఇది అమెరికాలో ప్రారంభమై ప్రపంచ దేశాలన్నిటికి విస్తరించిన వుద్యమం. వీరు అరెస్టులను, నిర్బంధాలను యెదుర్కొని 'మేము 99%. మీరు ఒక్క శాతం. ఈ ప్రభుత్వాలు 99 శాతం ప్రజలకోసమా? ఒక్క శాతం పెట్టుబడిదారులకోసమా?" అనే పెట్టుబడిదారీ విధానపు మౌలికత మీద ప్రశ్నను సంధించారు. అమెరికా సామ్రాజ్యవాదపు దోపిడి, దురాక్రమణలకు ప్రపంచ వ్యాపిత ప్రతిఘటన పెరుగుతుండటం ఒక అంశమైతే, దానికి ఆంతరంగికంగా తన ప్రజలనుండే ప్రతిఘటన పెంపొందుతుండటం మరొక అంశం. యిదే నేడు ముఖ్యమైన అంశం.

లాటిన్ అమెరికా: నయా ఉదారవాద విధానాలదాడికి మొదటగాను, అతి తీవ్రంగానూ గురయినవి లాటిన్ అమెరికా దేశాలు. 1980-90 దశాబ్దాలలో యివి ప్రపంచంలో అత్యంత రుణగ్రస్త దేశాలుగా రూపొందాయి. సామ్రాజ్యవాద దోపిడి, పీడన, అణచివేత, ఆధిపత్యం, జోక్యం, దురాక్రమణలను అతి మొరటుగా అనుభవిం చాయి. 21వ శతాబ్దం ప్రారంభం నుండి అక్కడ కొత్త గాలులు వీచడం ప్రారంభమయింది. ప్రజలు, దేశాలు ఈ దోపిడి, అణచివేతలకు వ్యతిరేకంగా భిన్నమైన రూపాల్లో పోరాటాలు చేశారు. చివరికి పార్లమెంటరీ ఎన్నికలపోరాట రూపాన్నుపయోగించుకొని ఖామ్రాజ్య వాద అనుకూల, నయా ఉదారవాద అనుకూలప్రభుత్వాలను గద్దె దించారు. అనేక దేశాల్లో సామ్రాజ్యవాదాన్ని, నయా ఉదారవాదాన్ని అనేక రూపాల్లో వ్యతిరేకిస్తున్న ప్రభుత్వాలను అధికారంలోకి తెచ్చుకున్నారు. ఇదొక నూతన సానుకూలరాజకీయ పరిణామం.

అరబ్ వసంతం: ఎంతో కాలంగా అభివృద్ధి నిరోధక రాచరిక నియంతృత్వాలక్రింద, మిలిటరీ నియంతృత్వాలక్రింద మ్రగ్గుతున్న అరబ్ ప్రజలు కూడా 2011లో పెట్టుబడిదారీ దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా, రాచరిక, మిలిటరీ నియంతృత్వాలకు వ్యతిరేకంగా సమరశంఖాన్ని పూరించారు. ఇంటర్నెట్‌నుపయోగించుకొని ఆర్గనైజ్ అయ్యారు. నియంతృత్వాలకు వ్యతిరేకంగా బూర్జువా ప్రజాస్వామ్యాల కోసం, సామాజిక న్యాయం కోసం లక్షలసంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చారు. వందలాది మంది ఈ పోరాటంలో తమ ప్రాణాలను బలిదానం చేశారు. వేలాది మంది జైళ్ల పాలయ్యారు. చిత్రహింసలకు లోనయ్యారు. ఫలితంగా అనేక దేశాల్లో నియంతృత్వాలు కుప్ప కూలాయి. ఈ పోరాటాలలో కార్మికవర్గం, మధ్యతరగతి ప్రజలు కీలకపాత్ర పోషించారు. ఈ పోరాటాలు పూర్తిగా ఆశించిన ఫలితాలు యివ్వని మాట నిజమే. మతవాద లేదా మతోన్మాద పార్టీలు అధికార పీఠాలను అధిష్టించి ప్రజలఅణచివేతకు పూనుకుంటున్న మాట వాస్తవమే. పెట్టుబడిదారీ వ్యవస్థ మార్పు కోసం, ప్రజాస్వామ్యం, సోషలిజంలసాధన కోసం జరిగే పోరాటాలలో యివి కొన్ని వుపదశలు మాత్రమే. చారిత్రిక పరిణామంలో యిది అవసరమైన, అనివార్యమైన వుపదశలు మాత్రమే.

ఆర్థికాభివృద్ధి రేటు కొంత ఎక్కువగా వున్న రష్యా, చైనా, ఇండియా లాంటి దేశాలలోనూ వర్గ వైరుధ్యాలు, వర్గ పోరాటాలు తీవ్రతర మవుతున్నాయి. నయా వుదారవాద విధానాలను అనుసరిం చటమే యిందుకు కారణం. ప్రాపంచీకరణ, ప్రయివేటీకరణ, ఉదారీ కరణ దుష్ఫలితాలను, తత్పర్యవసానమైన ఆర్థిక సంక్షోభాలను ఈ దేశాలు కూడా తలకెత్తుకోవలసి వస్తున్నది. పర్యవసానంగా వర్గ పోరాటాలవిజృంభణను చవిచూడవలసి వస్తున్నది.

ప్రపంచంలో అనేక రూపాలలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇది సహజమే. సమాజాభివృద్ధి క్రమంలో భాగమే. సమాజం అనేక దశలు, వుపదశలగుండా పురోగమిస్తుంది. ప్రజా పోరాటాలు, వర్గ పోరాటం కూడా పాత రూపాలలోనే జరగవు. అనేక కొత్త రూపాలను తీసుకునే అవకాశముంటుంది. పాత, కొత్తలమేలు కలయికగా వుండే అవకాశం వుంటుంది. ప్రజలనిర్మాణం కూడా పాత రూపాలలోనే కాకుండా అనేక కొత్త రూపాలను తీసుకునే అవకాశం వుంటుంది. కమ్యూనిస్టులు పిడివాదులు కాదు. నూతన మార్పులన్ని టినీ అవగాహన చేసుకొని, వాటి కనుగుణంగా వ్యవహరిస్తారు. వాటిని ఆహ్వానిస్తారు.

పెట్టుబడిదారీ విధాన వ్యవస్థాగత సంక్షోభం నయా వుదారవాద విధానాలద్వారా మరింత తీవ్రమవుతుంది. పరిష్కరింపరానిదిగా మారుతుంది. దీని వల్ల ప్రపంచంలో అనేక వైరుధ్యాలు తలెత్తుతాయి. తీవ్ర రూపం దాలుస్తాయి. వీటిని వుపశమింప చేయటానికి, తాత్కాలి కంగానైనా ఈ వైరుధ్యాలనుండి బయటపడటానికి పెట్టుబడిదారీ వర్గం ఏమి చేస్తుందనే దానిని బట్టి కార్మికవర్గ వ్యూహం, ఎత్తుగడలూ వుంటాయి. వుండాలి కూడా. ఏదేమైనా రానున్న కాలం పెట్టుబడిదారీ వైరుధ్యాలు తీవ్రమయ్యే కాలం వర్గ పోరాటాలు ప్రజ్వరిల్లే కాలం. పశ్చిమ దిక్కు నుంచి వీస్తున్న కొత్త గాలులు చెబుతున్న సత్య మిది.

శ్రీశ్రీ = ప్రజా ఉద్యమాలు

రాబందులరెక్కలచప్పుడు
పొగ గొట్టపు భూంకార ధ్వని
అరణ్యమున హరీంద్ర గర్జన
పయోదర ప్రచండ ఘోషలమధ్య
సిందూరం, రక్తచందనం
బందూకం, సంధ్యా రాగం
పులిచంపిన లేడినెత్తురూ
ఎగరేసిన ఎర్రజెండాను

చేత పట్టుకుని మహాప్రస్థానం గీతాలద్వారా శ్రీశ్రీ సాహిత్యంలో భూకంపం సృష్టించడం అంత వరకూ భావకవిత్వం, జాతీయోద్యమం పేర తిరిగి సాంప్రదాయిక కవిత్వం 'అడావుడి' చేస్తుంటే శ్రీశ్రీ సాహిత్యాన్ని భూమార్గం పట్టించిందు. 'కుక్క పిల్లా, అగ్గిపుల్లా, సబ్బు బిళ్ళా - హీనంగా చూడకు దేన్ని! అన్నీ కవితామయమేనోయ్, అని కవిత్వానికి కొత్త నిర్వచనమిస్తూ పతితుల్ని, భ్రష్టుల్ని, బాధాసర్పదష్టుల్ని, దగాపడిన తమ్ముళ్ళను వీపుతట్టుతూ మీ ప్రేవులు కనలి కనలి / మీ రక్తం కలిగి కలిగి/ మీ నాడులు కదిలి కదిలి / హతాశుయులై ఏడవకండని, మీకు తోడుంటానని "మీ కోసం కలం పట్టానని" ఓదార్చుతాడు. చిరకాలం జరిగిన మోసం / బలవంతులదౌర్జన్యాలూ / ధనవంతులపన్నాగాలు ఇంకానా! ఇకపై చెల్లవు ఒక వ్యక్తిని మరొక వ్యక్తి / ఒక జాతిని వేరొక జాతి / పీడించే సాంఘిక ధర్మం / ఇంకానా? ఇకపై సాగదు అని సమాజ చారిత్రిక గమనాన్ని శాస్త్రీయంగా వివరిస్తూ దోపిడీ వ్యవస్థపై చంద్రకోలలేపి, మరో ప్రపంచం / మరో ప్రపంచం / మరో ప్రపంచం పిలిచింది! / పదండి ముందుకు / పదండి త్రోసుకు / పోదాం పోదాం పైపైకి అంటూ అందరితో కలిసి కవితా ప్రస్థానాన్ని ప్రారంభిస్తూ అగ్ని కిరీటపు ధగధగల్ని / ఎర్ర బావుటా నిగనిగల్ని సాహిత్యాకాశంపైకి ఎగజిమ్మినడు.

1933 నుండి 1947 వరకూ, దాదాపు 15 సంవత్సరాల కాలంలో రచించిన గీతాల్ని 1950లో "మహాప్రస్థానం"గా ప్రచురించ బడిన కవిత్వం సాహిత్య జగత్తులో కొత్త దృష్టిని, కొత్త ఒరవడిని, కొత్త మార్గాన్ని ప్రవేశపెట్టింది. అప్పటి దాకా వున్న కవిత్వం పట్ల భావనల్ని, కవితా వస్తువుల్ని, వర్ణనల్ని, అలంకారాల్ని నడ్డి విరగ్గొట్టి కొత్త డిక్షన్‌ను, కొత్త వస్తువును, కొత్త వేగాన్ని, కొత్త పోలికల్ని కవిత్వంలో ప్రవేశపెట్టిందు. అలజడి మా జీవితం / ఆందోళన మా వూపిరి / తిరుగుబాటు మా వేదాంతం అని కవిత్వ తాత్వికతను ప్రకటించిందు. అభిప్రాయాలకోసం / బాధలు లక్ష్యపెట్టని వాళ్ళు / మాలోకి వస్తారు.

ముందుకు పోతాం మేము / ప్రపంచం మావెంట వస్తుందని అభ్యుదయ మార్గాన్ని తన మార్గంగా ప్రకటించుకున్నాడు. శ్రీశ్రీ కూడా తన కాలపు కవులవలే సాంప్రదాయక భావ కవిత్వంతో తన కవితా ప్రయాణాన్ని ఆరంభించిందు. తన చుట్టూవున్న సమాజం, పరిసరాలు మన దేశంలోనూ, ప్రపంచంలోనూ జరుగుతున్న మార్పులు శ్రీశ్రీని కొత్త దృక్కోణంతో చూసే విధంగా తయారు చేసినయి. 1930ల్లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఆవరించింది. ఈ ఆకలి దశాబ్దం (Hungry Thirties)లో భారత దేశంలో ఆకలి, కరువు కాటకాలకోరల్లో చిక్కుకుని విల్లవిల్లాడింది. మరోవైపు రష్యాలో కమ్యూనిస్టుల నాయకత్వంలో నిరంకుశ జార్ చక్రవర్తి సామ్రాజ్యం నేలకూల్చబడింది. లెనిన్ నాయకత్వంలో కార్మికవర్గ రాజ్య స్థాపన జరిగి పెట్టుబడిదారీ దేశాల్లో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రష్యాలో కార్మికవర్గ ఎర్రజెండా రెపరెపలాడింది. ప్రపంచ వ్యాప్తంగా వున్న శ్రమజీవులకు శ్రామికశక్తిపైన విశ్వాసాన్ని శ్రామిక రాజ్య స్థాపనకు విప్లవ పోరాట మార్గాన్ని అందించింది. ఈ పరిణామాలన్నీ భారతీయ సాహిత్యంపై ప్రభావం చూపినయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పాశ్చాత్య దేశాల్లో యుద్ధానికి కారణమైన పెట్టుబడి నాగరికతపై విముఖత ఏర్పడింది. ఫలితంగా పాత నియమాలు, పాత సాంప్రదా యాల్ని కాలదన్ని, సాహిత్య కళా రంగాల్లో కొత్త పోకడల్ని ప్రవేశ పెట్టాయి. అందులో భాగంగా డాడాయిజం, క్యూబిజం, ఇంప్రెషనిజం, సర్రియలిజం మొదలైన ధోరణులు సాహిత్యంలో ప్రవేశించాయి.

అయితే, తెలుగు సాహిత్యంలో యివి ప్రయోగాలుగానే పేలవంగా మిగిలి పోయాయి. శ్రీశ్రీని గూడా 1930-40లమధ్య ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, మార్పులు, అదేకాలపు లండన్ అభ్యుదయ రచయితలమానిఫెస్టో, ఆడెన్, స్పెన్‌డార్ మొదలైన కవులరచనలు, స్పెయిన్ అంతర్యుద్ధం, రష్యా విప్లవం గాఢంగా ప్రభావితం చేసినవి. ఫలితంగా అంతవరకూ అనుసరిస్తోన్న మార్గాన్ని 'పరిత్యజించి' 'నవీన' మార్గాన్ని ఎంచుకున్నాడు.

శ్రీశ్రీ అనగానే మహాప్రస్థానం గుర్తుకొచ్చేంతగా సాహిత్య కారులపై ఆ గీతాలు ప్రగాఢ ముద్ర పడవేసినయి. ఇందులోని ప్రతి కవితా ప్రచండ ఝంఝామారుతాన్ని వీస్తుంది. ఒక కోటి జలపాతాల పాటలు శతకోటి సముద్ర తరంగాలమ్రోతలూ విన్పింపజేస్తాయి.

మహాప్రస్థానం, జయభేరి, నవకవిత, కవితా! ఓ కవితా!, ప్రతిజ్ఞ, దేశచరిత్రలు, జగన్నాధుని రధచక్రాలు, వ్యత్యాసాలు, గర్జించు రష్యా, కొంపెల్ల జనార్ధనరావు కోసం రాసిన కవితలు చదువరులను మరో లోకంలోనికి తీసుకువెళ్తాయి.

శ్రీశ్రీ కవిత్వం ఒక నిర్దిష్ట సామాజిక పరిస్థితులనేపధ్యంలోంచి వచ్చిందే. కనుక పాఠకులు సహానుభూతి పొంది, తమను తాము ఆ కవిత్వంలో చూసుకుని కవిత్వంలో భాగస్వాములౌతారు.

1955-'65లమధ్య సాంస్కృతిక రంగంలో స్తబ్దత నెలకొంది. ప్రజా పోరాటాలను పార్లమెంటరీ పంధా చుట్టూ తిప్పుతూ, సమస్యలకు సంస్కరణలే పరిష్కారాలుగా చూపిస్తున్న సమయం అది. బూర్జువా ప్రజాస్వామ్యం బూటకంగా, స్వాతంత్ర్యం "స్వాహా"తంత్రంగా అనుభవంలోకి వస్తున్న కాలం. ఈ కాలంలో శ్రీశ్రీ (1955-65) రాసిన కవిత్వం 1970లో 'ఖడ్గ సృష్టి'పేర ప్రచురణ అయ్యింది.

నమ్ము

ఈ గొంగళి వయస్సు ఇరవై / అయిదేళ్ళు మోసుకొచ్చాం. స్వరాజ్యం మూట - మూట విప్పితే ఏమి లేదు అని స్వాతంత్ర్యం యొక్క బూటకత్వాన్ని ఎత్తి చూపుతాడు. అవినీతి భారీ పరిశ్రమలో / అన్యాయాలధర పెంచేసి స్వాతంత్ర్యాన్ని బ్యాంకుల్లో వేసుకుని / చక్ర వడ్డీ తిప్పే కామందులకు ఈ స్వాతంత్ర్యం ఎంత విందు భోజనమో 'ఖడ్గ సృష్టి' కవితలో వివరిస్తాడు.

అధిక ధరలు, నిరుద్యోగం, అవినీతి, పాలక వర్గాల అక్రమార్జనలు, దోపిడీల్ని ప్రశ్నించిన వాళ్ళకు ప్రభుత్వాలు అణచివేతల్తో సమాధానం చెప్తున్నాయి. దీనినే 'మహారణ్యంలో మధ్యాహ్నం లాగ ఒక స్తబ్దత, నిశ్శబ్దత / ఎక్కడేన ఒక పక్షి ఎగిరితే ఎక్కడో ఒక ఆకు రాలిన చప్పుడు అని స్వేచ్ఛ కోసం ఎవరైనా ఎదిరిస్తే దమనకాండతో కాల్పుల్తో జరిపే అణచివేతను 'ఎక్కడో ఒక ఆకురాలిన చప్పుడు'గా పాలక వర్గాలహత్యాకాండను ధ్వనిస్తాడు.

పోలీసుల రాజ్యమిది / పోలింగొక బూటకం / ఫాసిజమై మారుతోంది / ప్రజాస్వామ్య నాటకం అని బూటకపు ప్రజాస్వామ్యాన్ని నిరసిస్తాడు. అధికారం చలాయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు ప్రజాందోళనలపై కర్కశ దమనకాండను జరుపుతూనే మరోవైపు 'అహింస' మంత్రాన్ని జపిస్తున్నప్పుడు అహింస ఒక ఆశయమేగా? / ఆయుధం ఎప్పుడూ కాదు / ఆశయం సాధించాలంటే / ఆయుధం అవసరమే మరి / ఆశయాలు సంఘర్శించేవేళ / ఆయుధం అలీనం కారాదు. అందుకే అంటున్నాను నేను / ఆయుధం అందుకోమని ఇది సమాన ధర్మాన్ని స్థాపిస్తుంది / నవీన మార్గాన్ని చూపిస్తుందని, వర్గ సంకర రాజకీయాలను తూర్పారబట్టుతూ సాయుధ పోరాటాలద్వారానే నవ సమాజం ఆవిర్భవిస్తుందని నక్సల్బరీ పోరాటం ఆరంభం కాక ముందే సూచనప్రాయంగా చెపుతాడు. ఈ కాలమంతా ప్రపంచంలో ఎక్కడ పోరాటాలున్నా తన సంఘీభావాన్ని తెలుపుతూ వచ్చిందు.

1967లో నక్సల్బరీ వెనువెంటనే శ్రీకాకుళం, గోదావరి లోయ రైతాంగ పోరాటాలు వెల్లువెత్తాయి. వామపక్షాలరివిజనిస్టులపంధాను తిరస్కరిస్తూ భారతదేశ రాజకీయ ఎజెండాలోకి సాయుధ విప్లవ పోరాటాన్ని తెచ్చాయి. ఈ పరిస్థితుల్లోనే శ్రీశ్రీ షష్టి పూర్తి సందర్భంగా "రచయితలారా మీరెటు వైపు" అంటూ విశాఖ విద్యార్థులు నిలదీయడం, చేవచచ్చిన అభ్యుదయ రచయితలసంఘం శ్రీశ్రీకి సన్మానాన్ని తలపెట్టడం, నక్సల్బరీ తరం రచయితల్తో గొంతు కలిపి శ్రీశ్రీ తన సన్మానాన్ని బహిష్కరించి విప్లవ రచయితలసంఘం ఏర్పాటులో ప్రధాన పాత్ర తీసుకోవడం - శ్రీశ్రీ తన మనసంతా ప్రజలవైపే వుందన్న విషయాన్ని స్పష్టం చేసిందు. శ్రీశ్రీ నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ రైతాంగ పోరాటాలప్రేరణతో రాసిన కవితలు 'మరో ప్రస్థానం' పేర 1980లో వెలువడ్డాయి.

ఆగ్రహం కొరడా చేబూని / సాయుధ బీభత్సుని సారధినై / మంటలచేత మాట్లాడించి / రక్తం చేత రాగాలాపన చేయిస్తూ మరో ప్రస్థానాన్ని ఆరంభించాడు. ఉగాది కవి సమ్మేళనాలకోసం రాసిన గీతాల్తో సహా యిందులోని ప్రతికవితా విప్లవ సందేశాన్ని అందించేవే, విప్లవోద్యమ పతాకాన్ని ఎగురవేసేవే. మహాప్రస్థానంలోవలె కాకుండా కఠిన శబ్ద ప్రయోగాలను కొంచెం దూరంగా వుంచి, వేగాన్ని, వాడిని తగ్గించకుండానే జన సామాన్య భాషను వుపయోగించడం ద్వారా ప్రజలకు దగ్గరయ్యేందుకు కవిత్వం రాసిందు. ఝంఝు, నిన్నటి ఝట్కావాలా, దూది పులి మీద పుట్ర, మట్టిపులి, భూమ్యాకాశాలు, ఉగాది గీత (21.3.82) తుదిపయనం తొలి విజయం అత్యంత అద్భుతమైన కవితలు.

కవిత్వ రచనల్తోనే కాకుండా శ్రీశ్రీ విప్లవ సాహిత్యోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా ప్రజల్ని చైతన్యపరిచాడు. విరసం అధ్యక్షుడిగా, పౌరహక్కులసంఘం అధ్యక్షుడిగా, భారత చైనా మిత్ర మండలి అధ్యక్షుడిగా గ్రామ గ్రామాన తిరుగుతూ రాష్ట్ర మంతా పర్యటించిందు. పాటల్ని రాసి పాడుతూ ప్రజల్ని చైతన్య పరిచిందు. విప్లవ రచయితలనిర్బంధానికి వ్యతిరేకంగా ఆనాటి ముఖ్యమంత్రిపై ఓరోరి వెంగళప్పిగా - జలగవు, నీ/ పేరంటే కడుపు నొప్పిరా / ఎదిరిస్తా చూడు నీజులుం ధగిడీకే / వదిలిస్తాం నేడే నీకిలుం / ఎందుకు నీకింతగా హజం - బ్లడీఫూల్ / ఇక సాగబోదు నీ జులుం" అని అడుగులు వేస్తూ పాడుతూ ప్రజల్ని వుత్తేజపరుస్తూ సర్కారు పాశవిక దమనకాండను నిరసించాడు. మరో ప్రస్థానంలోని ఎన్నో చరణాలు విప్లవోద్యమంలో నినాదాలయినవి. "దొంగనోట్ల దొంగ ఓట్ల / రాజ్యం ఒక రాజ్యమా? / లంచగొండి వెధవలిచ్చు / సాక్ష్యం ఒక సాక్ష్యమా లాంటి గీతాల్ని నినదిస్తూ సాగే ఉద్యమ జులూస్‌లు నరాల్లో విద్యుత్తును ప్రవహింపజేసేవి.

శ్రీశ్రీ కవిత్వంలోని డిక్షన్, ప్రయోగాలు, నడక, పదాలవిరుపు, వాడితనం, వేగం మొదలైన వాటిని ఎవ్వరూ అందుకోలేనంతటివి. అత్యంత ఆధునికం అని కొంత మంది కవులు చెప్పుకునే మినీ కవిత్వాన్ని ఐ, అవతలిగట్టు, ఆః! పరాజితులు మొదలైన వాటిని 1950కి ముందే శ్రీశ్రీ రాసిందు. వ్లాదిమిర్ ఇల్యిచ్ లెనిన్ పేర సుదీర్ఘ కవిత రాసిందు. సర్రియలిస్టు కవిత్వం రాసిందు. నిశిత హాస్యం, నీతి, ఉపదేశం కలగలిపి సిరిసిరి మువ్వ, ప్రాసకీడలు, లిమ్మాబుక్కులు (పిప్రాలి) పేర కార్టూన్ కవిత్వం రాసిందు. మూలానికే వన్నె తేచ్చేట్టుగా చేగువేరా, టర్కిష్ కవి నజీమ్ హిక్మత్, పాబ్లోనెరూడా, పాల్ ఎలార్డ్, సెజార్ వల్లెజో, అంగోలా కవి ఆగస్టినో నెటో, కోమోజో, డిలాన్ థామస్, మయకోవస్కీ వంటి ప్రముఖ కవులకవితల్ని అనువదించి అందించాడు. కథలు, వ్యాసాలు, లేఖలు, రేడియో నాటికలు యిట్లా అన్ని సాహిత్య ప్రక్రియల్లో శ్రీశ్రీ తనది అనితర సాధ్యమైన మార్గమని నిరూపించుకున్నాడు. మహాప్రస్థానం మొదలుకొని మరో ప్రస్థానం వరకూ ప్రజా పోరాటాలే ఆత్మగా సాహిత్య జీవితాన్ని కొనసాగించాడు.

శ్రీశ్రీ కవిత్వాన్ని నిర్దిష్ట సామాజిక స్థితిగతులతో జోడించ కుండా అర్థం చేసుకోలేము. సాహిత్యం, సమాజం బింబ ప్రతిబింబాల్లాటివి. ప్రజా సాహిత్యం, సామాజిక పరిస్థితుల్ని ప్రతిబింబించే వరకే కాకుండా, సమాజ పురోగమనానికి అప్పటికి అందుబాటులో వున్న అభివృద్ధికర సామాజిక సిద్ధాంతాల్ని ఆలంబనగా చేసుకొని బాటలు వేయాలి. కనుక, కవి ఒక నిర్దిష్ట సమాజంలో చోటు చేసుకుంటున్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మార్పులపట్ల నిరంతరం జాగరూకతతో వుండాలి.

గొప్ప ప్రజా సాహిత్యాన్ని సృష్టించిన శ్రీశ్రీ కూడా తప్పులకు మినహాయింపు కాలేక పోయిందు. భూమయ్య, కిష్టాగౌడ్, ఉరి శిక్షలరద్దు కోసం ఉద్యమాన్ని నడిపిన శ్రీశ్రీ, ఏ ప్రభుత్వమైతే ఉరి తీసిందో ఆ ప్రభుత్వాన్ని, ఎమర్జెన్సీని ప్రకటించి దేశ వ్యాపితంగా ప్రజాస్వామిక వాదుల్ని జైళ్ళల్లో కుక్కిన ప్రభుత్వాన్ని 'వామపక్ష నితంతృత్వం'గా భావించడం ఎంతో తప్పు. ఇందిరాగాంధీ ప్రకటించిన '20 సూత్రాలపధకంపై పాట రాయడం ఎంతో తప్పు. ఆ తర్వాత ప్రజలకు సంజాయిషీ యిచ్చుకుని తప్పును ఒప్పుకున్నా శ్రీశ్రీ కవితా ప్రస్థానంలో మాయనిమచ్చలే.

ప్రత్యేక తెలంగాణా వుద్యమం విషయంలోనూ శ్రీశ్రీ సరిచేసుకోలేని తప్పు చేసిందు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణా ప్రజలు గత అరవై సంవత్సరాలుగా ఉద్యమాలు చేపడుతున్నరు. గైర్‌ముల్కీ గోబాక్ వుద్యమం, ఇడ్లీ సాంబర్ గో బాక్ వుద్యమం, 1969 తెలంగాణా వుద్యమ కాలం, ప్రత్యేక ఆంధ్ర వుద్యమ కాలంలోనూ సజీవంగా వుండిన శ్రీశ్రీ తెలంగాణా ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం చేస్తున్న పోరాటాల్ని, సీమాంధ్ర పెట్టుబడిదారులసర్కారు అణచివేతల్ని, హత్యాకాండను పట్టించుకోలేక పోగా, సీమాంధ్ర సర్కారు సమైక్యతా రాగాన్నే కవిత్వంలో పలికించిందు.

తెలుగు తల్లిని పంచుకుంటారా?
తెలుగు నెత్తురు పంచుకుంటారా?
తెలుగు గొంతు చించుకుంటారా?
తెలుగు తాడే తెంచుకుంటారా? అని అంటూ (29.3.73 ఉగాది కవిత రేడియో ప్రసారం)

(మిగతా 12వ పేజీలో)

తిరగదోడేందుకు దిగాడు. దానిపై బేరసారాలప్రక్రియకి ఢిల్లీ అధిష్టానం స్థాయిలో తలపడ్డాడు. ఈ క్రమంలోనే వై.యస్. హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ఇది యాదృచ్ఛికమైన చర్యా? సంకల్పిత చర్యా? అన్నది అప్రస్తుతమైనది. కేజీ బేసిన్‌లో నిర్మించుకున్న తన ఆర్థిక సామ్రాజ్య పరిరక్షణకై వైయస్‌ను వదిలించుకోవాల్సిన అవసరం 'రిలయన్స్' సంస్థ ముందుకొచ్చింది. సరిగ్గా అలాంటి కీలక సమయంలో జరిగిన మరణం ప్రమాదం కాదనీ; అది హత్యేనన్న అనుమానాలకి కారణం కావడం గమనార్హం.

కోస్తాంధ్రలో ఎదిగిన పారిశ్రామిక, వాణిజ్య సంపన్న శక్తులు ఒకప్పుడు కోస్తాతోపాటు తెలంగాణాలోని సహజ వనరులను కొల్లగొట్టి బాగా బలపడ్డాయి. అందులో ఒక సెక్షన్ నేడు అఖిలభారత స్థాయిలో పోటీ యివ్వగలిగే స్థాయికి ఎదిగింది. మరో సెక్షన్ సీమాంధ్రతోపాటు తెలంగాణాలో కొల్లగొట్టే పనిలోనే వుండి పోయింది. ప్రథమ శ్రేణి సీమాంధ్ర కార్పోరేటు శక్తులకి తెలంగాణా వనరులు రెండో ప్రాధాన్యతలోకి వెళ్ళిపోయాయి. అవి అఖిలభారత స్థాయి వనరులకై పోటీ పడే స్థాయికి ఎదిగాయి. ఒరిస్సాలోని పరదీప్ నౌకాశ్రయాలభారీ నిర్మాణాలనుంచి గుజరాత్ కోస్టల్ కారిడార్‌లవరకూ పోటీ పడగలుగు తున్న పరిస్థితి యాదృచ్ఛిక పరిణామం కాదు. అంతేకాకుండా ఆఫ్రికా, గల్ఫ్ దేశాలలో భారీ కాంట్రాక్టులు పొందే స్థాయికి కూడా ఎదిగాయి. ఈ ఎగువ శ్రేణి సీమాంధ్ర కార్పోరేటు శక్తులనుంచి అంబానీ వంటి అఖిలభారత స్థాయి కార్పోరేటు శక్తులు యిటీవలపోటీని ఎదుర్కొంటున్నాయి. ద్వితీయ శ్రేణి సీమాంధ్ర కార్పోరేటు శక్తులఆర్థిక ప్రయోజనాలకోసం 'సమైక్యాంధ్ర' నినాదం అవసరమవుతున్నది. కానీ ప్రథమ శ్రేణి సీమాంధ్ర కార్పోరేటు శక్తుల ఆర్థిక ప్రయోజనాలకోసం కేజీ బేసిన్‌లో వాటాలడిమాండు అవసరమవుతున్నది. ఏక కాలంలో ఈ రెండు శ్రేణుల సీమాంధ్ర కార్పోరేటు శక్తుల ఆకాంక్షలను సంతృప్తి పరిచేందుకు వై.యస్. ప్రభుత్వం పూనుకున్నది. వై.యస్. ఆకస్మిక మరణం తర్వాత ఆయన అంత వరకూ ప్రాతినిధ్యం వహించిన కార్పోరేటు శక్తుల పొందికలో కొన్ని మార్పులొచ్చాయి. అవి కొత్త రాజకీయ సమీకరణలకు తెరలేపాయి.

వై.యస్. మరణానంతర పరిస్థితిని కేంద్రం అవకాశంగా ఎంచుకున్నది. అంబానీ వంటి కార్పోరేటు శక్తులను కేజీ బేసిన్‌లో సుస్థిరపరిచే అవకాశమది. బహుశా ఈ అంచనాతోనే తెలంగాణా రాష్ట్ర డిమాండు పట్ల కేంద్రం ఆనాడు సానుకూలంగా స్పందించి వుండొచ్చునేమో! తద్వారా అంబానీకి పోటీగా ఎదిగొచ్చిన సీమాంధ్ర కార్పోరేటు శక్తులరాజకీయాధికారాన్ని ఒకింత దెబ్బతీయవచ్చని కేంద్రం భావించి వుంటుందేమో! కానీ లగడపాటి రాజీనామాస్త్రంతో కేంద్రం చిక్కుల్లో పడింది. సీమాంధ్ర కార్పోరేటు శక్తులు వివిధ రాజకీయ పార్టీలఆసరాతో కేంద్రం మీద వత్తిడి తెచ్చాయి. తత్ఫలితంగా వై.యస్. మరణానంతరం బలహీన పడుతుందనుకున్న 'రాష్ట్ర రాజకీయాధికారం' మరింత బలపడినట్టు అయ్యింది. ఈ పరిణామాన్ని కేంద్రం పరిగణనలోకి తీసుకొని వుండొచ్చు. దీనితో సీమాంధ్ర కార్పోరేటు శక్తులలోని ప్రథమ శ్రేణి నుంచి ద్వితీయ శ్రేణిని 'విభజించి – పాలించు' పద్ధతిలో విడగొట్టే ఎత్తుగడకి కేంద్రం దిగి వుండొచ్చు. రాజకీయంగా జగన్ నుంచి విడగొట్టుకుంటే, తెలంగాణా రాష్ట్రాన్ని యివ్వబోమన్న సంకేతాన్ని కేంద్రం తనదైన దౌత్య పద్ధతిలో పంపించి వుండొచ్చు. తద్వారా ప్రధానంగా తెలంగాణ సహజ వనరులను కొల్లగొడుతున్న సీమాంధ్ర కార్పోరేటు శక్తులను సంతృప్తి పరిచే ప్రక్రియకి దిగివుండొచ్చు. ఈ నేపథ్యం నుంచే లగడపాటి, ఉండవల్లి వంటి వై.యస్. అనుచరులు తదనంతర కాలంలో జగన్ నుంచి దూరమై వుండొచ్చు. కానీ అఖిలభారత స్థాయి కార్పోరేటు శక్తులకి పోటీ యిచ్చే స్థాయికి ఎదిగిన ప్రథమ శ్రేణి సీమాంధ్ర కార్పోరేటు శక్తులు మాత్రం జగన్‌ను వదులుకోలేదు. పైగా ఆయనకి ఆర్థిక దన్నుగా రూపొందడం గమనార్హం!

సి.బి.ఐ. నిరంతర విచారణ, వేధింపులకి నిమ్మగడ్డ, మ్యాట్రిక్స్ వంటి కార్పోరేటు శక్తులు సైతం 'క్విడ్–ప్రో–కో' ఆరోపణలకి బలం చేకూర్చే సాక్ష్యాలు యివ్వడం లేదు. 'జగన్ ఆనాడు చెబితేనే పెట్టుబడులు పెట్టాము' అంటూ ఒక్క ఇన్వెస్టర్‌తో కూడా సిబిఐ సాక్ష్యం చెప్పించ లేక పోయింది. అలాంటి ఒక్క సాక్ష్యం చెప్పినా కేసులో లేకుండా వదిలేస్తామని వారికి సిబిఐ అనేక హామీలిచ్చి వుంటుంది. బి.పి. ఆచార్య, శ్రీలక్ష్మి వంటి అధికార్లు కూడా అలా చెప్పలేదు. నిజానికి సాక్షిలోకి వచ్చిన పెట్టుబడులు సిబిఐ ఆరోపించినట్లు 'క్విడ్–ప్రో–కో' పద్ధతిలో వచ్చినవనుటలో ఎలాంటి సందేహం లేదు. అయితే అది ఒక్క సాక్షికే పరిమితం కాదు. అంతకంటే ముందే 'ఈనాడు' సంస్థలో రిలయన్స్ షేర్లు లేదా పెట్టుబడులు కూడా యిలా వచ్చినవే! అది నిజమా? అబద్ధమా? అన్నది ప్రశ్న కాదు. ఇంత హడావుడి చేసిన సిబిఐ సంస్థ కూడా తన ఆరోపణలను చట్ట ప్రకారం రుజువు చేయడానికి ఒక్క ఇన్వెస్టర్‌తోనైనా ఎందుకు సాక్ష్యం చెప్పించలేక పోయిందన్నదే అసలు ప్రశ్న! సి.బి.ఐ. సామ, దాన, బేధ, దండోపాయాలు ఎందుకు ఫలించలేదనేది అసలు ప్రశ్న! దీనిని బట్టి జగన్ రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్థిక శక్తులు చాలా దృఢమైన ఐక్యతను ప్రదర్శిస్తున్నట్లు అర్థం చేసుకోవాలి. వై.యస్. మరణించిన తర్వాత కూడా అవి తమ ఆర్థిక, వాణిజ్య, పారిశ్రామిక విస్తరణ లక్ష్యాన్ని వదులుకోదలుచుకోలేదు. అందు కోసం జైలులో కొంత కాలం ఇబ్బందులు అనుభవించడానికి కూడా మానసికంగా సిద్ధమయ్యాయని అర్థం చేసుకోవాల్సి వుంది.

జగన్ కోసం నిమ్మగడ్డ ప్రసాదు వంటి పారిశ్రామిక వేత్తలు అప్రూవర్‌గా మారకుండా ఎందుకింత దృఢంగా నిలబడ్డారంటూ సామాన్య ప్రజల్లో ఒక చర్చ జరుగుతున్నది. జగన్ అంతటి బలవంతుడు ఎలా అయ్యాడని విస్తుపోతున్నారు. జగన్ అద్భుత రాజకీయ శక్తులగూర్చి ప్రజల్లో ఓ రకం ప్రచారం జరుగుతున్నది. అది నిజం కాదు. నిమ్మగడ్డ ప్రసాదు, నవయుగ విశ్వేశ్వర్రావు, మేకపాటి, గాలి జనార్ధన్ రెడ్డి వంటి కార్పోరేటు శక్తులు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం జగన్‌ను ఓ రాజకీయ ప్రతినిధిగా ఎంచుకున్నాయి. ముమ్ముందు అఖిలభారత స్థాయిలో తమ వాణిజ్య సామ్రాజ్య విస్తరణకి వై.యస్. రాజకీయ వారసత్వాన్ని కొనసాగించుటకు అవి నిశ్చయించుకున్నాయి. అందులో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన నిమ్మగడ్డ, నవయుగలు ముందు వరసలో వున్నాయి. ఆర్థిక సామ్రాజ్య విస్తరణకి కుల, మతాలు అడ్డురావని కూడా ఈ పరిణామం వెల్లడిస్తున్నది. రాజకీయాలలోనే కుల, మత సెంటిమెంట్లు తాండ విస్తుంటాయి. వై.యస్. మరణిస్తే మరో వై.యస్.ను సృష్టించుకుంటామని కేంద్రానికి నిరూపించాలని పై కార్పోరేటు శక్తులు నిశ్చయించుకున్నాయి. అందుకే జగన్‌ను తమ రాజకీయ ప్రతినిధిగా నిలబెట్టుకున్నాయి. జగన్ భీతిల్లినా, మనోధైర్యం చెప్పి నిలబెట్టే బాధ్యతను ఈ కార్పోరేటు శక్తులు చేపడతాయి. అంతే తప్ప, జగన్ ముఖ్యమంత్రి పదవి కోసం నిమ్మగడ్డ వంటి ఇన్వెస్టర్లు జైళ్ళకి వెళ్ళడం లేదు. రాజకీయ శక్తులను ఆర్థిక శక్తులే శాసించి నడిపిస్తాయి. అంతేతప్ప, ఆర్థిక శక్తులను రాజకీయ శక్తులు నడిపించలేవు. జగన్‌లను నిమ్మగడ్డలు నడిపిస్తారు. నిమ్మగడ్డలను జగన్‌లు నడిపించలేరు. జగన్ స్వయంగా కార్పోరేటు ప్రతినిధి కూడా కావడంలో ఆర్థిక, రాజకీయ పాత్రలను కూడా పోషించగలడు. మార్క్సిస్టు దృక్కోణంలో అర్థం చేసుకోవాల్సిన విషయమిది.

ఈ నేపథ్యంలో తమను గెలిపించి కేంద్రానికి గుణపాఠం చెప్పండంటూ రాష్ట్ర ప్రజలవద్దకు వై.కా.పా. ముందుకొస్తున్నది. లక్ష కోట్లు దోచుకున్న గజదొంగలను ఓడించి నీతికి పట్టం కట్టండంటూ కాంగ్రెసు, టీడీపీలు రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ నేపథ్య పరిస్థితుల్లో దోపిడీ వర్గ రాజకీయ పార్టీలన్నీ రాష్ట్ర ప్రజలను ఆశ్రయించాయి. 'ప్రజలే న్యాయ నిర్ణేతలు' అంటూ ప్రజలపట్ల నక్క వినయం ప్రదర్శిస్తున్నాయి. ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు లేని రాజకీయ సుడి గుండంలోకి ప్రజలు యీడ్చబడ్డారు. రాష్ట్ర ప్రజలను కొల్లగొట్టే దోపిడీ శక్తులమధ్య అంతర్గత పోటీని పరిష్కరించుకున్నాక, ప్రజలమీద మరింత విశృంఖలదోపిడీ, పీడనలకి తెరలేస్తుంది. ఈనాటి అస్థిర పరిస్థితుల్లో సాగించలేని విశృంఖలదోపిడీని ముమ్ముందు సుస్థిర పరిస్థితులు ఏర్పడ్డాక అవి సాగించ గలవు. అలాంటి 'సుస్థిర' పరిస్థితి స్థాపనకై ప్రజలను అవి నేడు ఆశ్రయిస్తున్నాయి. అలాంటి దోపిడీ దొంగలముఠాలదీర్ఘకాలిక ప్రయోజనాలకోసం ప్రజలు పావులుగా వుపయోగపడకూడదు. పైగా ఈ కుమ్ములాటలద్వారా కలిసొచ్చే నూతన అవకాశాలను ప్రజలు వినియోగించుకోవాలి.

ఈ తాజా రాజకీయ సంక్షోభం పీడిత ప్రజలకు అనేక కొత్త రాజకీయ పాఠాలను బోధిస్తున్నది. తమ దోపిడీ రాజ్యానికి మూడవ, నాల్గవ స్తంభాలైన న్యాయ వ్యవస్థ, మీడియాలకు సమాజంలో ఎంతో పవిత్రతను ఆపాదించారు. నలభై ఏండ్ల క్రితం న్యాయ వ్యవస్థను విప్లవ కమ్యూనిస్టులు విమర్శిస్తే 'అయ్యో, రామ, రామ' అని పత్రికలు రాసేవి. 'మన పత్రికలు, పెట్టుబడిదార్ల విషపుత్రికలు' అన్నందుకే ఆనాడు శ్రీశ్రీ సాహసికుడయ్యాడు. ఈ రోజు బూర్జువా ప్రచార సాధనాలే న్యాయ వ్యవస్థను బహిర్గత పరుస్తున్నాయి. 'న్యాయమూర్తులు' డబ్బుకు గడ్డి తింటున్న నగ్న సత్యాలను సాక్షాత్తు దర్యాప్తు సంస్థలే బట్టబయలు చేస్తున్నాయి. మీడియా సంస్థలు కూడా ఒకరి గుట్టును మరొకరు బట్టబయలు చేసుకుంటున్నాయి. ఒకరి బ్రతుకును మరొకరు రచ్చ కెక్కించి ప్రజలకు వాస్తవాలు బోధిస్తున్నారు. 'క్విడ్–ప్రో–కో' ప్రాతిపదికతో విస్తరిస్తున్న క్రోనీ కాపిటలిజం గూర్చి విప్లవ, ప్రజాతంత్ర శక్తులు మాత్రమే గతంలో తూర్పార పట్టేవి. ఇప్పుడు ఒక పారిశ్రామిక ముఠా గుట్టును 'ఈనాడు' బజారుకీడిస్తే, మరో పారిశ్రామిక ముఠా బండారాన్ని 'సాక్షి' ఉతికి ఆరేస్తున్నది. సిబిఐ కేంద్రం చేతిలో కీలుబొమ్మ అనేది ఈ రోజు సామాన్య ప్రజలకి కూడా బోధ పడింది. రాష్ట్ర ప్రజలకు చెందిన లక్షలకోట్ల కేజీ బేసిన్ గ్యాస్ వనరులను కొల్లగొడుతున్న భారీ కుంభకోణాన్ని ఒకరు బహిర్గతపరుస్తుంటే, ఓబుళాపురం మైనింగ్ సంపదను కారుచౌకగా అప్పనంగా అప్పగించిన మరో భారీ కుంభకోణాన్ని మరొకరు బట్టబయలు చేస్తున్నారు. ఇవన్నీ నేటి దోపిడీ వ్యవస్థ నగ్న స్వరూపాన్ని నిత్యం పీడిత ప్రజలఎదుట బహిర్గత పరుస్తున్న దృశ్యాలే! ఇవన్నీ పాలక వర్గాలు పీడిత ప్రజలచేతికి అందిస్తున్న వర్గ పోరాట ఆయుధాలే!

ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, చంద్రబాబు, స్టాలిన్, కనిమెర, నవీన్ పట్నాయక్ వంటి రాజకీయనేతలందరూ కుటుంబ వారసత్వంగా ప్రమోట్ చేయబడుతున్న వాళ్ళే! స్వతంత్రంగా రాజకీయ చరిత్ర, అనుభవాలు లేక పోయినా, వంశపారంపర్య వారసత్వ పదవులు అనుభవించగలుగుతున్నారు. ఈ ఫ్యూడల్ అనువంశిక రాజకీయాలను ప్రగతిశీలశక్తులు మొదటి నుంచి సూత్ర రీత్యా వ్యతిరేకిస్తున్నాయి. కానీ తండ్రి లేదా తల్లి మరణానంతరం కొడుకు లేదా కూతురు లేదా కోడలు లేదా అల్లుళ్ళ ఎంపికలో ప్రజలప్రజాస్వామిక ఆకాంక్ష వుందంటూ ఇంత కాలం పాలకవర్గాలు బుకాయించేవి. అదే పాలక వర్గాలు ఈ రోజు జగన్‌ను ఉద్దేశించి వారసత్వ రాజకీయాలకి 'ఇది ప్రజాస్వామ్య వ్యవస్థా? లేదంటే, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థా?' అంటూ ప్రజలను చైతన్య పరుస్తున్నాయి. ఇది ప్రజల్లో ప్రజాస్వామిక చైతన్యాన్ని ఎంతో కొంత మేరకు పెంచుతుంది. ఇది ముమ్ముందు ప్రజాతంత్ర వుద్యమాలఅభివృద్ధికి వుపయోగపడుతుంది.

గనులు, పరిశ్రమలు, వ్యాపారాలు, వాణిజ్యాలు, పరిశ్రమలలో అదనపు విలువలదోపిడీ గూర్చి గతంలో మార్క్సిస్టు అర్థశాస్త్ర దృక్కోణంలో లెక్కలతో ఎవరైనా విమర్శిస్తే పత్రికలు రాసేవి కాదు. మద్యం, మైనింగ్, ఇసుక, క్వారీ మాఫియా ముఠాలలూటీ గూర్చి విమర్శిస్తే పట్టించుకునేవి కాదు. పాలకవర్గ మేధో వర్గాలు కూడా కొట్టి పారేసేవి. కానీ ఈ రోజు గాలి జనార్ధన్ రెడ్డి లూటీ తీరుతోపాటు ఆయా కంపెనీలలాభాలు, పన్నులఎగవేతలగూర్చి పాలక వర్గాలే పరస్పరం లెక్కలతో పూస గుచ్చినట్లు విమర్శించుకుంటున్నాయి. సామాన్య ప్రజలకు షేరు ధరలనుంచి లాభాలరేట్ల వరకూ బోధిస్తున్నాయి. దీని వల్ల విప్లవ శక్తులకి ముమ్ముందు పీడిత ప్రజలను 'వర్గ దోపిడీ' తీరుతెన్నులగూర్చి బోధించడం తేలిక అవుతుంది. ఇది కూడా భావి శ్రామికవర్గ విప్లవానికి వుపయోగపడే పరిణామమే!

దోపిడీ వర్గాలపై చేపట్టాల్సిన 'వర్గ పోరాటాల'లో పాల్గొని పీడిత పోరాట శక్తులు జైళ్ళకు వెళ్ళడం సహజమైనది. తద్భిన్నంగా దోపిడీ వర్గాలే జైళ్ళకు వెళ్తున్న పరిస్థితిని నేడు మనం చూస్తున్నాం. ప్రజలను జైళ్ళకు పంపించాల్సిన కార్పోరేటు శక్తులు నేడు తామే జైళ్ళకు వెళ్ళి, తమ విడుదలకి సహకరించండంటూ ప్రజలను అభ్యర్థించడం విశేషం! 'వాన్‌పిక్' వంటి ప్రాజెక్టులు వేలాది కుటుంబాలను నిర్వాసితులను చేశాయి. తమ భూములు, నివాస హక్కులపరిరక్షణకై వుద్యమించిన పేద ప్రజలను 'వాన్‌పిక్' యాజమాన్యం జైళ్ళకు పంపించింది. ప్రజలస్వేచ్ఛను నిషేధించింది. ఇప్పుడు అదే 'వాన్‌పిక్' యజమాని జైలుకు వెళ్ళాడు. ప్రజలను నిర్వాసితులను చేసేందుకు అతడికి గల'స్వేచ్ఛ' నియంత్రించ బడింది. నిన్నటి వరకూ 'వాన్‌పిక్' చేత బాధితులైన ప్రజలఅండదండలు కావాలని 'వాన్‌పిక్' భాగస్వామి బాలినేని (ఒంగోలు వై.కా.పా. అభ్యర్థి) నేడు అభ్యర్థించడం గమనార్హం! యిలాంటి అనేక విశేషాలనూ, అద్భుతాలనూ తాజా రాజకీయ సంక్షోభం ఆవిష్కరించడం గమనార్హం!

నేటి రాజకీయ సంక్షోభంలో 'అవినీతి' ప్రధాన రాజకీయ చర్చనీయాంశంగా మారింది. ప్రతి బూర్జువా పార్టీ మరియు మీడియా సంస్థ కూడా నీతి గూర్చి చిలక పలుకులు వల్లిస్తున్నాయి. అవినీతిపై వీరు మాట్లాడటమే ఒక పచ్చి బూటకం! పెట్టుబడికీ, అవినీతికీ మధ్య పడుగూ, పేక వంటి అనుబంధం వుంటుంది. పెట్టుబడి నుంచి అవినీతిని వేరు చేయడమంటే, శరీరం నుంచి చర్మాన్ని వేరు చేయడం వంటిదే! అవినీతిలో అంతర్భాగమైన 'క్విడ్–ప్రో–కో' పద్ధతి ఈ రోజు ఆకాశంలో నుంచి కొత్తగా వూడి పడిన విధానం కాదు. 'నీకు నోటు యిస్తా – నాకు ఓటు యివ్వు' కూడా అదే! ఓటర్లకి గాలాలు వేసిన వార్డు మెంబరు నుంచి ఎంపీ వరకూ 'క్విడ్–ప్రో–కో' కింది అవినీతిపరులే! ఈ సిబిఐ ఎంత మందిని శిక్షిస్తుంది? ఇదంతా ఒక ప్రహసనం మాత్రమే! ప్రజలను పిచ్చివాళ్ళను చేస్తున్న ప్రజా ద్రోహులనాటకాలు మాత్రమే! పెట్టుబడిదార్లలోని ఒక శిబిరాన్ని దెబ్బతీసేందుకు మరో శిబిరం వేసే ఎత్తుగడలు మాత్రమే! సిబిఐ కూడా ఒక రాజకీయ సాధనం మాత్రమే! రిలయన్స్ కంపెనీ నియమించుకున్న సిబిఐ అధికారులలో నీతి, సచ్ఛీలతలను చూడక్కరలేదు. యిలాంటి భ్రమలకు ప్రజలు గురి కారాదు.

విధానపరంగా ఈ రెండూ దొంగలముఠాలే! సూత్రరీత్యా ఉభయులదీ ప్రజా ద్రోహమే! ఈ రెండింటిపై ప్రజాతంత్ర చైతన్యంతో ప్రజలు వుద్యమించాల్సిందే! అదే సమయంలో ఈ రెండు కార్పోరేటు శిబిరాలమధ్య అంతర్గత కుమ్ములాటలకు దూరంగా కళ్ళూ, చెవులూ, నోర్లూ మూసుకొని వుండటం ప్రజాతంత్ర శక్తులకి సాధ్యం కాదు. 'అనను–కనను–వినను' అంటూ అతీతంగా తపస్సు చేయడం సాధ్యం కాదు. కొన్ని ప్రత్యేక అంశాలపై ప్రజాతంత్ర శక్తులు తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించాల్సి వుంటుంది. అందులో పత్రికా స్వేచ్ఛ ఒకటి! నిజానికి పత్రికా స్వేచ్ఛ ప్రజలకి సంబంధించింది కాదు. అది కూడా బూర్జువా వర్గ స్వేచ్ఛ మాత్రమే! 'మీడియా' అంటేనే పెట్టుబడి! 'మీడియా' అంటేనే లాభాలరాజకీయం! దాని స్వేచ్ఛ ప్రజలది కానే కాదు. అయితే 'రిలయన్స్' కుంభకోణాలను బట్టబయలు చేసే 'సాక్షి' సంస్థకి స్వేచ్ఛను నిషేధించి; 'ఓబులాపురం మైనింగ్ సంస్థ'ను బహిర్గత పరిచే 'ఈనాడు' సంస్థకి స్వేచ్ఛను కొనసాగించడం వివక్షా పూర్వకమైనది. ఈ తరహాలో ఆంక్షలు విధించిన పరిణామాన్ని ప్రజాతంత్ర వాదులు ఖండించాల్సిందే!

ఒక కార్పోరేటు దొంగలముఠా చేసే దుర్మార్గాలగూర్చి తెలుసుకునే హక్కును ప్రజలు కోల్పోకుండా జాగ్రత్త పడాలి. ఒక కార్పోరేటు దొంగలముఠాను 'ఈనాడు' ధర్మమూర్తులుగా చిత్రిస్తుంది. మరో ముఠాను ఉతికి ఆరేస్తుంది. తద్భిన్నంగా 'సాక్షి' ద్వంద్వ వైఖరితో చిత్రిస్తుంది. ఒక మీడియా సంస్థను గొంతు నొక్కడం వల్ల ఏకపక్ష వార్తలమీద ప్రజలు ఆధార పడాల్సి వస్తుంది. అందుకే ఈ చర్యను వ్యతిరేకించాలి. 'మీ రెండు కార్పోరేటు దొంగలముఠాలభాగోతాలను సమానంగా నిష్పక్షపాతంగా తెల్సుకునే హక్కు మాకు వుండాల్సిందే' అని ప్రజలు ఎలుగెత్తి చాటాలి. ఛానెళ్ళు, పత్రికలు 'ప్రజాస్వామిక' సంస్థలని ప్రజలు భ్రమపడ కూడదు. తమ స్వతంత్ర ప్రత్యామ్నాయ మీడియాను విప్లవోద్యమాలు సృష్టించుకోలేనంత కాలం ప్రజలు ఏదో మేరకు బూర్జువా మీడియా మీద ఆధారపడతారు. అట్టి అబద్ధాలప్రచార సాధనాలద్వారా నిజాలను సేకరించుకునే అవకాశం పీడిత ప్రజలకు వుండాలి. అందుకై పరస్పర విరుద్ధమైన 'అబద్ధ ప్రచార బాకాల'కి సమాన స్వేచ్ఛ వున్నప్పుడే, పీడిత ప్రజలకు నిజాలు తెల్సుకునే అవకాశం సాపేక్షికంగా అధికంగా, అదనంగా వుంటుంది. ఈ 'వర్గ

తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన భూ ఒప్పందాలను రద్దు చేయాలి!

దోషులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి!!

'ఇచ్చుకో - పుచ్చుకో' అన్నది 'క్విడ్-ప్రో-కో' అని నిర్వచనం. ప్రభుత్వంలోని మంత్రులు - అధికార్లు ఎవరైనా, ఏదైనా చేసిన పనికి లంచం తీసుకుంటే అది నేరం. చట్టబద్ధంగా చేయాల్సిన పని చేయడానికి లేదా చేసినందుకు వ్యక్తిగతంగా తీసుకునే సొమ్ము లేదా ఫలాన్ని లంచం అంటాము. తమకున్న అధికారంతో చట్టాలను అడ్డుపెట్టుకొని అధికారాన్ని దుర్వినియోగపర్చి పని చేసి లేదా చేయాల్సిన దానికన్న అధిక మొత్తం చేయడం, ఇవ్వాల్సిన దానికన్న ఎక్కువ ఇవ్వడం, చేకూర్చాల్సిన రాయితీలకన్నా ఎక్కువ రాయితీలు యివ్వడం జరుగుతున్నది,. అధనంగా లబ్దిపొందిన లబ్ధిదారుడు లేదా సంస్థ మంత్రులకు లేదా అధికార్లకు నేరుగా నగదు చెల్లించడం లేదా వారి బినామీలకు ముడుపులు అప్పగించడం గతంలో జరిగేది. ప్రస్తుతం లంచాలు నగదు రూపంలో కాకుండా రాజకీయ నాయకులకు గలసంస్థలలో నష్టాలలో వున్న వాటిలో పెట్టుబడులు పెట్టడం, తక్కువ ధర వున్న ఆ సంస్థలషేర్లను వందలరెట్లు ఎక్కువ ఖరీదుకు కొనుగోలు చేయడం లేదా తమ సంస్థలలో వారిని వాటాదారులుగా చేర్చుకోవడం జరుగుతున్నది. ఈ విధంగా ప్రతిఫలాన్ని ముట్ట చెబుతున్నారు. ఇదే వారికి కావల్సింది ఇవ్వడం, వీరికి కావల్సింది పుచ్చుకోవడం 'క్విడ్-ప్రో-కో' క్రిందకు వస్తుంది.

'క్విడ్-ప్రో-కో' విషయం ఇటీవల రాష్ట్రంలో పెద్ద చర్చనీయాంశ మైనది. పలు కేసులు నమోదు కాబడి పత్రికలలో, టివీలలో అను నిత్యం పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది,. ఇంతగా చర్చ జరగడానికి ఈ కేసులకు చనిపోయిన మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి, అతని మంత్రివర్గం జారీ చేసిన 26 జీవోలే మూలకేంద్రంగా వున్నాయి. ఈ 26 జీవోలద్వారా జరిగిన భూపందేరాలవల్ల లబ్ధిపొందిన సంస్థలనుండి ప్రతిఫలంగా రాజశేఖరరెడ్డి తనయుడు జగన్ కంపెనీలో 'క్విడ్-ప్రో-కో' క్రింద పెట్టుబడులు రావడం, షేర్స్ కొనుగోలు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఇలాంటి 'క్విడ్-ప్రో-కో'లు రాజశేఖరరెడ్డి, జగన్‌లతో ప్రారంభం కాలేదు. అంతకు ముందు కూడా జరిగాయి, భవిష్యత్తులో కూడా జరుగుతాయి. కాకపోతే పాలకవర్గాలమధ్య తీవ్రమైన వైరుద్యాలకారణంగా జగన్ టార్గెట్ అయిన నేపథ్యంలో నేడు ఇవి వెలుగులోకి వచ్చాయి. గతంలో చనిపోయిన రాజీవ్‌గాంధీ, లాలూప్రసాద్‌యాదవ్, మాయావతి, అద్వాని, ఫెర్నాండేజ్ లాంటి హేమాహేమీలపై కూడా ఇలాంటి అవినీతి కుంభకోణాలు వచ్చాయి. ఇప్పుడు ఏకంగా ప్రధాన మంత్రి మీదనే భారీ బొగ్గు కుంభకోణం ఆరోపణ వచ్చింది. వాటిపై సిబిఐ ఎంక్వైయిరీ కూడా జరిపింది. అంటే ప్రధాని తన మీద తాను ఎంక్వైయిరీ చేయించుకోవడమే! అందుకే అవన్నీ అరకొర దర్యాప్తులుగానే సాగాయి. 9 సం॥రాలపాటు ముఖ్యమంత్రిగా అధికారం సాగించిన చంద్రబాబు హయాంలో కూడా ఇలాంటి భూపందేరాలు చాలా జరిగాయి. వాటి ప్రతిఫలం పెట్టుబడులరూపంలో నేరుగా చంద్రబాబు కంపెనీలలోకి రాకపోవచ్చును. ఈనాడు గ్రూపు బినామీగా రామోజీ సంస్థలలోకి వేలకోట్ల రూపాయలు చేరిన వైనం ప్రత్యర్థి వర్గాలు బయటపెడు తున్నాయి. అఫీసు నిర్మాణాలు చేసి పెట్టడం, ఎన్నికలకు చందాల రూపంలో నిధులు చేకూర్చడం లాంటి పద్దతులలో 'క్విడ్-ప్రో-కో' క్రింద లాభాలు పొందారు.

'మంత్రిపదవి ఇచ్చుకో - కావలసిన సంతకాలు పుచ్చుకో' కూడా 'క్విడ్-ప్రో-కో' క్రిందకే వస్తుంది

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలన్నింటికి మంత్రివర్గం ఉమ్మడి బాధ్యత వహించాలి. మంత్రివర్గం జారీ చేసిన 26 జీవోలకు మంత్రులందరిది సమిష్టి బాధ్యతే! 'ఆలీబాబా అరడజను దొంగలు'గా వర్ణించబడ్డ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలోని మంత్రులు తమకు ఏ పాపం తెలియదని అంటున్నారు. 'అందరం కలిసే దొంగతనం చేశాము. కాని అందులో మాకేమీ వాటా ముట్టలేదని' చెబుతున్నారు. 'మంత్రులు ఏమీ తినకపోయినా పాపం బలైపోతున్నార'ని ఇప్పటి ముఖ్యమంత్రితో సహా అధికార, ప్రతిపక్ష నాయకులు వాపోతున్నారు. వీరిపట్ల సానుభూతి చూపిస్తున్నారు. ఆనాటి తమ నాయకుడు వై.యస్. ఇక ఎలాగూ రాడు కనుక ఉమ్మడి నేరాలన్నీ ఆయనపైకి తోసేస్తున్నారు. దోచుకున్న దాంట్లో, కొల్లగొట్టిన సంపదలో ఈ మంత్రులు ఎంత వాటా పొందారో లేదో అనే విషయాన్ని ప్రక్కన పెడదాం. ఇక్కడ 'క్విడ్-ప్రో-కో' క్రింద మంత్రి పదవులు పొంది 26 జీవోలు జారీ చేసిన మంత్రులు నేరస్తులేననేది వాస్తవం. అరెస్టు అయిన మోపిదేవి మాటలు అవే తెలియజేస్తున్నాయి. కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు ఉండవల్లి అరుణ్‌కుమార్ చేసిన వాఖ్యలు ఈ వాస్తవాలనే మరింత బలపరుస్తున్నాయి. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మంత్రులు రాజ్యంగం మీద విశ్వాసం చూపించకుండా, ప్రజలపట్ల భక్తి ప్రవత్తులను ప్రదర్శించకుండా తమ నాయకుని మీద గుడ్డి విశ్వాసంతో, జీవోలపై సంతకాలు చేశామంటున్నారు. అలా చెప్పినప్పుడే వారిని మంత్రి పదవులనుంచి నిజానికి బర్తరఫ్ చేయాలి. రాజ్యాంగాన్ని ఉల్లంఘించినప్పుడు మంత్రి పదవులకే కాకుండా వారిని శాసనసభ్యులుగా కూడా అర్హత లేకుండా చేయాలి. కానీ కాంగ్రెసు నేతలంతా ఈ దొంగలగుంపును వెనకేసుకొస్తున్నారు. రాజశేఖరరెడ్డి మంత్రి పదవి ఇచ్చినందున లేదా సంతకాలు చేయకపోతే మంత్రి పదవి

కె.పోలారి [illegible]

నుండి తీసేస్తారనే భయంతో ఆ జీవోలపై సంతకాలు చేశారని ఉండవల్లి అంటున్నారు. అంటే మంత్రి పదవి కోసం తెలిసే ఆ విధంగా మోసానికి పాల్పడి సంతకాలు చేశారనమాట! ఇది 'క్విడ్-ప్రో-కో' కిందకు ఖచ్చితంగా వస్తుంది. వీరంతా జగన్ వర్గంలో వుండి వుంటే, ఈపాటికి ఆరుగురు మంత్రులు కూడా వూచలు లెక్కపెట్టేవారే! కాంగ్రెసులో వున్నందువల్లనే వీరు స్వేచ్ఛగా బయట తిరగగల్గుతున్నారు. జగన్ ఒక్కడినే అరెస్టు చేస్తే విమర్శలు ఎక్కువ అవుతాయని ముందుగానే మోపిదేవిని బుజ్జగించి అరెస్టు చేయించారు. తప్పదంటే రేపు మిగిలిన వారు కూడా అరెస్టు కావచ్చు. కాని వారిపై కేసులు నిలబడకుండా, బెయిలు వెంటనే వచ్చే విధంగా కాంగ్రెసు ప్రభుత్వం కాపాడుతుంది. రాజశేఖరరెడ్డికి అత్యంత ప్రీతిపాత్రులైన వీరు అందుకే కాంగ్రెస్‌లో కొనసాగుతుండవచ్చు. ఇది కూడా ఒక రకమైన 'క్విడ్-ప్రో-కో' కాక మరేమవుతుంది?

పాలకవర్గాలమధ్య ఎన్ని వైరుధ్యాలు వున్నప్పటికీ, ఇంతగా బరితెగించి తమ లోగుట్టులను ప్రజలముందు ఇలా ఎప్పుడూ బయట పెట్టుకోలేదు. ఇప్పుడు బయటపడుతున్నదంటే, అది ప్రజాస్వామ్యం యొక్క గొప్పతనం కాదు. సిబిఐ నిష్పాక్షికత అంత కన్నా కాదు. ఎంతగా విమర్శించుకున్నా, ఎన్ని కేసులు పెట్టినా అసలు విషయంలో వారంతా ఒకే మాటగా, ఒకే బాటగా వుంటారు. గనులమంత్రికుడు గాలి అని అరచినా, గ్యాస్ దొంగ రిలయన్స్ అని గగ్గోలు పెట్టినా, భూపందారా లకే సెజ్‌లు అని గావు కేకలు పెట్టినా, ఇసుక మాఫియా అని రంకెలు వేసినా అవన్నీ పైపై మాటలే! అసలు సహజ సంపదలను ప్రైవేటుపరం చేస్తున్నది ఎవరు ? ఇందుకోసం చట్టాలు చేస్తున్నది ఎవరు. జోవోలు జారీ చేస్తున్నది ఎవరు? ఇవన్నీ ఒక రాజకీయ పార్టీ మాత్రమే చేయడం లేదు. బయట బజారులో పరస్పరం ఎన్ని విమర్శలు చేసుకుంటున్నా, ఈ పాలకపక్షాలన్నీ పార్లమెంటులో ఉఉమ్మడిగానే ఈ ప్రజావ్యతిరేక చట్టాలు చేస్తున్నారు. ప్రజాస్వామికవాదులు ఎంతవద్దని వారించినా, వాటికి వ్యతిరేకంగా పోరాడినా పార్లమెంటులో అందరూ కలిసే సెజ్‌లచట్టాన్ని తెచ్చారు. ప్రైవేటీకరణ మంత్రం ఒంటపట్టించుకున్న ఈ పాలకవర్గాలు గాలి, నీరు, గనులు, గ్యాస్, ఆయిల్, భూమి, ఖనిజాలు తదితర సహజసంపదలను ప్రైవేటుపరం చేస్తున్నాయి. వీటిని చేజిక్కించుకున్న వ్యక్తులు, సంస్థలు, కొద్ది సంవత్సరాలలోనే వేలు, లక్షలకోట్ల రూపాయలకు అధిపతులైపోతున్నారు. వారి నీడలో మన పాలకవర్గ రాజకీయాధిపతులు 'క్విడ్-ప్రో-కో' క్రింద కమీషన్లు, వాటాలు, పెట్టుబడులు,, స్విస్ ఎక్కౌంట్‌లు పొందుతూనే వున్నారు. ఇదంతా ప్రజా సంపదే! రాజకీయ నాయకులు పొందిన 'క్విడ్-ప్రో-కో'ల గూర్చి మాట్లాడుతున్నారు కానీ, జాతి సంపదలను ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ధారాదత్తం చేయరాదని మాట్లాడరు. సెజ్‌లచట్టాన్ని రద్దు చేయాలని డిమాండు చేయరు. ఈ చట్టం పేరుతోనే ఉచితంగా లేదా నామమాత్రపు ధరలకు మన రాష్ట్రంలోనే చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వాలు లక్షలఎకరాలను ప్రైవేటు కంపెనీలకు అప్పనంగా అప్పగించారు. వాటిని మొత్తంగా ఎందుకు స్వాధీనం చేసుకోరు? పైగా మా భూములు మాకే కావాలని పోరాడే ప్రజలను ఎందుకు కాల్చి చంపుతున్నారు? అడవినీ, అడవిలోని ఖనిజ సంపదనూ కబళించడానికి గ్రీన్ హంట్ పేరుతో ఉద్యమకారులను, గిరిజనులను కాల్చి చంపుతున్నది వారే కదా ? పాలకవర్గాలు ఎన్ని రాజకీయ పార్టీలుగా వున్నప్పటికీ, వీరికి ప్రజలప్రయోజనాలు ముఖ్యం కాదు. పెట్టుబడిదార్ల ప్రయోజనాలే ముఖ్యం! సామ్రాజ్యవాదులకు ఊడిగం చేయడం వారి నైజం.

ఈ అవినీతికి మూలాలు వ్యవస్థలోనే వున్నాయి. వ్యక్తిగత ఆస్తికి రక్షగా నిలిచే పేరిట కొద్దిమంది గుత్త పెట్టుబడుదార్ల, భూస్వాముల ఆస్తులకు ఈ ప్రభుత్వాలు రక్షణగా నిలుస్తున్నాయి. వీరు ప్రజలకు చెందాల్సిన దేశ సంపదను దోచుకునేందుకు కావాల్సిన చట్టాలను తెస్తూ దేశాన్ని పరాధీనతలోకి నెట్టిస్తున్నాయి. అవినీతి పోవాలంటే ముందుగా పరాధీనతపై పోరాడాలి. అవినీతి మూలాలను విస్మరించి కేవలం అవినీతిని మాత్రమే విమర్శించడడం వల్ల సరైన ఫలితాలు రావు. అవి గొంగట్లో అన్నం మెతుకులు ఏరడం వంటిదే! అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలంటే వాటి మూలలపై ముందు ఉద్యమించాలి. వర్గ దోపిడీపై సాగించే వర్గ పోరాటాలద్వారా ప్రజలు వర్గ చైతన్యం పొందుతారు. అలాంటి వర్గ చైతన్యమే అవినీతి వ్యతిరేక పోరాటానికి సహకరిస్తుంది. ఓటు వేసే యంత్రాలుగా కాకుండా ప్రజలే నిర్ణయాత్మక శక్తిగా మారాలి. అవినీతి నిర్మూలనలో ఓటు సహాయకారి తప్ప, నిర్ణయాత్మకకారి కాదు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడ కుండా, మన పాలకవర్గాలదోపిడీ, దురన్యాయాలపై ఉ ఉద్యమించ కుండా, కేవలం అవినీతి వ్యతిరేక పోరాటాన్ని చేపట్టడం సాధ్యం కాదు. అది మొదళ్ళను వదిలేసి; కొమ్మలు, రెమ్మలపై పోరాడటమే అవుతుంది; అయినా అవినీతి వ్యవస్థ చేతిలో రాజకీయ సాధనాలైన సి.బి.ఐ. వంటి దర్యాప్తు సంస్థలు, న్యాయ స్థానాలు అవినీతిని నియంత్రించడం కల్ల! అది ఆచరణలో అవినీతిపరులను స్థానభ్రంశం చేయడానికే పరిమితమవుతుంది. గొర్రెలు తినేవాడి స్థానాలను బర్రెలు తినే వాడితో భర్తీ చేసేందుకు మాత్రమే ఈ ప్రక్రియ వుపయోగపడుతుంది. వర్గ పోరాటాలతో, అవినీతి వ్యతిరేక పోరాటాలను జోడించ గలిగినప్పుడే సరైన ఫలితాలు లభిస్తాయి. నేటి రాష్ట్ర రాజకీయ సంక్షోభం నుంచి నేర్చుకోవాల్సిన రాజకీయ గుణపారం యిదే!

చైతన్యం'తో ప్రజాతంత్ర, విప్లవ శక్తులు స్పందించాలి.

కోస్తాంధ్ర సంపన్న కార్పోరేటు శక్తులకీ, తెలంగాణ నూతన సంపన్న శక్తులకీ మధ్య వైరుధ్యంలో తెలంగాణా ప్రజలన్యాయమైన ఆకాంక్షలున్నాయి. ఆనాటి ప్రాంతీయ ప్రజాస్వామిక ఆకాంక్షలు సమర్ధనీయమైనవి. అదే విధంగా రిలయన్స్ వంటి అఖిలభారత కార్పోరేటు శక్తులకీ, వాటితో పోటీ పడుతున్న రాష్ట్ర కార్పోరేటు శక్తులకీ మధ్య వైరుధ్యంలో రాష్ట్ర ప్రజలఆకాంక్షలుంటాయి. ఉదా:- రాష్ట్ర ప్రజలకు చౌక ధరకి వంట గ్యాసును పొందే పరిమిత సౌకర్యాలుంటాయి. రిలయన్స్‌కు గుత్తాధిపత్యం లభించినప్పుడు యిలాంటి వెసులుబాటు రాష్ట్ర ప్రజలకు వుండదు. పాలక వర్గాలమధ్య వైరుధ్యాలను ఓ మేరకు ప్రజలు వుపయోగించుకోవచ్చును. సహజ వనరులలూటీకై కార్పోరేటు శక్తులమధ్య వివాదంలో కూడా కొన్నిసార్లు రాజ్యాంగం వివక్షతను ప్రదర్శిస్తుంది. అందులో ఒకరి వైపు అది మొగ్గుతుంది. మరొకరి మీద అది ఒకింత నిర్బంధ పద్దతులను ప్రయోగిస్తుంది. అయితే దోపిడీ వ్యవస్థను మౌలికంగా మార్చాలనుకున్న విప్లవ శక్తులమీద రాజ్యం ప్రయోగించే రక్త సిక్త నిర్బంధకాండను మాత్రం వాళ్ళ మీద అది ప్రయోగించదు. విప్లవ శక్తులమీద అది ప్రయోగించే కౄర దమనకాండలో నూరో వంతు కూడా వాళ్ళ మీద కొనసాగదు. అయినా వంద బూటకపు ఎదురు కాల్పులకి లేని గొప్ప ప్రచారం, 'బడాబాబుల' సాధారణ అరెస్టులకి లభిస్తుంది. అంతేకాకుండా అట్టి 'బడాబాబుల' బాధలను ప్రజలందరి బాధలుగా ఫోకస్ చేసే పరిస్థితులను బాధిత కార్పోరేట్ కంపెనీలు సృష్టించగలవు. తమ పట్ల సామాన్య ప్రజలచేత సానుభూతిని సృష్టింపజేయగలవు. ఫలితంగా తమ ప్రయోజనాలు లేని కటకటాలదృశ్యాలను చూసి సామాన్య ప్రజలు తల్లడిల్లి పోతారు. వర్గ పోరాటాలు బలహీనంగా గలపరిస్థితుల్లో సామాన్య ప్రజలు బూర్జువా పార్టీలప్రభావంలో వుంటారు. అలాంటి ప్రజలప్రతి స్పందనలు అలాగే వుంటాయి. అలాంటి ప్రజలను 'పిచ్చివాళ్ళు'గా, 'మూర్ఖులు', 'మూఢులు'గా హేళన చేయడం ద్వారా విప్లవ, ప్రగతిశీలశక్తులు రాజకీయ సత్ఫలితాలను ఎన్నటికీ సాధించలేరు. తద్వారా ప్రజలతో వర్గ పోరాట శక్తులు మమేకం కాలేవు. పైగా వారు ప్రజలకి మరింత దూరమవుతారు. ఓపికగా, మెలకువగా, నైపుణ్యంతో కార్పోరేటు శక్తులమీదికి ప్రజలను వారిన్వంత ప్రయోజనాలకోసం వుద్యమింపజేయాలి. ఓబుళాపురం గనులను జాతీయం చేయడానికి ఇటు గాలి జనార్థన్ రెడ్డి అటు రిలయన్స్ ఒప్పుకోవు. వాన్‌పిక్ భూములస్వాధీనానికి ఇటు నిమ్మగడ్డ ప్రసాదు, అటు కిరణ్ సర్కార్లు కూడా ఒప్పుకోవు. ఈ రెండింటికి ఇటు ఈనాడు., అటు సాక్షి ఒప్పుకోవు. అప్పుడు ప్రజలకు వారందరి నిజం రూపం తెలుస్తుంది. ఆలస్యమైనప్పటికినీ, ఈ నిర్మాణాత్మక పంథాలోనే వర్గ పోరాటాలను పురోగమింపజేయగలం! అంతే తప్ప, వర్గ చైతన్యం లేని పరిస్థితుల్లో కన్నీరు కార్చే ప్రజలను అసహ్యించుకోవడం కూడా వర్గ పోరాట అవకాశాలను మరింత చేజార్చుతుంది. ఆచరణలో ప్రజలమీద కార్పోరేటు వ్యవస్థ ఆధిపత్యం మరింత స్థిరపడటానికి తోడ్పడుతుంది.

పై వెసులుబాట్లు వున్నాయనే పేరిట ఏదో ఒక కార్పోరేటు శక్తులపట్ల సానుభూతిని ప్రదర్శించడం వర్గ పోరాట దృక్పధానికి వ్యతిరేకమైనది. తమ కుమ్ములాటలపరిష్కారం కోసం ప్రజలను వినియోగించుకోచూస్తున్నట్లే; తమ వర్గ పోరాటాలకోసం నేటి 'రాజకీయ సంక్షోభం' అందిస్తున్న కొత్త రాజకీయ అస్త్రశస్త్రాలను విప్లవ ప్రజాతంత్ర శక్తులు కూడా సద్వినియోగం చేసుకోవాల్సి వుంది. పైన పేర్కొన్న అనేక కొత్త రాజకీయ ఆయుధాలను నేడు కార్పోరేటు శక్తులు మన ప్రజలకి అందిస్తున్నాయి. వాళ్ళు అందిస్తున్న ఆయుధాలను ధరించి, మరింత చైతన్యంతో వర్గ పోరాటాలను కొనసాగించాల్సి వుంది. తాజా రాష్ట్ర రాజకీయ సంక్షోభం నుంచి ప్రజాతంత్ర, విప్లవశక్తులు పొందాల్సిన రాజకీయ పారమిదే.

బాస్లే ప్రణాళికకి నూరేండ్లు! యుద్ధాలు, విప్లవాల సింహావలోకనం-1

సామ్రాజ్యవాద యుగంలో కార్మికవర్గ విప్లవాలకి 'బాస్లే ప్రణాళిక' సైద్ధాంతిక మార్గదర్శకత్వాన్ని యిస్తుంది. దాని ఆధారంగానే లెనిన్ నేతృత్వంలో బోల్షివిక్ పార్టీ రష్యాలో సోషలిజాన్ని సాధించగలిగింది. 'బాస్లే ప్రణాళిక' నుంచి వైదొలగిన ఆనాటి యూరప్ దేశాలసోషల్ డెమోక్రటిక్ పార్టీలు కార్మికవర్గ రాజ్యాలను సాధించ లేక పోయాయి. రష్యన్ బోల్షివిక్కులవలెనే, ఆనాడు బాస్లే ప్రణాళిక ప్రకారం విప్లవించివుంటే; రష్యాకంటే ముందే జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, బెల్జియం తదితర దేశాలు 'సోషలిస్టు రాజ్యాలు'గా ఏర్పడి వుండేవి. కానీ ప్రపంచ కార్మికవర్గం అలాంటి ఒక చక్కని విప్లవావకాశాన్ని చారిత్రికంగా కోల్పోయింది. ఫలితంగా 'మరణశయ్య' మీద అవసాన దశలోని సామ్రాజ్యవాదం ఈనాటికీ జీవించగలుగుతున్నది. తన జీవిత కాలాన్ని మరో వందేండ్లు పెంచుకోగలిగింది. యింతటి చారిత్రిక రాజకీయ ప్రాధాన్యత గలిగిన 'బాస్లే ప్రణాళిక' రూపొంది ఈ ఏడాదికి సరిగ్గా నూరేండ్లు నిండుతున్నది. ప్రపంచ విప్లవోద్యమాలు విధిగా స్మరించుకోవాల్సిన శతవర్ష చారిత్రిక సందర్భమిది.

అసలు బాస్లే ప్రణాళిక అంటే ఏమిటి? అందులోని సైద్ధాంతిక పునాది ఏమిటి? అది ఆమోదించిన పరిణామ క్రమం ఏమిటి? దాన్ని రష్యన్ బోల్షివిక్కులు ఎలా విప్లవాయుధంగా మార్చుకున్నారు? జర్మన్, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలపెద్ద పార్టీలు ఎలా చేజార్చుకున్నాయి? గత వందేండ్ల కాలంలో జరిగిన యుద్ధాలకూ, విప్లవాలకూ బాస్లే ప్రణాళికతో గలసంబంధం ఏమిటి? ఈ సందేహాలన్నింటికీ ఈ వ్యాసంలో సమాధానాలు దొరుకుతాయి. బాస్లే ప్రణాళిక శత వార్షికోత్సవ సభలను ప్రపంచ కార్మికవర్గం విప్లవ స్ఫూర్తితో ఈ ఏడాది డిసెంబరు వరకూ జరుపుకుంటున్నది. ఈ సందర్భంగా విప్లవ శ్రేణులకీ, కార్మికవర్గ శక్తులకీ అవగాహన కలిగించే ఉద్దేశ్యంతో ఈ సైద్ధాంతిక వ్యాసాన్ని ప్రజాపంథాలో ప్రచురిస్తున్నాము..... - సంపాదకుడు.

మానవజాతి చరిత్ర సమస్తం రణరక్త ప్రవాహసిక్తమే! అందుకే 'గతమంతా తడిసె రక్తమున, కాకుంటే కన్నీళులతో' అన్నాడు శ్రీశ్రీ. భూమండలం అనాదిగా పరపీడన పరాయణత్వంతో కూడిన అసంఖ్యాక యుద్ధాలతో తల్లడిల్లింది. ప్రాచీన రోమ్, ఏథెన్స్ నగర రాజ్యాల నిర్మాణం నుండి ఈ యుద్ధపర్వం నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. అంతకంటే ముందు మహాభారత, రామాయణ కాలాలపౌరాణిక యుద్ధచరిత్ర కూడా వివిధ ఖండాలలో వివిధ రూపాలలో కొనసాగింది. మానవ రక్తాన్ని ప్రవహింపజేసిన ఇలాంటి యుద్ధాలకి వేలఏండ్ల సుదీర్ఘ చరిత్రే వుంది. అయినా ఆఖరి వందేండ్ల యుద్ధచరిత్ర వేలఏండ్ల పూర్వ చరిత్రను తిరగరాసింది. వేలఏండ్ల పూర్వ యుద్ధాలచరిత్ర కార్చిన మొత్తం నెత్తురుకంటే ఆఖరి వందేండ్ల ఆధునిక చరిత్రలో మానవజాతి కార్చిన నెత్తురు వేలరెట్లు ఎక్కువే! అది ఆధునిక సామ్రాజ్యవాద ఫలితమే.

19వ శతాబ్ది ముగుస్తున్న వేళ పాత వలసవాద గర్భం నుంచే ఆధునిక సామ్రాజ్యవాదం మొగ్గ తొడిగింది. 20వ శతాబ్ది ఆరంభంలో అది వ్యవస్థీకృత రూపం ధరించింది. లెనిన్ మాటల్లో చెప్పాలంటే, సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం! కావున సామ్రాజ్యవాద యుగారంభంతో యుద్ధ శకారంభం కూడా సరికొత్త రూపంలో జరిగింది. ఈ కొత్త యుగంలో విస్తృత స్థాయిలో జరిగిన తొలి వ్యవస్థీకృత యుద్ధం మొదటి ప్రపంచయుద్ధమే! అది 1914లో ప్రారంభమై 1918 వరకూ సాగింది. మొదటి ప్రపంచయుద్ధానికి మరో రెండేండ్లలో నూరేండ్లు నిండబోతున్నది. అయితే యుద్ధ సన్నాహకదశ అంతకంటే కొన్నేండ్లు ముందునుంచే సాగింది. అలా రానున్న సామ్రాజ్యవాద యుద్ధ ప్రయత్నాలకు వ్యతిరేకంగా కార్మికవర్గ సంస్థలకదలికలు కూడా కొన్నేండ్ల ముందు నుంచే కొనసాగాయి. అలాంటి యుద్ధ వ్యతిరేక సన్నాహక కృషిలో భాగంగా ఆవిర్భవించిందే చరిత్రాత్మకమైన 'బాస్లే ప్రణాళిక.' (దీనినే బాసెల్ ప్రణాళిక అని కూడా పిలుస్తారు). దీన్ని బాస్లే పట్టణంలో 1912 నవంబర్‌లో జరిగిన రెండవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రత్యేక మహాసభ ఆమోదించింది. ఆధునిక సామ్రాజ్యవాద యుద్ధాలకీ, బాస్లే ప్రణాళికకూ అవినాభావ రాజకీయ సంబంధం వుంది. అలాంటి చరిత్రాత్మక ప్రాపంచిక రాజకీయ సంఘటన జరిగి ఈ ఏడాదికి నూరేండ్లు నిండింది. ఈ శతవర్ష సందర్భంగా చరిత్రాత్మక బాస్లే ప్రణాళిక పర్యవసానాలనూ, ఫలితాలనూ అవలోకిద్దాం.

మొదటి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్)గా పేరొందిన 'ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్' కేవలం 8 ఏండ్లు (1864-72) మాత్రమే పనిచేసింది. దీని పుట్టుక, పెరుగుదల, పతనాలు పెట్టుబడదారీ వ్యవస్థ యింకనూ చారిత్రికంగా విప్లవకర పాత్రను పోషిస్తున్న కాలంలో కొనసాగాయి. కాకతాళీయమే అయినప్పటికినీ, పెట్టుబడిదారీ చారిత్రికాభివృద్ధి దశ అంతరించడమూ, మొదటి కొమింటర్న్ పతనమూ దాదాపు ఏక కాలంలో జరిగాయి. ఈ నేపథ్యంలో అనంతర కాలంలో కొత్త సైద్ధాంతిక పునాదులతో మరో కొమింటర్న్‌ను స్థాపించాల్సిన చారిత్రిక ఆవశ్యకత ముందుకొచ్చింది. మార్క్స్ తన జీవితకాలంలోనే రెండవ కొమింటర్న్ స్థాపనకై ఎంగెల్స్‌తో కల్సి ప్రయత్నాలు సాగించాడు. కానీ మార్క్స్ 1883లో మరణించాడు. అయినా ఎంగెల్స్ నేతృత్వంలో 1889లో రెండవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ స్థాపన జరిగింది. దీని (1) పుట్టుక, (2) పెరుగుదల, (3) పతనాలు మొదటి కొమింటర్న్‌కి భిన్నంగా మూడు విభిన్న చారిత్రక ఉపదశలగుండా కొనసాగడం గమనార్హం. పైన పేర్కొన్నట్లు పెట్టుబడిదారీ వ్యవస్థ చారిత్రకంగా అప్పటికే విప్లవకర పాత్ర నుంచి వైదొలిగింది. ఆ తర్వాతే రెండవ కొమింటర్న్ ఏర్పడటం గమనార్హం! అయితే అది ఇంకా పాత సాంప్రదాయ పారిశ్రామిక పెట్టుబడి పునాది మీద నడుస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థగానే వుంది. ఆనాటికి అది ఇంకా ద్రవ్య పెట్టుబడి దశలోకి మారలేదు. ఇది రెండవ కొమింటర్న్ 'పుట్టుక' నాటి మొదటి నిర్దిష్ట చారిత్రక ఉపదశ!

పెట్టుబడిదారీ వ్యవస్థ చారిత్రికంగా అభివృద్ధి నిరోధక దశ లోకి మళ్ళిన తర్వాత అది అక్కడ ఆగలేదు. అది జడపదార్థం కాదు. పెట్టుబడిదారీ వ్యవస సదా చలనశీలమైనదే. అది ముందుకు కదలడం ఆగిపోయిన తర్వాత వెనక్కి కదలాల్సిందే! పురోగమనం ఆగిపోతే, తిరోగమనం వైపు మళ్ళుతుంది. అంతే తప్ప, అది స్తంభనకి గురయ్యే జడపదార్థం మాత్రం కాదు. చారిత్రికంగా తనకంటే ముందున్న పూర్వ ఫ్యూడల్ వ్యవస్థతో యుద్ధం సాగించినంతకాలం పెట్టుబడిదారీ వ్యవస్థ చారిత్రికంగా ప్రగతిశీలపాత్రను పోషించింది. తన తర్వాత ఆవిర్భవించాల్సిన సోషలిస్టు వ్యవస్థ (కార్మికవర్గ రాజ్యాలు) మీద అది యుద్ధం సాగించాల్సిన దశకి చేరినప్పుడు అది చారిత్రికంగా ప్రతిఘాతక పాత్రను పోషిస్తుంది. అంటే, అది ఒక చారిత్రిక దశలో పురోగమిస్తుంది. మరో చారిత్రిక దశలో తిరోగమిస్తుంది. అంతేతప్ప, ఒక నిశ్చల స్థానంలో అది ఆగిపోవడం జరగదు. ఈ తిరోగమన మార్గంలో అది ఓ కొత్త పరిణామానికి లోనైంది. స్వేచ్ఛాయుత పునాది నుంచి గుత్త స్వభావం గలదశకి మార్పు సాగింది. పారిశ్రామిక పెట్టుబడి దశ నుంచి

ప్రసాద్

ద్రవ్య పెట్టుబడి దశకి ఈ పరిణామం సాగింది. దీనినే సామ్రాజ్య వాదన అంటారు. ఈ పరిణామదశలో రెండవ కొమింటర్న్ అభివృద్ధి అయింది. ఇది రెండవ కొమింటర్న్ 'పెరుగుదల' సాగిన రెండవ నిర్దిష్ట నేపథ్య చారిత్రిక ఉపదశ!

భూగోళం పై ముడిసరుకులు వగైరా సహజ వనరులస్వాధీ నంకై 'ద్రవ్య పెట్టుబడి సంస్థలు' తొలుత సాయుధ యుద్ధాలు చేయలేదు. శాంతియుతంగానే తమ తొలి ఆర్థిక యుద్ధాలు సాగించాయి. ఆనాడు శాంతియుత ఆక్రమణలే సాగాయి. ప్రపంచ మార్కెట్ల విభజనకై ద్రవ్యసంస్థలు, ద్రవ్యరాజ్యాలు (వీటినే సామ్రాజ్యవాద గుత్త ఆర్థిక సంస్థలు, సామ్రాజ్యవాద రాజ్యాలు అంటారు) తమ ప్రయత్నాలను ప్రధానంగా నిరాయుధంగానే సాగించాయి. ఒకసారి మార్కెట్ల విభజన దశ పూర్తి అయ్యాక అది అక్కడ ఆగిపోదు. ఇక మార్కెట్ల పునర్విభజన దశ కొత్తగా ప్రారంభమవుతుంది. విభజన దశ ప్రధానంగా యుద్ధేతర ప్రక్రియలో సాగుతుంది. కానీ పునర్వి భజన దశ అనివార్యంగా యుద్ధ ప్రక్రియ ద్వారానే సాగుతుంది. ఈ మార్కెట్లు పునర్విభజన దశలో రెండవ కొమింటర్న్ పతనం చెందింది. ఇది రెండవ కొమింటర్న్ 'పతనం' చెందిన మూడవ నేపథ్య నిర్దిష్ట చారిత్రక ఉపదశ.

పైన పేర్కొన్న మూడు చారిత్రిక ఉపదశలగుండా రెండవ కొమింటర్న్ ప్రయాణం సాగింది. అందులోని రెండవ దశకీ మూడవ దశకీ మధ్య సంధికాలంలో అది ఏకగ్రీవంగా ఆమోదించిందే 'బాస్లే ప్రణాళిక'! బాస్లే ప్రణాళిక విప్లవకరమైనది. దురాక్రమణ యుద్ధాలపై విప్లవకర యుద్ధాలు చేపట్టాల్సిన రాజకీయ కర్తవ్యాలను అది కార్మిక వర్గానికి అందించింది. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాల్సిన రాజకీయ దిశా నిర్దేశాన్ని అది చేసింది. ఆయా సామ్రాజ్యవాద రాజ్యాలు తమ సరిహద్దులఅవతలచేపట్టే యుద్ధాలను, సరిహద్దులలోపలికి మళ్ళించాల్సిన విప్లవ కర్తవ్యాన్ని బాస్లే ప్రణాళిక కార్మికవర్గానికి గుర్తు చేసింది. విదేశీ ప్రజలపై ఎక్కు పెట్టాల్సిన తుపాకులను, స్వదేశీ పెట్టుబడిదార్లపైకి గురి మళ్ళించాల్సిందిగా కార్మికవర్గానికీ, సైన్యానికీ అది ప్రబోధించింది. మార్కెట్ల పునర్విభజనకై యుద్ధదశలో అడుగు పెట్టాల్సిన యుద్ధోన్మాద రాజ్యాలను విప్లవ యుద్ధాలతో నియంత్రించాలని బాస్లే ప్రణాళిక స్పష్టీకరించింది. విప్లవకరమైన బాస్లే ప్రణాళికను రెండవ కొమింటర్న్ ఏకగ్రీవంగా ఆమోదించింది. కానీ దానిపై సంతకం చేసిన సిరా తడి ఆరకముందే అది అవకాశవాద ఊబిలో దిగబడిపోయింది. అది ప్రపంచ కార్మికవర్గ విప్లవచరిత్రలో ఓ విషాద ఘట్టం. దీనివల్లనే ప్రపంచంలో సోషలిస్టు పరిమళాలు వెదజల్లాల్సిన తొలి పూదోట స్థానాన్ని యూరప్ కోల్పోయింది. ఫలితంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకంటే అది చారిత్రిక పథంలో వెనకబడింది.

బాస్లే ప్రణాళిక కంటే ఐదేండ్ల ముందు రెండవ కొమింటర్న్ ఏడవ మహాసభ స్టుట్‌గార్ట్ (జర్మనీ)లో 1907లో జరిగింది. అప్పటికే రష్యా-జపాన్‌లమధ్య మార్కెట్ల పునర్విభజనకై యుద్ధం జరిగింది. యుద్ధ నీడలు యూరపును అప్పుడప్పుడే క్రమంగా వ్యాపిస్తున్న జాడలు బహిర్గతమవుతున్నాయి. స్టుట్‌గార్డ్ మహాసభగా ప్రాచుర్యం పొందిన ఈ సభకి లెనిన్ హాజరు కావడం విశేషం! మితవాద సోషల్ డెమోక్రటిక్ పార్టీలవంటి అవకాశవాద శక్తులు ఈ సభలో వలసదేశాలసమస్యపై జాతీయ దురహంకార వైఖరిని ప్రదర్శించాయి. ఆనాటికి పెద్ద కార్మికవర్గ పార్టీలుగా పేరొందిన జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ తదితర దేశాలకార్మికవర్గ సంస్థలు అవకాశవాద వైఖరిని ప్రదర్శించాయి. లెనిన్ ప్రత్యేక కృషి వల్ల వారికి కొంత అడ్డుకట్ట పడింది. నిజానికి అది విప్లవకరమైన తీర్మానాలను చేయడంలో విఫలమైంది. అదే సమయంలో అది యుద్ధోన్మాద రాజ్యాలప్రయోజనాలకు అనుకూలంగా తీర్మానించ నివ్వకుండా లెనిన్ నియంత్రించగలిగాడు. 1910లో కోపెన్ హెగన్ (డెన్మార్కు)లో జరిగిన ఎనిమిదవ మహాసభకి కూడా లెనిన్ హాజరయ్యాడు. ఇది కూడా ఇంచుమించు స్టుట్‌గార్డ్ వలెనే మధ్యేవాద మార్గంలో జరిగింది. కానీ ఆ తర్వాత జరిగిన బాస్లే మహాసభ మాత్రం తద్భిన్నంగా జరిగింది. యూరప్ కార్మికవర్గంలో ఆనాటికి వెల్లువెత్తుతున్న యుద్ధ వ్యతిరేకత, రష్యాలో విప్లవోద్యమ ఉధృతి, కొద్దిరోజులముందు రష్యాలోని లీనా బంగారుగని కార్మికుల తిరుగుబాటు, లెనిన్ పదునెక్కిన సైద్ధాంతిక కృషి, చొరవ తదితర కారణాలవల్ల రెండో కొమింటర్న్‌లోని మితవాద శక్తులు తాత్కాలికం గా వెనక్కి తగ్గాయి. ఈ తగ్గుదలవ్యూహాత్మక మౌనరూపం ధరించే స్థాయికి వెళ్ళింది. ఫలితంగా విప్లవకర తీర్మానాలను బాస్లే ప్రత్యేక మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించడం గమనార్హం!

సామ్రాజ్యవాద రాజ్యాలు మార్కెట్ల పునర్విభజనకై వలసల దురాక్రమణకి పూనుకునే క్రమంలో యుద్ధాలు సంభవించడం సహజమే. అవి సాగించేవి అధర్మయుద్ధాలుగా కొమింటర్న్ నిర్వచించింది. ఈ అధర్మ యుద్ధాలను నిరాయుధీకరణ నినాదంతో ఎదుర్కొని నియంత్రించాలన్న శుద్ధ శాంతివాదులవైఖరిని బాస్లే ప్రణాళిక తోసిపుచ్చింది. శాంతిజపం యుద్ధాలను నివారించబోదని కొమింటర్న్ ప్రత్యేక మహాసభ అభిప్రాయపడింది. నిరాయుధీకరణ నినాదం ఆచరణలో యుద్ధోన్మాదులకి సహకరించే సాధనమని కూడా అది అభిప్రాయ పడింది. యుద్ధానికి బలయ్యేది ప్రధానంగా కార్మిక వర్గమేననీ, అలాంటి కార్మికవర్గం యుద్ధానికి వ్యతిరేకంగా సాయుధం కావాలనీ అది పిలుపునిచ్చింది. ఆచరణలో అధర్మయుద్ధాలను నియంత్రించగలిగేవి ధర్మయుద్ధాలు మాత్రమేనని స్పష్టీకరించింది. ప్రపంచ కార్మికవర్గం యుద్ధాలను చూసి భీతిల్లరాదని స్పష్టం చేసింది. పైగా కార్మికవర్గం విప్లవించడానికి అత్యంత అనువైన భౌతిక పరిస్థితులను యుద్ధం సృష్టిస్తుందని కూడా స్పష్టం చేసింది. విప్లవ అంతర్యుద్ధాలుగా మార్చుకొని, కార్మికవర్గ రాజ్యాలను నిర్మించుకోవడానికి పరవళ్ళు తొక్కే కాలంగా యుద్ధకాలాన్ని నిర్వచించింది. నిజానికి యిలాంటి విప్లవకర బాస్లే ప్రణాళికను యూరప్ కార్మికవర్గ పార్టీలు ఆనాడు ఆచరణలో అమలుజరిపి ఉంటే, ప్రపంచ చారిత్రక గమనం మరో విధంగా కొనసాగి వుండేది. లెనిన్ పేర్కొన్న, "మరణశయ్య పైకి చేరిన సామ్రాజ్యవాదం" మరో వందేండ్లు భూమండలం మీద ఇలా వర్ధిల్లి వుండేది కాదేమో!

యుద్ధారంభానికి అనేక సంవత్సరాలు ముందు నుంచే యుద్ధోన్మాదుల ప్రచారం యూరప్‌లో దురహంకార పూరితంగా జరిగింది. వెనుకబడ్డ ప్రాచ్యజాతులను, దేశాలను ఆక్రమించడం 'నాగరిక'శక్తులధర్మంగా పెట్టుబడిదారీ మీడియా బాకాలూదసాగింది. ఇంగ్లీషు వాళ్ళ వలసపాలన వల్లనే భారతీయులలో 'నాగరికత' వికసిస్తున్నదని బ్రిటీష్ మీడియా ప్రచారం చేస్తున్నది. అలాగే ఫ్రెంచి, ఇటలీ, డచ్చి, పోర్చుగీసు, స్పానిష్, జర్మనీ, బెల్జియం దేశాలమీడియా సంస్థలు కూడా బాకాలూదుతున్నవి. ఈ సామ్రాజ్యవాద రాజ్యాల జాతీయ దురహంకార నీతి పట్ల అప్రమత్తంగా ఉండాలని స్టుట్‌గార్డు మహాసభలోనే లెనిన్ మొదట హెచ్చరించాడు. ఆనాటి పెద్ద పార్టీలు స్టుట్‌గార్ట్ మహాసభలో ప్రవేశపెట్టిన మొసాయిదా తీర్మానంలో

గార్ల మండల పార్టీ నాయకుడు కామ్రేడ్ జడ మల్లయ్యకు విప్లవ జోహార్లు!

సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ గార్ల ఎస్‌డివిలేసి సభ్యుడు కా॥ జడ మల్లయ్య మే 31న గుండెపోటుతో మృతి చెందాడు. ఈ కామ్రేడ్ మరణం గార్ల మండలవిప్లవోద్యమానికి, పీడిత ప్రజానీకానికి తీరని నష్టం. కామ్రేడ్ మల్లయ్యకు విప్లవ జోహార్లు!

మల్లయ్య కుటుంబం మొదటి నుండి న్యూడెమోక్రసీ రాజకీయాలవెనుక దృఢంగా నిలబడినదే. కా॥ మల్లయ్య తల్లి వెంకమ్మ, తండ్రి నాగయ్యలు. వీరికి ఐదుగురు కుమారులు. మల్లయ్యనే కుటుంబంలో చిన్న వాడు. ఇతని యిద్దరు అన్నలు న్యూడెమోక్రసీ పార్టీలో పూర్తికాలం కార్యకర్తలుగా పనిచేస్తున్నారు. వీరి ప్రభావం మల్లయ్యపై వుంది. మల్లయ్య స్కూల్ విద్యార్థిగా వున్నప్పటి నుండే క్లాసు పుస్తకాలతోపాటు విప్లవ సాహిత్యాన్ని కూడా చదవనారంభించాడు. ఈ విధంగా భారత సమాజాన్ని అర్థం చేసుకొని, శ్రామిక ప్రజలవిముక్తికి మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానమే సైద్ధాంతిక ఆయుధమని దృఢంగా అర్థం చేసుకున్నాడు. నాటి నుండి కా॥ మల్లయ్య చైతన్యవంతమైన కార్యకర్తగా కృషిని ప్రారంభించాడు.

కా॥ మల్లయ్య గోపాలపురం గ్రామ కార్యదర్శిగా వుంటూ, పీడిత ప్రజలను ఐక్యం చేశాడు. న్యూడెమోక్రసీ వెనుక దృఢంగా నిలబెట్టాడు. మొదటి నుండి సీపీఎం వారు న్యూడెమోక్రసీని దెబ్బతీయడానికి, మల్లయ్యను భౌతికంగా నష్టపర్చడానికి పలు సందర్భాలలో అనేక కుట్రలు, కుతంత్రాలకు పాల్పడ్డారు. కొన్ని సందర్భాలలో భౌతిక దాడులు కూడా చేశారు. వీటన్నింటినీ కా॥ మల్లయ్య ధైర్యంగా, దృఢంగా నిలబడి ఎదిరించాడు. వీరి దాడులను ప్రజా ఉద్యమం ద్వారా తిప్పికొట్టాడు. మల్లయ్యను ఎదుర్కోవడం చేతగాక కొన్ని స్వార్థపర, పెత్తందారీ శక్తులతో చేతులు కలిపి దెబ్బతీసే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగానే ఈ కామ్రేడ్‌ని పలు సందర్భాలలో తప్పుడు కేసులలో ఇరికించారు. పోలీసులను ప్రలోభాలకు గురిచేసి, వారికి అనుకూలంగా మార్చుకొని, మల్లయ్యతోపాటు తన అనుచరులను అరెస్టులు చేయించి, చిత్రహింసలకు గురిచేశారు. సీపీఎం వారిపై వేసారని చెప్పే బాంబులతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నప్పటికీ, పోలీసులు మల్లయ్యతోపాటు మరికొందరిని కరెంటు షాక్‌కు గురిచేశారు. థర్డ్ డిగ్రీని ఉపయోగించారు. ఈ కామ్రేడ్స్ విడుదలకై జరిగిన ఉద్యమం ఫలితంగా తప్పుడు కేసులు బనాయించి, కోర్టుకు హాజరు పర్చారు. గ్రామంలో ఒక ప్రక్క సీపీఎం వారు, కొన్ని స్వార్థపర శక్తులు అనేక రకాలవేధింపులకు గురిచేస్తున్నా, ఎంచుకున్న సిద్ధాంతంకై, నమ్మిన రాజకీయాలకై, అమితంగా ప్రేమిస్తున్న ప్రజలకై దృఢంగా నిలబడిన ధీశాలి. నిత్య నిర్బంధాలకు గురయినా వెనుకడుగు వెయ్యని పోరాట శీలి. ఒక ప్రక్క ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ వేధింపులతో, మానసిక ఒత్తిళ్ళకి గురయినా మరోపక్క అలుపెరుగని పోరాటం జరిపాడు.

సమాజ మార్పుకు యువత వెలుగు రేఖ కావాలన్నాడు

కా॥ మల్లయ్య కాలేజీకి స్వస్తి చెప్పాక, ప్రగతిశీలయువజన సంఘం గార్ల మండలకార్యదర్శి బాధ్యతలను చేపట్టాడు. ఏ జాతికి, ఏ దేశానికైనా యువతే భావి జీవితమని దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దటంలో, నిర్మించటంలో యువతరం పాత్ర అమోఘమైనదని నమ్మాడు. మండలకార్యదర్శి బాధ్యతలు చేపట్టాక, ఈ మండలంలోని యువతరాన్ని తట్టిలేపాడు. సంఘాలు పెట్టి సంఘటిత పరిచాడు. ఈనాటి విద్యార్థి, యువకులు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, నిరక్షరాస్యత తదితర సమస్యలపై యువతరాన్ని కదిలించి అనేక ఉద్యమాలు నిర్వహించాడు.

వ్యవసాయ కూలీలసమస్యలపై మల్లయ్య, రైతాంగాన్ని తట్టిలేపి, రైతాంగంతో అనేక పోరాటాలు నిర్వహించాడు. ప్రభుత్వ అధికార్లను, ఆఫీసులను దిగ్బంధనం చేసి, నిలదీసిన దాంట్లో మల్లయ్య పాత్ర కీలకమైనది.

అవినీతిని వ్యతిరేకిస్తూ, అక్రమాలను అరికట్టాలని ముఖ్యంగా మండలంలో పేదలకు మంజూరైన ఇందిరమ్మ గృహ కల్పనలో జరుగుతున్న అవకతవకలపై, ఆగిపోయిన బిల్లులకై లబ్దిదారులను కదిలించి, అవినీతిని అరికట్టి సకాలంలో బిల్లులు పేదలకు అందే విధంగా కృషి చేశాడు.

గార్ల మండలంలోని బెరైటీస్ గనులను కడప పెట్టుబడిదారులు, ముఖ్యంగా ఆనాటి ముఖ్యమంత్రి వైయస్సార్ అల్లుడు అనిల్ అక్రమ పద్ధతుల్లో తరలించుకొని కోట్ల రూపాయలు గడించారు. చట్టాలను, నిబంధనలను సైతం ఉల్లంఘిస్తూ అక్రమ పద్ధతుల్లో బెరైటీస్ క్వారీలను నడుపుతున్న పెట్టుబడిదార్లకు వ్యతిరేకంగా ఆయన పోరాడాడు.

గార్ల మండలంలోని త్రాగునీరు, సాగునీరు సమస్యలతోపాటు విద్య, వైద్యం, రహదారులు తదితర సమస్యలపై దృఢంగా పోరాడాడు. దున్నేవానికే భూమి కావాలి అనే నినాదంతో, భూమిలేని పేదలతరపున కొట్లాడాడు. ముఖ్యంగా ఫారెస్టు వారి దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడాడు. ఈ ప్రాంతంలో భూమిలేని పేద గిరిజన, గిరిజనేతరులను కూడదీసి పోడు భూములను నరికించాడు. ప్రజలమధ్య ఏర్పడుతున్న అనేక వైరుధ్యాలను చాకచక్యంగా పరిష్కరించేవాడు.

కా॥ మల్లయ్యను రాజకీయంగా ఎదుర్కోలేని సీపీఎం వారు తప్పుడు కేసులతో దెబ్బతీయాలని ప్రయత్నించారు.

ప్రజలపోరాటాలకు సాధనంగా పార్లమెంటు వ్యవస్థను ఉపయోగించుకునే పేరిట, పార్లమెంటు, అసెంబ్లీలే సర్వస్వంగా భావించే స్థితికి సీపీఐ, సీపీఎం వాళ్ళు చేరారని, అందుకే వీరు "కాళ్ళను కార్మికవర్గంలో పెట్టి, బుర్రను బూర్జువా వర్గంలో పెట్టి ఆలోచిస్తారని", ఈ రివిజనిస్టు విధానాలపై మరింత పదునైన రాజకీయ, సైద్ధాంతిక పోరాటం చేయాలని తన మరణానికి 15 రోజులముందే, ఈ మండలంలోని 500 మంది ముఖ్య కార్యకర్తలతో మండలజనరల్ బాడీ నిర్వహించాడు. రంగు మార్చకుండా దిక్కు మార్చిన ఈ రివిజనిస్టు విధానాలను, ఊసరవెల్లి రాజకీయాలపై ఆచరణాత్మకమైన పోరాటం చేయాలన్నాడు. అప్పుడు మాత్రమే ఈ రివిజనిస్టులమేలి ముసుగును చీల్చి సామాన్య ప్రజలముందు వీరి నిజ స్వరూపాన్ని బట్టబయలు చేయగలుగుతామని దృఢంగా ప్రకటించాడు.

కా॥ మల్లయ్య సామాన్య రైతు కుటుంబంలో జన్మించినా విప్లవకారుడిగా అభివృద్ధి చెందాడు. అందుకు ఆయనలో గలసేవా తత్పరణ, త్యాగశక్తి, సాహసం, పట్టుదల, తిరుగుబాటుతత్వం, విప్లవకాంక్ష దోహదం చేశాయి. ఆయన జీవితంలో నుండి నేర్చుకోవలసింది వీటినే. కా॥ మల్లయ్య దేశ విముక్తికి, పీడిత ప్రజలవిముక్తికి చిన్నతనంలోనే కంకణం కట్టుకున్నాడు. కష్టాలకు జంకవద్దు, చావుకు చెదరవద్దు అనేది మల్లయ్య జీవితం నుండి మనం నేర్చుకోవాలి. అందుకే కా॥ మల్లయ్య హఠాన్మరణం గోపాలపురం గ్రామ ప్రజలను కంటతడి పెట్టించింది.

కా॥ మల్లయ్య, ప్రభుత్వం పెంచిన పెట్రోల్ ధరలకు వ్యతిరేకంగా, భారత్ బంద్ కార్యక్రమంలో మధ్యాహ్నం 12 గంటలవరకు పాల్గొన్నాడు. బంద్ నుండి వెళ్ళిన రెండు గంటలకే మరణించాడనే వార్త తెలిసింది.

కా॥ మావో ఈ విధంగా అంటాడు.... "వేలాది మంది వీరులు ప్రజలకోసం తమ ప్రాణాలను వీరోచితంగా బలియిచ్చారు. వారి జెండానే చేతబట్టి రక్తసిక్తమయిన వారి బాటనే మనం పయనిద్దాం". "పోరాటం వున్నచోట త్యాగం వుంటుంది. మరణమూ వుంటుంది. కానీ, మనకు ప్రజలప్రయోజనాలు ముఖ్యం. వారి కష్టాలు మన హృదయాలలో వున్నాయి. ఆ ప్రజలకోసం అవసరమైతే ప్రాణాలర్పిస్తాం" అంటూ కా॥ మల్లయ్య కూడా జీవించినంత కాలం ప్రజలకోసం పోరాడాడు. ఈ పోరాట క్రమంలోనే అకాలంగా మృతి చెందాడు. 36 సం॥ వయస్సులో మల్లయ్య మరణించడం విచారకరం.

అతి చిన్న వయస్సు నుండే తన రాజకీయ అవగాహనను పెంచుకొని, ఈ వ్యవస్థపై తిరగబడ్డాడు. మల్లయ్య ఎంచుకొన్న ప్రజాయుద్ధ పంథా మార్గంలోనే కదిలాడు. ప్రజలను కదిలించాడు.

కా॥ మల్లయ్య బ్రతికినంత కాలం పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశాడు. తానెంచుకున్న లక్ష్యాలు ఇంకా పరిపూర్తి కానందున, వీటిని పరిపూర్తి చేయడానికి చూపిన మార్గంలో పయనించాలి. ఒత్తుకుందాం కంటతడిని - ఎత్తుకుందాం ఎర్రజెండాను అంటూ కా॥ మల్లయ్య ఆశయాలపరిపూర్తికై పునరంకిత మవుదామని కొత్తగూడెం డివిజన్, ఖమ్మం జిల్లాలపార్టీ కమిటీలు ప్రకటించాయి. మల్లయ్య కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేసాయి. కా॥ మల్లయ్యకి లాల్ సలాం తెలిపాయి.

'జాత్యహంకారత' కొట్టవచ్చినట్లు వుంది. 'సోషలిస్టు వలస విధానం' అను పదాన్ని కూడా వారు తీర్మానంలో చేర్చారు. అంటే దీని ప్రకారం బ్రిటిష్ వలస పెత్తనం నుంచి వెంటనే ఇండియా విముక్తిని బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ బేషరతుగా డిమాండు చేయనక్కరలేదు. బ్రిటిష్ సామ్రాజ్యంలో ఇండియా అంతర్భాగంగా వుంటున్న సమయంలోనే బ్రిటిష్ కార్మికవర్గం తమ స్వంత బ్రిటీష్ ప్రభుత్వం మీద విప్లవించాలట! తద్వారా బ్రిటన్‌తోపాటు దాని వలస దేశమైన ఇండియా కూడా ఏకకాలంలో విముక్తిని సాధించవచ్చుట! మిగిలిన సామ్రాజ్యవాద దేశాలకార్మికవర్గం కూడా ఈ నీతినే అనుసరించాలట. ఇది 'మాటల్లో సోషలిజం- చేతల్లో చావనిజం' (జాతీయ దురహంకారం) అని లెనిన్ తూర్పారపట్టాడు. రోజా లక్సెంబర్గ్‌తో పాటు లెనిన్ స్టుట్‌గార్డ్ మహాసభ వేదిక మీద గొంతెత్తి గర్జించాడు. యూరప్‌లో సోషలిజం వచ్చేంత వరకూ తూర్పు దేశాలలో వలస పరిపాలను కొనసాగడానికి ఆమోదం తెలియజేసేందుకు యిది దారితీస్తుందని దుయ్యబట్టారు. సారాంశంలో జాతీయ విమోచనోద్యమాలను వ్యతిరేకించేందుకు ఈ తీర్మానం అవకాశమిస్తుందని విమర్శించాడు. వలస విధానం మీద అంతర్జాతీయతను ప్రతిబింబించే పదునైన వాదనలను శక్తివంతంగా లెనిన్ వినిపించాడు. ముసాయిదా తీర్మానంలోని 'సోషలిస్టు వలస విధానం' అను పదాన్ని తొలగించాలంటూ లెనిన్ ఓ సవరణను ప్రవేశపెట్టాడు. లెనిన్ సవరణకి అనుకూలంగా మహాసభలో 127 ఓట్లు వచ్చాయి. పెద్ద పార్టీలు రూపొందించిన ముసాయిదా తీర్మానంలోని 'సోషలిస్టు వలస విధానం' అనే పదం యధాతథంగా వుండాలని కోరుతూ 108 ఓట్లు వచ్చాయి. ఈ మేరకి లెనిన్ విజయం సాధించాడు. మార్క్స్, ఎంగెల్స్‌ల సమకాలికులుగా పేరొందిన పెద్ద పార్టీలప్రముఖ నేతలను సైద్ధాంతికంగా ఢీకొని లెనిన్ సఫలీకృతుడయ్యాడు. ఇది ఆనాటి పరిస్థితుల్లో అసాధారణ విజయం!

నిజానికి అంతవరకూ లెనిన్ రష్యాకే పరిమితం! ప్రథమ రష్యన్ విప్లవ నేతగా కొమింటర్న్ నేతలకి కొద్ది పరిచితుడు. అసలు ప్రథమ రష్యన్ విప్లవం (1905) యొక్క ప్రత్యేకత ఏమిటంటే, రష్యన్ జాత్యహంకారానికి లొంగకుండా, ఏటికి ఎదురీది సాధించిన ప్రత్యేక ఫలితమే! జపాన్-రష్యా రాజ్యాలమధ్య చైనా, మంగోలియా, కొరియా మార్కెట్ల పునర్విభజనకై 1904లోనే యుద్ధం ఆరంభమైంది. ఆనాడు రష్యా సామ్రాజ్యవాద మీడియా 'రష్యన్ జాతి గర్వనీయత' గూర్చి తమ దేశ ప్రజల్లో జాతీయ ఉన్మాదాన్ని తీవ్రంగా రెచ్చగొట్టింది. యూరప్ కుహనా నాగరిక రాజ్యాలచే ఆనాటివరకూ ఆసియా ప్రాచ్యదేశాలు, జాతులు ఘోరంగా అవమానించబడుతున్నాయి. జపాన్ కూడా అప్పుడప్పుడే సామ్రాజ్యవాద దేశాలజాబితా కెక్కుతున్నది. అయినప్పటికినీ, అదొక ఆసియా దేశం కావడం గమనార్హం! అలాంటి అనాగరిక ప్రాచ్య దేశమైన చిన్న జపాన్; నాగరిక యూరప్‌కి చెందిన మహా రష్యా సామ్రాజ్యంతో యుద్ధానికి తలపడటానికి ఎన్ని గుండెలుండాలంటూ రష్యన్ మీడియా తమ దేశ ప్రజలను ఆనాడు రెచ్చగొట్టింది. అలాంటి ఉన్మాదపూరిత జాతీయ దురహంకార వాతావరణంలో సైతం 'అంతర్జాతీయత' పునాదిపై లెనిన్ నేతృత్వంలోని రష్యన్ బోల్షివిక్ పార్టీ కృషి చేసింది. 'మన రష్యా జారిస్టు ప్రభుత్వంతో జపాన్ చేస్తున్న యుద్ధం మన రష్యన్ కార్మికవర్గానికి సానుకూలంగా కలిసి వచ్చే సందర్భమని' చెప్పడానికి ఆనాటి ఉన్మాదంలో ఎన్ని గుండెలుండాలి? లెనిన్ చేపట్టిన సాహసోపేత వైఖరి ఇదే! ఈ చారిత్రక నేపథ్యంలోనే ప్రథమ రష్యన్ విప్లవం (1905) తలెత్తింది. అది ఓడిపోవచ్చు. కానీ లెనిన్ మాటల్లోనే అది 1917 సోషలిస్టు విప్లవ విజయానికి 'డ్రెస్ రిహార్సల్'గా పనిచేసింది. సరిగ్గా తమ రష్యన్ ప్రథమ విప్లవ వెలుగులోనే స్టుట్‌గార్డు మహాసభలో లెనిన్ సైద్ధాంతిక కృషి సాగింది. ఈ అనుభవంతోనే కొమింటర్న్ వేదికలపై లెనిన్ 'కార్మికవర్గ అంతర్జా తీయత'తో కూడిన అసాధారణ సైద్ధాంతిక ప్రతిభను ప్రదర్శించ గలిగాడు.

<u>రెండవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌కి చెందిన అనేక మంది పేరొందిన నాయకులతో పోల్చితే లెనిన్ చాలా చిన్నవాడు. అందులో మార్క్స్, ఎంగెల్స్‌లకాలంనాటి వృద్ధనేతలున్నారు. అలాంటి తలపండిన నేతలతో రష్యన్ విప్లవనేత తమ స్వీయ రష్యన్ విప్లవానుభవాల పునాదితో తలపడటం అసాధారణమైనది. అంతేకాకుండా ఆనాటికి పశ్చిమ యూరప్ దేశాలకార్మికవర్గంతో పోల్చితే, సంఖ్యా రీత్యా రష్యా కార్మికవర్గం చాలా స్వల్పమైనదే. కమ్యూనిస్టు పార్టీలసభ్యత్వం, ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం రీత్యా కూడా రష్యా చిన్నదే. రష్యా పార్టీ పట్ల ఆనాడు జర్మనీ, బ్రిటన్, ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీల నాయకుల చిన్నచూపు కూడా ఎక్కువగానే వుండేది. అలాంటి పెద్ద పార్టీలకి చెందిన వృద్ధ నేతలు రూపొందించిన ముసాయిదా తీర్మాన ప్రతిని మార్చ గలగడం అద్వితీయమైనది.</u>

1913లో బాల్కన్ దేశాలమధ్య ప్రారంభమైన ప్రాంతీయ యుద్ధాల నుంచే పశ్చిమ యూరప్ దేశాల పెద్ద పార్టీలవైఖర్లు అవకాశవాదం వైపుకి మారసాగాయి. బాస్లే మహాసభలో వ్యూహాత్మక మౌనం పాటించిన అవకాశవాద, మితవాద, మధ్యేవాద నాయకత్వ శక్తులు ఆయా పార్టీలను తమదైన శైలిలో దారిమళ్ళించాయి. సామ్రాజ్యవాద రాజ్యాలమార్కెట్ల దాహానికి అనుకూలంగా 'పితృదేశ రక్షణ' నినాదాన్ని అవి ఇచ్చాయి. ఆనాడు పెట్టుబడిదారీ దేశాలన్నింటిలో కంటే అతి పెద్దదైన జర్మనీ సోషల్ డెమాక్రటిక్ పార్టీ తొలుత 'యూటర్న్' తీసుకున్నది. 3.8.1914వ తేదీన జర్మనీ సోషల్ డెమాక్రటిక్ పార్టీ సభ జరిగింది. తమ జర్మన్ సామ్రాజ్య ప్రభుత్వం సాగించే యుద్ధాన్ని బలపరుస్తూ అది తీర్మానించింది. ఈ తీర్మానానికి 78 ఓట్లు అనుకూలంగా వస్తే, 14 ఓట్లు మాత్రమే వ్యతిరేకంగా వచ్చాయి. దీనినే యూరప్‌లోని మిగిలిన పెద్ద పార్టీలు కూడా వరుసగా అనుసరించాయి. 'పితృదేశ రక్షణ' నినాదంతో తమతమ సామ్రాజ్య వాద రాజ్యాలకి అండగా అవి నిలిచాయి. ఇది ప్రపంచ విప్లవగతిని వెనక్కి తిప్పిన ప్రధాన తిరోగమన సంఘటనగా చరిత్రకెక్కింది. నిజానికి ఆనాడు యూరప్ కార్మికవర్గం 'అంతర్జాతీయత'ను ప్రదర్శిస్తున్న పరిస్థితి వుంది. కానీ వారికి నాయకత్వం వహిస్తున్న పార్టీలు ఇలాంటి జాత్యహంకార, దురహంకార నీతిని ప్రదర్శించాయి. దీనితో కార్మిక వర్గం నిస్సహాయంగా నిలబడిపోయింది. ఫలితంగా నిరాటంకంగా ఐదేండ్లపాటు మొదటి ప్రపంచయుద్ధం వినాశనకరంగా సాగింది.

(తరువాత భాగం వచ్చే సంచికలో....)

పెట్రోల్ ధర పెంపును వ్యతిరేకిస్తూ ప్రజా నిరసన

యూపీఏ-2 ప్రభుత్వం గతంలో ఏనాడు లేనంతగా పెట్రోల్ లీటర్‌కు దాదాపు రూ. 8 లు పెంచింది. దీనితో దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా నిరసన వెల్లువెత్తింది. కేంద్రం బడ్జెట్ సమావేశాలు ముగిసిన వెంటనే మే 23న రాత్రి పెట్రోల్ ధరను అనూహ్యంగా పెంచటంలో మే 24న ప్రదర్శనలు, రాస్తారోకోలు, ధర్నాలు జరగగా, మే 31న భారత్ బంద్ జరిగింది. ఈ కార్యక్రమాల్లో సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రంలో క్రియాశీలకంగా పాల్గొన్నది. పత్రికా కార్యాలయానికి అందిన మేరకు సంక్షిప్తంగా రిపోర్టులను అందజేస్తున్నాం. - ఎడిటర్

ఖమ్మం జిల్లా

యూపీఏ-2 ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా పెంచిన పెట్రోల్ చార్జీలపెంపును వ్యతిరేకిస్తూ, పెంపు వార్త తెలిసిన వెంటనే సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం, సబ్, డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన, మయూరి సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కా॥ అవులవెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆయిల్ కంపెనీలలాభాలకోసం ప్రజలపై ఎంత భారం వేయటానికైనా పాలకులు వెనకాడటం లేదన్నారు. పెంచిన పెట్రోల్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ జి. రామయ్య, శ్రీనివాస్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ సి.వై. పుల్లయ్య, ఇఫ్టూ, పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కామ్రేడ్స్ ఎ. రామారావు, గౌస్, శిరోమణి, ఝాన్సీ, లక్ష్మీ, ప్రదీప్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైరా: పార్టీ వైరా సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో జరిగింది. పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి కా॥ అర్జున్‌రావు మాట్లాడుతూ, పెంచిన పెట్రోల్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కామ్రేడ్స్ లాల్‌మియా, పుల్లారావు, వెంకటేశ్వరావు, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల మండల కేంద్రంలో జరిగిన రాస్తారోకో కార్యక్రమంలో కా॥ పాశం అప్పారావు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: పెంచిన పెట్రోల్ చార్జీలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ పార్టీ నేలకొండపల్లి సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం - హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి కా॥ వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు కామ్రేడ్స్ వెంకన్న, వీరయ్య, ఉపేందర్, రామస్వామి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఖమ్మం సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో **అర్బన్ మండలం** మంచుకొండ వద్ద ఇల్లందు రహదారిపై రాస్తారోకో జరిగింది. కామ్రేడ్స్ రమేష్, బాబు, లక్ష్మణ్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

- **రూరల్ మండలం** కాశిరాజు గూడెం గ్రామంలో మహ-బాద్ రహదారిపై రాస్తారోకో జరిగింది. పార్టీ డివిజన్ నాయకులు కా॥ మలీదు నాగేశ్వరరావు, కె. శ్రీనివాస్ మాట్లాడారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- **తిరుమలాయపాలెం** మండలం దమ్మాయిగూడెంలో వరంగల్ హైవేపై పార్టీ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో జరిగింది. కమిటీ కార్యదర్శి కా॥ యం. రాజేంద్రప్రసాద్, నాయకులు కామ్రేడ్స్ తిమ్మిడి హన్మంతరావు, వెంకటేశ్వర్లు, కొమురయ్య, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం హవేలి: పెంచిన పెట్రోల్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షులు కా॥ కె. సురేష్, నాయకులు కా॥ జి. రామయ్య మాట్లాడారు.

నిజామాబాద్ జిల్లా

పెంచిన పెట్రోల్ చార్జీలను వెంటనే ఉపసంహరించాలనీ డిమాండ్ చేస్తూ పార్టీ నిజామాబాద్ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బోర్గాం(పి) వద్ద గలజాతీయ రహదారిపై 150 మందితో రాస్తారోకో జరిగింది. గంటకుపైగా జరిగిన ఈ రాస్తారోకో సందర్భంగా రోడ్డుకు ఇరువైపులవందలాది వాహనాలు ఆగిపోవటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఈ సందర్భంగా పార్టీ సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి కా॥ సిహెచ్. సాయాగౌడ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చీటికి మాటికి పెట్రో ఉత్పత్తులధరలు పెంచి ప్రజలపై భారాలు మోపటం రివాజుగా మారిందన్నారు. పెంచిన పెట్రోల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలనీ, ఈ పెంపు విధానానికి వ్యతిరేకంగా ప్రజలందరు ఐక్యంగా వుద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కామ్రేడ్స్ మానయ్య, మల్లేష్, గాలీభీ, సూర్యకుమారి, శివుడు, లక్ష్మినర్సు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

· జిల్లా కేంద్రంలో పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సైకిల్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని పార్టీ సీనియర్ నాయకులు కా॥ నాయక్‌వాడి నర్సయ్య జెండా వూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెట్రో ఉత్పత్తులధరలు పెంచడం వల్ల ప్రజలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా భారం పడుతుందన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కా॥ ఆకులపాపయ్య, డివిజన్ కార్యదర్శి కా॥ వేల్పూర్ భూమయ్య, నగర కార్యదర్శి కా॥ శ్రీధర్, నాయకులు కామ్రేడ్ సాయిబాబా, సాయిగౌడ్, బెలాల్ లింగం, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కా॥ వరదయ్య, పీవైఎల్ నగర నాయకులు కామ్రేడ్స్ టి. భాస్కర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బంద్ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉదయం 7 గంటలకే బస్టాండ్, రైల్వేస్టేషన్, వీక్లీ మార్కెట్, పెద్దబజార్, గాంధీచౌక్, తదితర ప్రాంతాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు 50 మంది తిరుగుతూ బంద్ పాటింప చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద ధర్నా చేస్తున్న సందర్భంగా 15 మందిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో కామ్రేడ్స్ ఆకులపాపయ్య, వేల్పూర్ భూమయ్య, వనమాలకృష్ణ, సాయిబాబా, మురళి, నర్సింగ్‌రావు, బ్రహ్మం, రమేష్, భాస్కర్ తదితరులున్నారు.

ఆర్మూర్ డివిజన్: డివిజన్ పరిధిలోని ఆర్మూర్, సిరికొండ, మోర్తాడ్, కమ్మరపల్లి, భీంగల్ మండలకేంద్రాలలో పెంచిన పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శనలు, ధర్నాలు జరిగాయి.

ఆర్మూర్ పట్టణంలో పార్టీ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన, యూపీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కా॥ బి. దేవరాం, పార్టీ సబ్ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ ముత్తెన్న, ఎన్. దాసు, నిఖిల్, అరవిందు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలకేంద్రమైన సిరికొండలో తోపుడు బండి మీద సైకిల్ మోటార్ పెట్టి, దాని వెనుక సైకిల్ మోటార్‌లను తోసుకుంటు నిరసన ప్రదర్శన జరిగింది. 100 మందితో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు కా॥ బి. భాస్కర్, రామకృష్ణ, గంగారెడ్డి, బాబన్న, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలకేంద్రాలలో 16వ నెంబర్ జాతీయ రహదారిపై పార్టీ ఆధ్వర్యంలో అర్ధగంట సేపు పెట్రోల్ చార్జీలపెంపును నిరసిస్తూ రాస్తారోకో జరిగింది. పార్టీ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ సురేష్, సత్తెక్క, కిషన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

- భీంగల్ మండలతహశీల్‌దారు కార్యాలయం వద్ద పెంచిన పెట్రోల్ చార్జీలను తగ్గించాలనీ డిమాండ్ చేస్తూ ధర్నా చేసి, తహశీల్ దారుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్స్ యం.డి. ఖాజా, జి. నర్సయ్య, కె. రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ డివిజన్ పరిధిలో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఆర్మూర్ పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్‌లను నడవకుండా అడ్డుకోవడం జరిగింది. బస్టాండ్ సెంటర్‌లో మీటింగ్ ఏర్పాటు చేయగా పోలీసులు పార్టీ నాయకులు కామ్రేడ్స్ వి. ప్రభాకర్, దేవరాం తదితరులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రదర్శన, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. తహశీల్దార్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఇఫ్టూ జిల్లా నాయకులు కామ్రేడ్స్ ఎన్. దాసు, ముత్తెన్న మాట్లాడారు. ఈ బంద్ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి కా॥ వి. ప్రభాకర్, డివిజన్ నాయకులు కామ్రేడ్స్ దేవరాం, ముత్తెన్నతోపాటు గంగారాం, సుదర్శన్, నర్సయ్య, రవి, రాజన్న, దాసు తదితరులతోపాటు 70 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్కొండ, కమ్మర్‌పల్లి మండలకేంద్రాలలో బంద్ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో ప్రదర్శనలు జరిగాయి. పార్టీ నాయకులు కామ్రేడ్స్ బి. రాజు, విక్రమ్ గౌడ్, సత్తెక్క, సారా సురేష్, అశోక్, కిరణ్, సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- జక్రాన్‌పల్లి మండలకేంద్రంలో బంద్ సందర్భంగా న్యూడెమోక్రసీ, టీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. పార్టీ నాయకులు కామ్రేడ్స్ శివాజీ, గంగాధర్, టీఆర్ఎస్ నాయకులు బోజన్న, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్, బీంగల్, సిరికొండ, ధర్పల్లి మండలకేంద్రాలలో పార్టీ, ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో బంద్ పాటించారు. పార్టీ, ఎఐకెఎంఎస్ నాయకులు కామ్రేడ్స్ ఖాజామోయిద్దీన్, కిషన్, దయాల్‌సింగ్, నర్సయ్య, రవి, గంగారెడ్డి, రాజేశ్వర్, రాజేందర్, భాస్కర్, నర్సన్న, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ధరలపై, యూపీఏ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై అరుణోదయ కళాకారులు పాటలు పాడి ఉత్తేజాన్ని కల్గించారు. అధిక ధరలకు హద్దు లేదు, ఏలేటోడికి సిగ్గులేదు అంటూ నినాదాలు చేశారు.

తూర్పుగోదావరి జిల్లా

రాజమండ్రి: పెంచిన పెట్రోల్ ధరలను వెంటనే ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేస్తూ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలో ప్రదర్శన, వై.జంక్షన్‌లో రాస్తారోకో, ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి కా॥ జోజి మాట్లాడుతూ, యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 25 సార్లు పెట్రో ఉత్పత్తులధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందన్నారు. పెంచిన పెట్రోల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కా॥ జోజితోపాటు పార్టీ నగర నాయకులు కామ్రేడ్స్ అప్పారావు, రమణ, రామకృష్ణ, విజయ, భద్రం, రాంబాబు, శ్రీను, దుర్గారావు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: న్యూడెమోక్రసీ, సీపీఐలఆధ్వర్యంలో రామచంద్రాపురం మండలకేంద్రంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. బంద్‌ను జయప్రదం చేయాలనీ, పెంచిన పెట్రోల్ ధరలు తగ్గించాలనీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కా॥ గనిరాజును పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ, ఎఐకెఎంఎస్, పీవైఎల్ నాయకులు కామ్రేడ్స్ భీమశంకర్, కృష్ణ, రాముడు, ప్రకాశం, సీపీఐ నాయకులు కృష్ణమూర్తి, సతీష్ తదితరులతోపాటు 50 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజానగరం, ద్వారపూడి మండల కేంద్రాలలో పార్టీ ఆధ్వర్యంలో బంద్ సంపూర్ణంగా జరిగింది. ప్రదర్శన, రాస్తారోకోలు జరిగాయి. ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ జిల్లా నాయకుడు కా॥ జె. సత్తిబాబుతో సహా ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా నాయకులు కా॥ చీకట్ల వెంకటేశ్వరరావు, సుబ్బారావు, సామ్మెలు, సిద్ధూ, రామకృష్ణ, సత్యనారాయణ, ప్రసాద్, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లా

కర్నూలు జిల్లా కేంద్రంలో సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ, సీపీఎం, ఎస్‌యూసిఐ, పార్వర్డ్ బ్లాక్ పార్టీలఆధ్వర్యంలో బంద్ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద సభ జరిగింది. సభలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కా॥ పి. గోకారి మాట్లాడుతూ ప్రజలపై భారాలు మోపుతూ, కంపెనీలలాభాలకై పాలకవర్గాలు కృషి చేస్తున్నాయన్నారు. పెంచిన పెట్రోల్ ధరలను వెంటనే ఉపసంహరించు కోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంకా ఈ సభలో ఇతర పార్టీలనాయకులు రామాంజనేయులు, గఫూర్, ప్రభాకర్ రెడ్డి, షద్రక్, నాగన్న, చక్రవర్తి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నుండి కామ్రేడ్స్ హరిబాబు, బుడ్డన్న, నాగన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూర్: న్యూడెమోక్రసీ, సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో బంద్ విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ప్రదర్శన, సభలో న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి కా॥ వై. నరసింహులు పాల్గొని మాట్లాడారు. ప్రజలపై భారాలు మోపే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్, ఇఫ్టూ, పీడీఎస్‌యూ నాయకులు కామ్రేడ్స్ యం. గోపాల్, మజ్జిద్ మియా, కె. అరుణ్ కుమార్, పవన్, అర్లప్ప, మద్దయ్య, పక్కీర్ సాహెబ్, విజయమ్మ, వెంకటేశ్‌గౌడ్‌తోపాటు ఇతర పార్టీలనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు: న్యూడెమోక్రసీ, సీపీఐ, టీడీపీ పార్టీల ఆధ్వర్యంలో సున్నిపెంటలో ఎడ్లబండ్లతో ప్రదర్శన జరిగింది. అనంతరం పాతరమ్మ సెంటర్‌లో రాస్తారోకో జరిగింది. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కా॥ వై. ఆశీర్వాదం, ఇఫ్టూ నాయకులు కామ్రేడ్స్ దుర్గయ్య, శ్రీను, ఎల్లప్పలతోపాటు ఇతర పార్టీలనాయకులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా

సంస్థాన్ నారాయణపురం: బంద్ పిలుపులో భాగంగా సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో కార్యకర్తలు ప్రదర్శనగా వెళ్ళి బంద్ పాటింపచేయటం జరిగింది. అనంతరం సెంటర్‌లో రాస్తారోకో జరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల తోపాటు, బయో డీజిల్, స్పిన్నింగ్ మిల్లులను కూడా బంద్ చేయించటం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నుండి కామ్రేడ్స్ కొసనం యాదగిరి రెడ్డి, నకిరకంటి బిక్షం, మందడి అమరేందర్ రెడ్డి, కొర్ర మంగ్లా, ఏ. యాదయ్య, అంజయ్య, జి. రవీందర్ మరియు ఇతర పార్టీలనాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 'మేడే' కార్యక్రమాలు...

(గత సంచిక తరువాయి)

పశ్చిమ గోదావరి జిల్లా

ఏలూరులో మేడే భారీ బహిరంగ సభ

126వ మేడే సందర్భంగా ఏలూరులో ఇఫ్టూ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరిగింది. సుమారు 2 వేలమందితో జరిగిన ఈ సభకి 400 మంది మహిళలు హాజరు కావడం విశేషం! సుదీర్ఘ ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో మూడు గంటలకి పైగా సాగిన ఈ సభలో ప్రేక్షకులు ఆసాంతం చెదరకుండా ఆలకించారు.

ఇఫ్టూ పట్టణ కమిటీ అధ్యక్షులు కా॥ కాకర్ల అప్పారావు అధ్యక్షతన బావి సెట్టివారి పేట, రామాలయం సెంటరులో మేడే రోజు రాత్రి జరిగిన సభకి ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ పి. ప్రసాదు ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సభలో సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ప॥గో॥ జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ టి. సుధాకర్, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్స్ కె. పోలారి, ఇంకా యు. వెంకటేశ్వరావు, రెడ్డి అప్పలనాయుడు, జి. సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. నేటి ప్రపంచీకరణ పరిస్థితుల్లో కార్మికవర్గ పోరాటాలకు గలఅవకాశాలను వక్తలు వివరించారు. మేడే విప్లవ స్ఫూర్తితో సమకాలీన సమాజంలో కార్మికవర్గం విప్లవించాల్సిన ఆవశ్యకతను వివరించారు. నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలమీద వుద్యమించాల్సిన తక్షణ కర్తవ్యాలను వివరించారు. శ్రామిక మహిళలు పెరుగుతున్న నేపధ్యంలో ట్రేడ్ యూనియన్ కర్తవ్యాలను వివరించారు. పట్టణీకరణ పెరుగుతున్న నేపధ్యంలో నూతన అసంఘటిత కార్మికవర్గాన్ని మరింత సంఘటితపరచాల్సిన ఆవశ్యకతను గూర్చి వక్తలు వుపన్యసించారు. ఈ సభలో ఏలూరు యార్డు హమాలీ అరుణోదయ సాంస్కృతిక బృందాలు ప్రదర్శించిన 'ఓడ కళాసీ', 'గొల్ల సుద్దులు', 'చేతి కర్ర' ప్రదర్శనలు బాగా రక్తి కట్టించాయి.

ఏలూరు టౌన్‌లో మేడే సందర్భంగా 50కి పైగా ఇఫ్టూ జండాలను ఆయా యూనియన్లు ఆవిష్కరించాయి.

సద్దామ్ హుస్సేన్, కల్నల్ గడాఫీ, నెక్కలపూడి రామారావు అమర చిత్ర పటాలతో పెద్దవంతెన సెంటరులో ఎరువులహమాలీ యూనియన్ నిర్మించిన మేడే స్థూపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 200 మంది హమాలీలతో యార్డులో ర్యాలీ జరిపి జండా ఆవిష్కరించారు. ఏలూరు టౌన్‌లో ఉదయం జండావిష్కరణలు వివిధ కేంద్రాలలో జరిగిన తర్వాత పాత మార్కెట్ నుంచి పెద్ద వంతెన సెంటర్ వరకూ ప్రధానంగా 'రెడ్ షర్టు' హమాలీలతో జరిగిన ర్యాలీలో 300 మందికి పైగా పాల్గొన్నారు. ఈ అన్ని కార్యక్రమాలలో బుట్టాయిగూడెం అరుణోదయ డప్పు డ్యాన్స్ బృందం పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

జంగారెడ్డి గూడెం: మేడే సందర్భంగా జంగారెడ్డి గూడెంలో వివిధ యూనియన్లు జండాలు ఎగరవేసి 150 మంది కార్మికులతో ప్రదర్శన నిర్వహించారు. గౌరీపట్నం ఏరియాలో 200 మందితో ప్రదర్శన జరిగింది. నూజివీడు (ఇది కృష్ణా జిల్లా పరిధిలోనిది. కానీ నిర్మాణపరంగా ప॥గో॥ జిల్లా ఇఫ్టూ పరిధిలోనిది)లో 250 మంది ట్రైల్స్ కార్మికులతో ర్యాలీ జరిగింది. ఆకివీడులో 50 మందితో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమాలకి కామ్రేడ్స్‌పాదం రామక్రిష్ణ, కె. రమణ, బద్దా వెంకట్రావు, రాఘవులు, నాగేశ్వరరావు తదితర ఇఫ్టూ నాయకులు సారధ్యం వహించారు.

తూర్పు గోదావరి జిల్లా

జగ్గంపేట: మండలకేంద్రమైన జగ్గంపేటలో స్టాలిన్ భవన్ వద్ద జెండాను ఎ.పి. ట్రైల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కా॥ బొడ్డు రాంబాబు ఎగురవేశారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి కా॥ ఏసుబాబు అధ్యక్షతన జరిగిన మేడే బహిరంగ సభలో పార్టీ జిల్లా నాయకులు కా॥ ఎస్. రాజారావు మాట్లాడుతూ, మేడే విశిష్టతను తెలియజేశారు. పోరాటాలద్వారా హక్కులు సాధించబడ తాయని చాటి చెప్పిన మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక, కర్షకులు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి కా॥ ఎ. చిట్టిబాబు, లక్ష్మీ, బాలు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు గ్రామంలో మేడే సందర్భంగా జెండావిష్కరణ, సభ జరిగింది. ఈ సభలో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కామ్రేడ్స్ ఏసు, లక్ష్మీ, పీవైఎల్ జిల్లా నాయకులు కామ్రేడ్స్ చిట్టిబాబు, జి. బాలరాజు మాట్లాడారు. వ్యవసాయ కూలీలు కనీస వేతనంకై మేడే అమరవీరులపోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని కా॥ కె. లక్ష్మి అన్నారు.

నల్లగొండ జిల్లా

కోదాడ డివిజన్: కోదాడ పట్టణంలో పార్టీ కార్యాలయం వద్ద జెండాను పార్టీ డివిజన్ కార్యదర్శి కా॥ బి. రాము ఎగురవేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, మేడే ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సబ్ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ డి. రవి, శ్రీను, నరసింహారావు, వీరాస్వామి, నగేష్, వెంకటేశ్వర్లు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ జెండాను యూనియన్ నాయకులు కా॥ తిరుపయ్య ఎగురవేయగా, కోమరబండలో భవనం నిర్మాణ సంఘం నాయకుడు కా॥ రాజారాం ఎగురవేశారు.

మునగాల: మండలంలోని తిమ్మారెడ్డి గూడెంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జెండాను యూనియన్ నాయకుడు కా॥ మల్లయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ నాయకులు కా॥ కె. నవీన్ మాట్లాడుతూ, మేడే విశిష్టతను తెలియజేశారు.

అదే మండలం కొక్కిరేణి గ్రామంలో జరిగిన మేడే కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు కా॥ పోటు లక్ష్మయ్య, కె. నవీన్, ప్రభాకర్, కోటయ్య, మాణిక్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శన జరిగింది.

నడిగూడెం మండలం కాగితం రామచంద్రాపురంలో ఇఫ్టూ ఆధ్వర్యంలో మేడే జరిగింది. ఇఫ్టూ జెండాను కా॥ వీరన్న ఎగురవేయగా పార్టీ జెండాను కా॥ నగేష్ ఎగురవేశారు. ఈ సందర్భంగా మేడే బహిరంగ సభలో పార్టీ డివిజన్ కార్యదర్శి కా॥ బి. రాము మాట్లాడారు.

హుజూర్‌నగర్ డివిజన్: హుజూర్‌నగర్‌లో మేడే సందర్భాన్ని పురస్కరించుకుని ఇఫ్టూ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా 70 మంది మహిళలు ఎర్ర చీరలు ధరించి జరిపిన కోలాట ప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్నది. దీనికి ముందు పట్టణంలో 15 చోట్ల హమాలీ వర్కర్స్ యూనియన్ జెండాలను యూనియన్ నాయకులు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కా॥ వి. కోటేశ్వరరావు, పార్టీ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ ఎ. కోటయ్య, పి. లక్ష్మయ్య, కాకి అజయ్, స్టాలిన్, నాయకులు కామ్రేడ్స్ శిల్ప శ్రీను, కాశింగులకాంతమ్మ, ఎ. పద్మ, మేకలరాజేశ్వరి, శీలలక్ష్మయ్య, శ్రీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో హమాలీ సంఘం ఆధ్వర్యంలో మూడు చోట్ల జెండావిష్కరణలు జరిగాయి. ఈ సందర్భంగా రెండు వందలమందితో ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో కామ్రేడ్స్, నవీన్, లక్ష్మయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

అదే మండలం మంగాపురంలో ఇఫ్టూ జెండాను కా॥ వెంకన్న ఎగురవేయగా, కామ్రేడ్స్ లక్ష్మయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సీతారాములు పాల్గొన్నారు.

వెలిదండ గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమం జరిగింది. పార్టీ జెండాను పార్టీ జిల్లా కార్యదర్శి కా॥ వి. కోటేశ్వరరావు ఎగురవేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 200 మందితో ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో కామ్రేడ్స్ నవీన్, రాము, కోటయ్య, శ్రీను, వెంకటి, ఎల్లయ్య, వీసాలవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా చౌటుప్పల్, చండూర్ మండలకేంద్రాలలో జరిగిన బంద్ కార్యక్రమంలో లచ్చమ్మ, చిల్లాపురం, నారాయణపురం గ్రామాలకు చెందిన న్యూడెమోక్రసీ గ్రామ నాయకులు కామ్రేడ్స్ కొర్ర సర్వన్, మార్కెండేయులు, జి. నరసింహా, జంగయ్య, సత్తయ్య, లింగస్వామి, మహేష్, అచ్చయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా

రెంటచింతల: మండలకేంద్రమైన రెంటచింతలలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కా॥ కొమెర రవి మాట్లాడుతూ, ప్రజలపై భారం వేసి ఆయిల్ కంపెనీలకు లాభాలు దోచిపెట్టే పాలకులవిధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలన్నారు. అనంతరం తహశీల్దారుకు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ పల్లపు బాబు, గోపయ్య, బాలశౌరి, కోటిస్వామి రెడ్డి, సాంబయ్య, వెంకటేశ్వర్లు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా

జిల్లా వ్యాప్తంగా బంద్ జయప్రదంగా జరిగింది. ఏలూరు, జంగారెడ్డి గూడెం, ఆకివీడు, బుట్టాయి గూడెం తదితర కేంద్రాలలో సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టియు కార్యకర్తలు బంద్‌లో చురుగ్గా పాల్గొన్నారు. ఏలూరులో 500 మంది ఇఫ్టూ కార్యకర్తలు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

హైదరాబాదు

నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో పెట్రోల్ ధర పెంపును నిరసిస్తూ రాస్తారోకో, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి కా॥ ఝాన్సీ మాట్లాడుతూ ప్రజలపై బహుళ పన్నులద్వారా ముప్పెట దాడి చేసే పాలకులవిధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.

బంద్ సందర్భంగా బాగ్‌లింగంపల్లి నుండి నారాయణ గూడ చౌరస్తా వరకు ర్యాలీ జరిగింది. ఇతర రాజకీయ పార్టీలు సీపీఎం, సీపీఐ, ఎంసీపీఐ, ఎస్‌యుసిఐ, ఆర్ఎస్‌పి పార్టీలతో కలిసి అక్కడ నుండి ఆర్టీసీ క్రాస్‌రోడ్ వరకు ఉమ్మడి ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా క్రాస్‌రోడ్స్‌లో అరెస్టులు జరిగాయి.

ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు కా॥ వి. సంధ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ గౌతం ప్రసాద్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కా॥ హన్మేష్, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ రామారావు, పార్టీ నగర నాయకులు కామ్రేడ్స్ నరేందర్, పద్మ, అరుణ, కిరణ్, అనురాధ, ప్రవీణ్, మరియు డివిజన్ నాయకులు కామ్రేడ్స్ బాలనర్సింహ్మా, స్వరూప, లక్ష్మిబాయి, సత్య, రియాజ్, గణేష్, ప్రజాపంథా మేనేజర్ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ జిల్లా

గోదావరిఖనిలో పెట్రోల్ ధరలపెంపుకు నిరసనగా సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పెద్దపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన, గణేష్‌నగర్ సెంటర్‌లో యూపీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గోదావరిఖని సబ్ డివిజన్ కార్యదర్శి కామేడ్స్ ఇ. నరేష్, నాయకులు టి. రమేష్, ఇ. పద్మ, జె. రమ, ఐ. రాజయ్య, ఎం. కొమురయ్య, ఇ. రామక్రిష్ణ, శంకర్‌లింగం, జి. వెంకన్న, జి. శంకర్‌లు పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి జ్యోతినగర్‌లో పార్టీ ఆధ్వర్యంలో ప్రదర్శన, మేడిపల్లి సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు కా॥ జిబిఎన్ రెడ్డి, స్థానిక నాయకులు కామ్రేడ్స్ సిహెచ్. శంకర్, కె. శ్రీను, పి.ఎన్. భూషణం, డి. రవి, బి. కుమార్‌లు పాల్గొన్నారు.

రామగుండంలో పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను తగులబెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కామ్రేడ్స్ కె. మల్లేష్, టి. రాజేష్, జి. నర్సయ్య, బి. ఆనంద్, ఎం. రాములు, కె. భూక్యష్, ఎస్. తిరుపతిలతోపాటు 30 మంది పాల్గొన్నారు.

8వ ఇంక్లయిన్ కాలనీలో పెట్రోల్ ధరలకు నిరసనగా కాలనీ తెలంగాణ సెంటర్‌లో ప్రభుత్వం దిష్టిబొమ్మను తగులబెట్టి నిరసన తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కామ్రేడ్స్ బి. అశోక్, బి. రాజేశం, సురేష్‌లతోపాటు 20 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం చేసినందుకు 8వ ఇంక్లయిన్ కాలనీ సిఐ ఆర్. ప్రకాశ్, పార్టీ టౌన్ కార్యదర్శి జివిఎల్‌బికెఎస్ ఆర్‌జి-2 కార్యదర్శి కా॥ బి. అశోక్‌ను సాయంత్రం 7 గం॥ సమయంలో కాలనీ సెంటర్‌లో పట్టుకుని పోలీసులు నడి బజార్‌లో ఈడ్చుకుంటూ విపరీతంగా చేతులతో కొడుతూ కాళ్ళతో తన్నుతూ విపరీతంగా భూతులు తిడుతూ స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రి 11 గం॥లవరకు స్టేషన్‌లో వుంచి బెదిరించి వదిలి పెట్టడం జరిగింది. ఈ విషయంపై సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కా॥ టి. శ్రీనివాస్, జిల్లా నాయకులు కా॥ బి. సంపత్‌కుమార్, గోదావరిఖని సబ్ డివిజన్ కార్యదర్శి కా॥ ఇ. నరేష్, ఐఎఫ్‌టియూ నాయకులు కా॥ కె. విశ్వనాథ్‌లు సి.ఐ.ని కలిసి మాట్లాడుతూ అంతే ర్యాష్‌గా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో గోదావరిఖని డిఎస్‌పి కలిసి 2టౌన్ సి.ఐ. ఆర్.ప్రకాశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒక వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

బంద్ సందర్భంగా నిరసన ర్యాలీ కార్యక్రమాలు

బంద్ పిలుపు సందర్భంగా పెద్దపల్లి డివిజన్ పరిధిలో పార్టీ ఆధ్వర్యంలో గోదావరిఖని పట్టణంలో బంద్ విజయవంతంగా జరిగింది. పట్టణంలో వినూత్నంగా మోటార్ సైకిల్స్‌కు తాళ్లు కట్టి లాగుతూ నిరసన ప్రదర్శన జరిగింది. ప్రదర్శన అనంతరం సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ గోదావరిఖని సబ్ డివిజన్ కార్యదర్శి కా॥ ఇ. నరేష్ మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వం ఇప్పటికే 14 సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందన్నారు. పెంచిన పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కామ్రేడ్స్ టి. రమేష్, ఇ. పద్మ, ఎస్. రాజన్న, ఎం. కొమురయ్య, జె. రమ, బోజరాజు, బుచ్చయ్య, వి. మొగిలి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా జ్యోతినగర్, ఎన్‌టిపిసిలో బంద్ పూర్తిగా జరిగింది. ఈ బంద్ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కామ్రేడ్స్ సిహెచ్. శంకర్, శ్రీనివాస్, పి.ఎస్. భూషణం, కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం మండలకేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో బంద్‌లో పాల్గొని పట్టణంలో ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు కా॥ కె. మల్లేష్, స్థానిక నాయకులు కామ్రేడ్స్ జి. నర్సయ్య, తిరుపతి, పద్మనాభం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజన్ ప్రారంభమైనా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సిద్ధం చేయని సర్కార్

"రైతులను రానున్న ఖరీఫ్‌కు సిద్ధం చేసి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, తక్కువ పెట్టుబడిలో మేలైన దిగుబడులు సాధించేందుకు రైతు చైతన్య యాత్రలకు శ్రీకారం చుట్టినట్లు... రాష్ట్రంలో 50 వేలగ్రామాల్లో ఈ యాత్రలు సాగుతాయని, 50 లక్షలమంది రైతులు ఇందులో పాల్గొంటారని.. రైతుసంక్షేమం గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు తప్ప ఏ పార్టీకి లేదని.. దేశంలో ఎక్కడాలేని విధంగా వడ్డీలేని రుణాలు ఇస్తున్నామని... నెలకు రు. 25 వేలు వచ్చేలా చేస్తే యువత వ్యవసాయం వైపు మొగ్గుచూపుతారని, ఈ దిశగా చర్యలు తీసుకొంటామని..." రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లో మే 10న రైతు చైతన్య యాత్రలు ప్రారంభిస్తూ ప్రకటించారు.

కానీ, పాలకులు లక్షలాది రూపాయలఖర్చుతో చేస్తున్నది కేవలం ఊదరగొట్టే ప్రచార యాత్రలను మాత్రమే. సూటిగా చెప్పాలంటే ఇది ఉప ఎన్నికలలో పరువుకాపాడుకోనే ప్రయత్నమే. ఈ రోజు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలమూలాలజోలికిగానీ, వాటి పరిష్కారానికిగాని నిర్దిష్ట ప్రణాళిక లేదు. ఈ సం॥రం ఖరీఫ్‌కు ఇంతవరకు నిర్దిష్టమైన ప్రణాళిక లేకపోవట "తమది రైతు ప్రభుత్వమని" దబ్బాకొట్టుకొనే కిరణ్ కుమార్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అసలు బండారాన్ని ఎండగడుతోంది. ఈ రోజు రైతు కనీస అవసరాలకోసం ఆరాటపడుతూవుంటే కిరణ్‌కుమార్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాటి జోలికి వెళ్ళకుండా 'ఆధునిక వ్యవసాయ పద్ధతులు' 'అధిక దిగుబడులు ' తక్కువ పెట్టుబడి' గురించి మాట్లాడుతూ రైతాంగాన్ని ప్రక్కదారి పట్టిస్తున్నది. మోసగిస్తున్నది.

మే 10 నుండి 31 వరకు ' రైతుచైతన్య యాత్రలు, జూన్ 2 నుండి 5 వరకు రైతు సదస్సులను లక్షల, కోట్ల రూపాయలఖర్చుతో నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా ఇటువంటి కార్యక్రమాలు పంటకాలానికి ముందు జరుపుతున్నారు. ఫలితాలు మాత్రం సున్నా. అవగాహన పెంచుకొని అదికోత్పత్తులసాధన అటుంచి, పాలకులతప్పుడు విధానాలతో ప్రతి బంధకాలు, సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విత్తన, ఎరువులు, రుణాలసమస్యలు ఎదుర్కొంటున్నారు. సాగునీటి అగచాట్లు, పంటలఅమ్మకం, గిట్టుబాటు ధరలకోసం, రుణాలకోసం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా 2011లో రెండు పంట కాలాల్లో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ఇందులో పాలకులలోపం ఉంది. 2011 ఖరీఫ్‌లో 1.94 కోట్ల ఎకరాలలో పంటలు వేయగా 22 జిల్లాలో 1076 గ్రామీణ మండలాలకుగాను 878 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. 55,53,611 మంది రైతులకు చెందిన 84,60,390 ఎకరాల్లో నష్టం జరిగింది. పంట నష్టం 31 లక్షలమెట్రిక్ టన్నులు. దీని విలువ దాదాపు రూ. 18వేలకోట్లు. ఇందులో ఒక్క పంట పెట్టుబడే రూ. 5746.77 కోట్లు వుంటుందని అంచనా. కానీ, 3743.93 కోట్లు మాత్రమే వుంటుందని కేంద్రానికి నివేదిక పంపారు. దీనికి రూ. 1878 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరింది. అలాగే, రబీ పంట నష్టం క్రింద రూ. 703 కోట్లు రాష్ట్రానికి ఇవ్వాలని కోరింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ. 300 కోట్లు కూడా రైతాంగానికి చెల్లించలేదు. అలాగే రబీలో 20 లక్షలహెక్టార్లలో పంటలు నష్టపోతే కనీస ప్రస్తావనలేదు. మళ్ళీ 2012 ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. కానీ, పాలకులకు ఆదుకోవాలనే దృష్టి లేకపోవటం దారుణం. భూసార పరీక్షల, విత్తనశుద్ధి, పంటలనష్ట పరిహారం పంపిణీ, వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగు మందులు వాడకం తదితరాలగురించి రైతుల్లో చైతన్యం కల్పిస్తామంటున్న 'రైతు సాగుకు' అందుకు తగిన చర్యలు చేపట్టటం లేదు. నిధులు కేటాయింపు, కృషి, చిత్తశుద్ధి అంతకంటే కనపడటం లేదు. అధికంగా ఎరువులవాడకం వల్ల ఒక వైపు నేలలు నిస్సారం అవుతున్నాయి. భూసారం పెంచే చర్యలు లేవు. భూసార పరీక్షలు సరైన ఫలితాలనివ్వటం లేదు. సాధారణంగా మే 2 వ వారం నుండి విత్తన పంపిణీ ప్రారంభం కావాలి. అందుకు ముందు నుండీ చర్యలు చేపట్టాలి. రైతాంగం ఏ విత్తనాలు ప్రధానంగా వాడ దలిచారు? వాటిని ఎలా సమకూర్చాలి? ఎరువులు, రుణాలు పంపకం వంటి సమస్యలపరిష్కారానికి సరైన, ప్రణాళిక వుండటంలేదు. సాగునీటి అస్థవ్యస్థత, పంటలఅమ్మకాలవిషయంలో నిర్లక్ష్యం వుంటుంది. సకాలంలో ఇవన్నీజరగాలని రైతు కోరుకొంటాడు. కానీ, జరగటంలేదు. అదే పరిస్థితి ఈ సం॥రం తలెత్తింది. ఫలితంగా రైతాంగం ప్రతిఏటా ఆందోళనలు చేయవలసి వస్తుంది. గతం సం॥రం 11.30 లక్షలక్వింటాళ్ళ సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంకాగా, ఈ సం॥రం 13.82 లక్షలక్వింటాళ్ళు పంపిణీ చేయాలని నిర్ణయించారు. కానీ, ఆచరణలో మే చివర నాటికి 4.93 లక్షలక్వింటాళ్ళు (35%) సేకరించింది. ఇందులో 11,788 క్వింటాళ్ళు మాత్రమే రైతాంగానికి పంపకం జరిగింది. ఇది మొత్తం పంపకం లక్ష్యాలలో 0.85% మాత్రమే. అయితే, ప్రభుత్వ అధికార్లు మాత్రం విత్తన సేకరణ జరిగిందని, గోదాముల్లో నిలువలున్నాయని, మండలకేంద్రాలకు చేర్చిన వాటినీ సేకరించినట్లుగా చూపెడుతున్నామని చెబుతున్నది. ఇది కేవలం రైతాంగాన్ని వంచించే ప్రయత్నం తప్ప మరొకటి కాదు.

2012 ఖరీఫ్ సీజన్‌లో సుమారుగా 82 లక్షలహెక్టార్లు నుండి 86 లక్షలహెక్టార్లు వరకు వివిధ పంటలు సాగయ్యే వీలుంది. ఇందుకు 40 లక్షలక్వింటాళ్ళ విత్తనాలఅవసరం వుంటుంది. అలాగే ఎరువులు, పురుగు మందులు 40 లక్షలమెట్రిక్ టన్నులు, దీనికి గాను 30 వేలకోట్లు అవసరం వుంటుందని అంచనా. అయితే, విత్తనాలకు సంబంధించి గత సం॥రం 50% సబ్సిడీతో 30 లక్షలక్వింటాళ్ళు అందిస్తామని కేవలం 11 లక్షలక్వింటాళ్ళు మాత్రమే 30% సబ్సిడీతో అస్థవ్యస్థంగా సరఫరాచేసి ప్రభుత్వం చేతులు దులుపుకొంది. అలాగే రుణాలు బడ్జెట్లలో 18% అందించాల్సివుండగా 10% మాత్రమే అందించారు. అది కూడా సకాలంలో అందించటం లేదు. అందిస్తున్నామని చెప్పే వాటిని కూడా పాలక పార్టీలభూస్వాములు, ధనికులు, పెత్తందార్లు అత్యధిక శాతం కాజేశారు. ఫలితంగా రైతాంగం ప్రైవేటు వడ్డీ వ్యాపారులవద్ద అధిక వడ్డీలకి అప్పులు తెచ్చి, తీర్చలేక రుణగ్రస్తులవుతున్నారు. అవి తీర్చలేక, పండిన పంటలకు గిట్టు బాటు ధర రాక, తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలపాలవుతున్నారు. ఇది వ్యవసాయరంగం సంక్షోభాన్ని తెలియజేసే విషయం. దీనికి ప్రధానంగా పాలకులదే బాధ్యత. ఈ సమస్యలకు గలమూలాలు పరిష్కరించకుండా, సరిజేయకుండా వ్యవసాయ రంగం, రైతాంగం గట్టెక్కే పరిస్థితిలేదు. అందుకే రైతు సమస్యలఎడలముందుగా పాలకులే చైతన్యం పొందాలి. కనీసం ఈ క్రింది చర్యలు చేపట్టాలి.

వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించి మేలైన విత్తనాలు, ఎరువులు 50% సబ్సిడీతో కౌలురైతులతో సహా మొత్తం రైతాంగానికి అందించాలి. ఎస్‌సీ, ఎస్‌టీ రైతులకు జిసిసి, ఐటిడిఏ, ఎస్‌ఇ కార్పొరేషన్ ద్వారా పూర్తి సబ్సీడీతో సరఫరాచేయాలి. వడ్డీ లేని రుణాలు, గ్రామ విత్తన పథకం అమలు జరపాలి. సాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు సహేతుకంగా ఖరీఫ్‌లోనే ప్రకటించాలి. పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. సమగ్ర పంటలబీమా పథకం రైతులందరికీ వర్తింపచేయాలి. పేద, మధ్య తరగతి రైతాంగం తరుపున ప్రీమియం ప్రభుత్వమే భరించాలి. ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపరిహారం పంటకు పెట్టిన ఖర్చులప్రాతిపదికన నిర్ణయించాలి. గత సం॥రం నష్టపరిహారం వెంటనే రైతుకందించాలి. ఇవి చేయకుండా ఏమి చెప్పినా, ఏమీ చేసినా వ్యవసాయరంగానికి, అంతిమంగా రైతాంగానికి ఉపయోగం వుండదు. దీనిని పాలకులు, ప్రజలు గుర్తించాల్సిందే.

ప్రచార ఆర్భాటాల్లో మునిగి తేలుతున్న కిరణ్ సర్కార్ గత ప్రభుత్వాల్లాగే రైతాంగాన్ని నిలువునా ముంచే విధంగానే వ్యవహరిస్తోంది. సీజన్ ప్రారంభమైనా, అందుకు తగిన విధంగా రైతాంగాన్ని ఆదుకునే ఏ చర్యలకూ పూనుకోవడం లేదు. ఈ మోసాన్ని ఎక్కడికక్కడ నిలవేయాలి. అందు కోసం రైతాంగం వీధుల్లోకి రావాలి.

- కెచ్చెల రంగయ్య

రైతాంగ, వ్యవసాయ కూలీ సమస్యలపై ఎఐకెఎంఎస్ ఆందోళన

అఖిలభారత రైతు-కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర కార్యవర్గం రైతాంగ, వ్యవసాయ కూలీలసమస్యలపై మే 25 నుండి జూన్ 7 వరకు ఆందోళనలు జరపాలని పిలుపునిచ్చింది. ఆ పిలుపులో భాగంగా రాష్ట్రంలో పలుచోట్ల ప్రదర్శనలు, ధర్నాలు జరిగాయి.

ఖమ్మం జిల్లా

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతాంగానికి విత్తనాలు, ఎరువులు సకాలంలో సగం ధరకే ప్రభుత్వం అందించాలనీ, పాత రుణాలు రద్దు చేసి, కొత్త రుణాలు ఇవ్వాలనీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 4.6.12న ఖమ్మం జిల్లా కేంద్రంలో ఎఐకెఎంఎస్, న్యూడెమోక్రసీ జిల్లా కమిటీలఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది.

ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ కె. రంగయ్య మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలరైతు వ్యతిరేక విధానాలఫలితంగా వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని విమర్శించారు. వ్యవసాయ పెట్టుబడులు పెరుగుతున్నా, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక, ప్రకృతి వైపరీత్యాలతో పదేపదే రైతాంగం తీవ్రంగా నష్టపోతూ, ఆత్మహత్యలవైపు నెట్టబడుతున్నరన్నారు. ప్రభుత్వం రైతాంగానికి అవసరమైన విత్తనాలు, సకాలంలో అందజేయక పోవటంతో దీనిని ఆధారం చేసుకొని నకిలీ విత్తనాలు, వ్యాపారం జోరందుకుని రైతుల్ని నిలువునా దోపిడి చేస్తున్నారని ఆయన విమర్శించారు. సకాలంలో రైతాంగానికి అవసరమైన విత్తనాలు సప్లై చేయాలనీ, ఎస్సీ, ఎస్టీలకీ ఉచితంగా ఇవ్వాలని కా॥ కె. రంగయ్య డిమాండ్ చేశారు.

ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు కా॥ గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ, రైతు రుణాలకు సంబంధించి బ్యాంకులద్వారా ఇస్తామన్న ప్రభుత్వం నిర్ణయం జిల్లాలో సరిగా అమలు జరగటం లేదనీ, జరిగినా ఇవి పేద రైతులకు ఏ మాత్రం అందడం లేదన్నారు. పేద, మధ్య తరగతి రైతాంగానికి సకాలంలో రుణాలు, విత్తనాలు, ఎరువులు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కా॥ నర్సయ్య డిమాండ్ చేశారు.

ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కా॥ జగ్గన్న మాట్లాడుతూ, రైతాంగానికి గిట్టుబాటు ధరలు ఖరీఫ్ సీజన్‌లోనే సహేతుకంగా ప్రకటించి, ప్రభుత్వమే పంటల్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని ప్రతినిధి బృందం అందజేసింది.

ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధికారులు కా॥ ముద్దా బిక్షం, నాయకులు గుర్రం అచ్చయ్య, మలీదు నాగేశ్వరరావు, కృష్ణ, పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్స్ జి. వెంకటేశ్వరరావు, ఆవులవెంకటేశ్వర్లు, ప్రజా సంఘాలనాయకులు కామ్రేడ్స్ సీవై పుల్లయ్య, జి. రామయ్య, కె. సురేష్, శ్రీనివాస్, ఝాన్సీ, రమేష్, రాజేంద్ర ప్రసాద్, వెంకట్రామరెడ్డి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా

రైతాంగానికి విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలనీ డిమాండ్ చేస్తూ 5.6.12న సూర్యాపేటలో ప్రదర్శన, ఆర్డీఓ ఆఫీస్ వద్ద ధర్నా జరిగింది. ఎఐకెఎంఎస్, న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌలు రైతులతో సహా రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు 50% సబ్సిడీపై ఇవ్వాలనీ, ఎస్సీ, ఎస్టీలకు, ఎస్టీ కార్పోరేషన్, ఐటిడిఏలద్వారా వుచితంగా ఇవ్వాలనీ, సమగ్ర పంటలబీమా పథకం అమలు చేయాలనీ రైతులు నినదించారు. ప్రదర్శనను ఆర్డీఓ ఆఫీస్‌లోకి అనుమతించక పోవటంతో పోలీసులకు, ప్రదర్శకులమధ్య కొంత వాగ్వివాదం జరిగింది.

ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కా॥ వి. కోటేశ్వరరావు మాట్లాడుతూ, రైతులకు విత్తనాలు సకాలంలో అందించటంలో ప్రభుత్వం విఫలం అవుతుందనీ, ఈసారి అయినా ఈ ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలనీ, నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలనీ డిమాండ్ చేశారు. కరువు వల్ల నష్టపోయిన రైతాంగానికి విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించి ఆదుకోవాలని, పాత రుణాలు రద్దు చేసి, కొత్త రుణాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కా॥ డేవిడ్ కుమార్ మాట్లాడుతూ, పాలకులు రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి చేస్తున్నారన్నారు. ఈ విధానాలపై రైతాంగం సమరశీలపోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ, ఎఐకెఎంఎస్ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ గంట నాగయ్య, మైబెల్లి, కె. వెంకన్న, డి. శ్రీను, పి. యాకయ్య, మధుసూధన్ రెడ్డి, సైదులు, మల్లయ్య, పిచ్చయ్య తదితర నాయకులతోపాటు 200 మంది రైతులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా

రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని రెంట చింతలమండలకేంద్రంలో ప్రదర్శన, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నా నుద్దేశించి ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కా॥ ఎన్. బ్రహ్మయ్య మాట్లాడుతూ, రైతాంగానికి సకాలంలో సబ్సిడిపై విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికి సరిపడ విత్తనాలు అందుబాటులో లేక పోవటం దారుణమన్నారు.

ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ డివిజన్ నాయకులు కామ్రేడ్స్ కె. రవి, పి. బాబు, గోపయ్య, బాలశౌరి, రాజు, వెంకటేశ్వర్లు, సాంబయ్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా

తొర్రూర్: కరువు ప్రాంత రైతాంగానికి అవసరమైన విత్తనాలు సకాలంలో సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేస్తూ ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో 25.5.12న తొర్రూర్ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా జరిగింది.

ఈ సందర్భంగా పార్టీ తొర్రూర్ సబ్ డివిజన్ కార్యదర్శి కా॥ కె. రవి మాట్లాడుతూ, ఎస్టీ, ఎస్సీ రైతాంగానికి ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలనీ, బిసి, ఓబిసి రైతాంగానికి 50% సబ్సిడీపై అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

నర్సింహులు పేట: రాష్ట్ర కార్యవర్గం పిలుపులో భాగంగా నర్సింహులు పేట తహశీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కా॥ కె. రవి మాట్లాడుతూ, విత్తనాలకొరత తీవ్రంగా వున్నదని దాన్ని పరిష్కరించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వెంటనే రైతాంగానికి సకాలంలో అవసరమైన విత్తనాలు, ఎరువులు అందజేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమాల్లో పార్టీ ఎఐకెఎంఎస్ నాయకులు కామ్రేడ్స్ యం. వీరన్న, వెంకటయ్య, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, యాకయ్య, వి. రాములు, రాజేశ్వర్, పాపారావు, సూరి, వెంకన్న, బీకు, లింగయ్య, భద్రు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

KLVA 102 m 312

సింగరేణిలో గుర్తింపు ఎన్నికల్లో అవకాశవాద, స్వార్థ, తొత్తు సంఘాలను ఓడించి ఇఫ్టూను గెలిపించండి!

సింగరేణి కార్మికులకు జిఎల్‌బికెఎస్ పిలుపు

సింగరేణి బొగ్గుగనులలో నాల్గవసారి గుర్తింపు ఎన్నికలు జూన్ 28న జరగబోతున్నాయి. ఈ ఎన్నికలలో ఇఫ్టూ పోటీ చేస్తున్నది. ఏప్రిల్ 3వ తేదీనే ఇల్లెందులో జరిగిన ఇఫ్టూ అనుబంధ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (జిఎల్‌బికెఎస్) రాష్ట్ర కమిటీ సమావేశం ఎన్నికలపరిస్థితిని చర్చించింది. మే 8వ తేదీన గోదావరిఖనిలో మరోసారి జరిగిన జిఎల్‌బికెఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్దిష్ట ఎన్నికలప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది. మే నెలచివరికల్లా నాలుగు జిల్లాలోని అన్ని గనులు, ఒసిలలో ఒక రౌండ్ ఎన్నికలప్రచార సభలను ఇఫ్టూ పూర్తి చేసింది. జూన్ మొదటి వారం నుంచి రెండో రౌండ్ ప్రచార సభలలో నిమగ్నమైనది. ఈ క్రమంలోనే జూన్ 9వ తేదీన హైదరాబాదులోని ఆర్‌ఎల్‌సి ఆఫీసులో ఇఫ్టూ నామినేషన్‌ను దాఖలు చేసింది.

ఈ ఎన్నికలలో ఇంత వరకూ గుర్తింపులోవున్న ఎఐటియుసి, తెలంగాణా వాదంతో గుర్తింపును సాధించగలనన్న అంచనా గలిగి వున్న టీఆర్ఎస్ అనుబంధ తెలంగాణా బొగ్గుగని కార్మిక సంఘం (టిజిబికెఎస్) మందీ మార్భలాలలో ప్రచార ఆర్భాటం సాగిస్తున్నాయి. గతంలో ఒకసారి గుర్తింపు హోదాను అనుభవించిన ఐఎన్‌టియుసి అనుబంధ యూనియన్ కూడా యిదే తరహాలో ప్రచారం చేస్తున్నది. ఇంకా సిఐటియు, బిఎంఎస్, హెచ్ఎంఎస్, టిఎన్‌టియుసి (2 గ్రూపులసంఘాలు కూడా) వై.కా.పా ఆధ్వర్యంలోని సాజెక్, సింగరేణి గని కార్మిక సంఘం (యుక్రి నేతృత్వంలోనిది) తదితర మొత్తం 13 యూనియన్లు పోటీలో వున్నాయి. ఈ ఎన్నికలకి ముందు సింగరేణి కార్మికులలో ఒక తీవ్ర అసంతృప్తి, నైరాశ్యాలు వ్యాపించి వున్నాయి. 14 ఏండ్ల మొదటిసారి గుర్తింపు ఎన్నికలు జరిగిన నాటికి కార్మికులలో ఉత్సాహం, ఆసక్తులుండేవి. కానీ ఆచరణలో ఎన్నికలప్రక్రియ 'డీ-ట్రేడ్ యూనియనిజం'కి దారి తీసింది. ట్రేడ్ యూనియన్లను బలహీనపరిచే యాజమాన్య లక్ష్యానికి ఈ ఎన్నికలప్రక్రియ తోడ్పడింది. ఈ ప్రక్రియకి ప్రవర్తనా నియమావళి (కోడ్ ఆఫ్ డిసిప్లెన్)ని ఒక ఆయుధంగా సింగరేణి యాజమాన్యం వుపయోగించుకున్నది. ఈ ప్రవర్తనా నియమావళి ద్వారానే కార్మిక వర్గాన్ని ప్రలోభాలూ, ఎరలతో లోబరుచుకునే ఎత్తుగడలు సాగించింది. సింగరేణిని ఒక సంతగా మార్చి వేసింది. గుర్తింపు యూనియన్‌ను అందుకు ఒక సాధనంగా వాడుకున్నది. ట్రాన్స్ ఫర్‌కి ఇంత; ప్రమోషన్‌కి ఇంత మొత్తం; నివాసానికి (క్వార్టర్)కి ఫలానా మొత్తం చొ॥న రేట్లు ఫిక్స్ అయ్యాయి. సిక్ లీవ్‌కీ, శెలవు మంజూరికీ, యాక్సిడెంటు నమోదుకీ, పేషంట్లు డ్యూటీలకి ఫిట్ సర్టిఫికెట్లకీ, 'రెట్లు' కుదిరాయి. ఈ అప్రకటిత లంచగొండి వ్యవస్థకి కార్మికవర్గాన్ని బలిపశువుగా మార్చి వేసింది. ఈ తరహా 'డీ-ట్రేడ్ యూనియనిజం' పాలసీ వెనక ప్రభుత్వ విధానాలున్నాయి. ఆచరణలో ఎన్నికలప్రక్రియ సింగరేణి కార్మికవర్గాన్ని మానసికంగా దిగజార్చింది. ఈ కారణంగా తాజా ఎన్నికలపట్ల సింగరేణి కార్మికులలో తీవ్ర నిరాశా, నిస్పృహలున్నాయి. ఈ కారణంగా ఎన్నికలప్రవర్తనా నియమావళి (కోడ్ ఆఫ్ డిసిప్లెన్)ని సూత్రరీత్యానే జిఎల్‌బికెఎస్ సవాలు చేసింది. ఈ వెలుగులోనే మొదటి రౌండ్ ఎన్నికలప్రచారాన్ని జిఎల్‌బికెఎస్ చేపట్టింది. ఇఫ్టూ చేపట్టిన ఈ ప్రచారానికి కార్మికవర్గం నుంచి మంచి స్పందన లభించింది.

ఈ ఎన్నికలప్రచారోద్యమానికి కామ్రేడ్స్ టి. శ్రీనివాస్, ముక్తర్ పాషా, యస్. వెంకటేశ్వరరావు, బి. సంపత్ కుమార్, జె. సీతారామయ్య, విశ్వనాథ్ తదితరులు సారధ్యం వహిస్తున్నారు. ప్రచారసభలలో వీరితోపాటు చాంద్ పాషా, ఐ. క్రిష్ణ, గంగులదయాకర్ తదితరులు కూడా పాల్గొంటున్నారు.

ఈ ఎన్నికలలో అవకాశవాద, తొత్తు, స్వార్థ సంఘాలను ఓడించాలనీ, కార్మికవర్గం శ్రేయస్సుకై నిజాయితీగా పోరాడే ఇఫ్టూ అనుబంధ జిఎల్‌బికెఎస్‌ను గెలిపించాలనీ ఇఫ్టూ పిలుపునిచ్చింది. ఇఫ్టూ రాష్ట్ర, జాతీయ కమిటీలనాయకులతో కూడా కొన్ని ప్రత్యేక ఎన్నికలసభలను నిర్వహించేందుకు జిఎల్‌బికెఎస్ రాష్ట్ర కమిటీ సన్నద్ధమవుతున్నది. ప్రచార దళాలతో విస్తృత ప్రచారానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నది. కరపత్రాలు, పోస్టర్లు, డోర్ పోస్టర్స్‌తో ప్రచార కార్యక్రమాలను రూపొందించింది.

(4వ పేజీ తరువాయి)

తెలుగు జాతిని శిలువ తీస్తున్న
తెలుగు ఖ్యాతిని నలుపు చేస్తున్న
విశాలాంధ్రను చీల్చ జూస్తున్న
పిశాచాలను తరిమి వేస్తున్నా (29.3.73 ఆకాశవాణి ప్రసారం)

అని తెలంగాణా ఉద్యమకారులను పిశాచాలుగా ఘోరమైన వర్ణన చేస్తాడు. గత అరవై ఏళ్ళుగా సీమాంధ్ర పెట్టుబడిదారులు తెలంగాణా నీళ్ళను, నిధులను, నౌకరీలను యధేచ్ఛగా సీమాంధ్రకు తరలించుకుపోతూ తెలంగాణా వనరుల్ని కొల్లగొట్టి తెలంగాణాను కరువు - కాటకాలకు, నిరుద్యోగులకు, పేదరికానికి, వివక్షతలకు, అవమానాలకు నిలయం చేసిన కారణాలేమిటి? సిరాతడి ఆరకుండానే ఒప్పందాలఉల్లంఘనలకు పూనుకొని కొనసాగిస్తున్న దగా, మోసాలకు కారణాలేమిటి? సొంత అస్తిత్వం కోసం, స్వపరిపాలన కోసం, ఆత్మగౌరవం కోసం సాగిస్తున్న పోరాటంపై ఉక్కుపాదాల్ని మోపడం వెనుక కారణాలేమిటి? అనే ప్రశ్నలను శ్రీశ్రీ పట్టించుకోక పోవడం ఘోరమైన చారిత్రిక తప్పిదం. 'విడిపోవడమంటే చెడిపోవడమని శ్రీశ్రీ కూడా సీమాంధ్ర పెట్టుబడి దోపిడీదార్ల పాటలో గొంతు కలిపితే ఎవరికి వత్తాసు పలుకుతున్నట్లు

ఇతి హాసపు చీకటి కోణం / అట్టడుగున పడి కాన్పించని / కథలన్నీ కావాలిప్పుడు! / దాచేస్తే దాగని సత్యం అని రాసిన శ్రీశ్రీ తెలంగాణా వనరులదోపకాన్ని, ఒప్పందాల్ని పదే పదే ఉల్లంఘించడాన్ని, తెలంగాణా భాష, సంస్కృతులపై దాడిని, అస్తిత్వ పోరాటాన్ని ఈ చీకటి కోణాలఅట్టడుగున పడి కన్పించని కథల్ని అన్వేషించలేక పోయిన శ్రీశ్రీ తన సమైక్యతావాద వైఖరి వల్ల తెలంగాణా వుద్యమానికి చారిత్రక తప్పిదం చేసిండు.

శ్రీశ్రీ కవిత్వాన్ని పునర్మూల్యాంకనం (తీవఝశ్రీఝఅశీఅ) చేసేటప్పుడు ఈ తప్పులు, ఒప్పులను పరిగణనలోకి తీసుకుంటే తప్ప శ్రీశ్రీ కవిత్వాన్ని సరిగ్గా అంచనా వేయలేము. సామాజిక మార్పు కోసం రాసే రచయితలు, కవులు, ఎన్నో రూపాల్లో పెల్లుబికే ప్రజా వుద్యమాల్ని ఎంతో నిశితంగా గమనిస్తూ నిరంతర జాగరూకతలో వుండవలసిన అవసరాన్ని పై సందర్భం మన ముందుకు తెస్తోంది.

చట్ట విరుద్ధ ప్రజాభిప్రాయ సేకరణను ప్రశ్నించిన రాంబిల్లి గంగపుత్రులపై, ప్రజాసంఘాల, పార్టీలనేతలపై హత్యానేరం 307 కేసులా?

విశాఖ జిల్లా రాంబిల్లి మండలం చాటమెట్ట గ్రామం వద్ద ఈ నెల6న సన్వీరా ఇండస్ట్రీస్ వారు పెట్రోలియం కోక్ ప్లాంట్ ఏర్పాటు చేసే లక్ష్యంతో ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి), జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించాల్సిన ఈ సభకు సంబంధించిన సమాచారం పరిసర గ్రామాలు కాలుష్యం వల్ల ప్రభావితమయ్యే ప్రాంతాల్లో నివసించే వారందరికీ పూర్తి స్థాయిలో సంక్షిప్తంగానూ, స్థానిక భాషలో తెలియజేప్పాల్సిన బాధ్యత కలిగి వుంది. ఏదైనా ఒక పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణకు అనుమతి కోరిన వెంటనే సంబంధిత జిల్లా మెజిస్ట్రేట్‌ను సంప్రదించి 45 రోజుల్లోపు సదరు ప్రజాసభ నిర్వహించాలనీ, తేదీ నిర్ణయమైన వారం లోపు సంబంధిత ప్రజలందరికీ తెలియపర్చాలని పర్యావరణ చట్టం 1986 నిర్దేశిస్తున్నది.

కానీ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా యంత్రాంగం స్థానిక రెవెన్యూ అధికారులు ఈ సమాచారం ప్రజలకు అందించక పోగా బ్రాండిక్స్ కంపెనీలో నష్టపోయిన వారికి చెక్కులు అందజేయడానికి 6వ తేదీ చాటమెట్ట గ్రామానికి జాయింట్ కలెక్టర్ వస్తున్నాడని తప్పుడు సమాచారం పంపారు. ప్రజలకేంద్రంగా అభివృద్ధి సాధనా ఉద్యమం, ప్రజా సంఘాలు, సీపీఎం, సీపీఐ పార్టీలు అందించిన సమాచారం ద్వారా వాస్తవాలు తెలుసుకున్న ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని, అందుకు ప్రజాభిప్రాయ సేకరణ జరపొద్దనీ అధికారులకు, పోలీసులకు తెలియపరిచారు. చట్ట ఉల్లంఘనలను ప్రజాసంఘాలు, పార్టీలు 5.6.12 నాడు పిసిబికి, కలెక్టర్‌కు తెలియపర్చి, ఆందోళనలద్వారా కూడా రద్దు చేయమని కోరారు. కానీ జిల్లా యంత్రాంగం ఏ మాత్రం లెక్క చేయకుండా ప్రజలఅభిప్రాయాలు, ఆకాంక్షలు, వారు లేవనెత్తిన అభిప్రాయాలను పక్కన బెట్టి పోలీసు బలగాలను వినియోగించి నిర్వహించే ప్రయత్నం చేసాయి.

6వ తేదీ నాడు గుమిగూడిన గంగపుత్రులు ఎట్టి పరిస్థితుల్లోను ప్రజాభిప్రాయ సేకరణ జరపొద్దని వేడుకున్నా, ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేసినా ఖాతరు చేయకుండా వందలమంది పోలీసులను వినియోగించి దౌర్జన్యానికి పూనుకున్నారు. రాంబిల్లిలో ధనరాజు అనే గంగపుత్రున్ని తీవ్రంగా గాయపర్చారు. అనేక మందిని లాఠీలతో బాదారు. తరిమివేసే ప్రయత్నం చేసారు. తమ మనుగడను రద్దు చేసే ప్రయత్నం, ప్రభుత్వ యంత్రాంగం పోలీసులు ప్రమేయంతో చేస్తుండటంతో మత్స్యకారులు ఎదురుతిరిగారు. అప్పటికైనా పోలీసులు వాస్తవాలు గ్రహించకుండా, చట్టబద్ధంగా శాంతిభద్రతలసమస్య తలఎత్తితే పబ్లిక్ హియరింగ్‌ను రద్దు చేయటమో, వాయిదా వేయటమో చేయాలనీ పర్యావరణ చట్టం చెబుతున్నా మత్స్యకారులపై దౌర్జన్యం చేసారు. దానిని ప్రతిఘటించినందుకు మత్స్యకారులపై, ప్రజాసంఘాల, పార్టీలనేతలపై తప్పుడు కేసులు, హత్యా ప్రయత్న నేరం బనాయించి అధికార దుర్వినియోగానికి పోలీసులు పాల్పడ్డారు. ప్రజలపై దౌర్జన్యానికి కారణమైన అధికారుల, చట్ట విరుద్ధ చర్యలపై కేసులు నమోదు చేయడానికి బదులు అమాయక మత్స్యకారులపై దాడికి దిగడాన్ని ఖండిస్తున్నాం. చివరకు పర్యావరణం ప్రేమికులు, ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవ సమాచారాన్ని అందిస్తున్న జర్నలిస్టు జె.వి. రత్నంపై కూడా 307 కేసును నమోదు చేయడం అత్యంత హేయమైన చర్య. ప్రభుత్వం తన దుందుడుకు చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజలు, ప్రజాస్వామికవాదులు ప్రజల ప్రతిఘటనను బలపర్చాలని కోరుతున్నాం.

ఎం. లక్ష్మి పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు	**ఎస్.వి. రమణ** దళిత విముక్తి నాయకులు	**ఎం. వెంకటేశ్వర్లు** ఇఫ్టూ రాష్ట్ర నాయకులు
పి.వి. రమణ ప్రయివేటీకరణ వ్యతిరేక వేదిక	**టి. శ్రీరామ్మూర్తి** ఎపిసిఎల్‌సి జిల్లా అధ్యక్షులు	**కె.ఎస్. చలం** ఐఎపిఎల్
జె.వి. రత్నం ప్రజల కేంద్రంగా అభివృద్ధి సాధనా ఉద్యమం	**కె.రవి** మురికివాడల నివాస సంక్షేమ సంఘం	

తూర్పు గోదావరి జిల్లాలో అల్లూరి 88వ వర్ధంతి సభలు

నందరాడ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 88వ వర్ధంతి సభ 07.05.2012న అఖిలభారతరైతు-కూలీ సంఘం(ఎఐకెఎంఎస్) ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. నందరాడ గ్రామ పంచాయితీ వద్ద గలఅల్లూరి విగ్రహానికి ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కా॥జె.సత్తిబాబు, పిడియస్‌యూ జిల్లా అధ్యక్ష్యులు కా॥యు.గనిరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కా॥ సత్తిబాబు మాట్లాడుతూ, బ్రిటిష్ సామ్రాజ్యవాదులదోపిడీకి వ్యతిరేకంగా, దేశ విముక్తికై విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు సాగించిన విరోచిత పోరాటం నేటి యువతరానికి ఆదర్శమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే తెల్లదొరలను తరిమి వేయగలమనీ, అందుకు ఆయుధ సంపత్తికై చింతపల్లి, కృష్ణదేవపేట, రాజబొమ్మంగి, రంపచోడవరం, అన్నవరం పోలీసుస్టేషన్లపై దాడి చేసి 'పితూరీ' నిర్వహించాడన్నారు. వలసపాలన పోవాలనీ, నిజమైన స్వాతంత్ర్య రావాలని అల్లూరి పోరాటం సాగించారన్నారు. దేశంలో దారిద్ర్యం, పేదరికం, ఆకలిచావులు, ఆత్మహత్యలు, నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు పేదల్ని మరింత పేదలుగా మారుస్తున్నాయనా అన్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తితో దోపిడీ ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ మండలనాయకులు కా॥ కడిమాలదుర్గరావు,గుత్తుల వేషారావు, నీలం సుర్యారావు, పెంకీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడి: తేది.07.05.2012న భారత కార్మిక సంఘాలసమాఖ్య(ఐఎఫ్‌టియు), ప్రగతీశీలయువజన సంఘం(పివైఎల్) ఆధ్వర్యంలో అల్లూరి 88వ వర్ధంతి సభ జరిగింది. రైసుమిల్లు, జూటు కార్మిక సంఘం నాయకులు కా॥ దేపాటి సత్యనారాయణ అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. " అల్లూరి అమర్‌హే" అల్లూరి ఆశయాలను సాధిదాం" నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి' సామ్రాజ్యవాద' విషసంస్కృతి నశించాలి" అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పివైఎల్ రాజమండ్రి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్స్ వి.భూమశంకర్, అంబటి కృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు నక్క వీర్రాజు , మరుకుర్తి శ్రీను, బొల్లవీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

Published by M. Narayana Swamy, Publisher, Printer and owner from H.No.1-9-295/11/4, 7th Line, Maseedu Road, Vidyanagar, Hyderabad-44. and Printed at Navya Printers, Badam Sohna Apartments, Raj Bhavan Road, Hyderabad (A.P.) Editor : M. Narayana Swamy-Phone: 27607884, Fax : 27662518, Email: prajapanda@rediffmail.com, Web: www.cpimlndap.org

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M312
పుస్తకం పేరు	ప్రజాపంథా
తారీఖు	07 February 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	13
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Nandini
పేజీలు విడదీసినది	Nandini
స్కాన్ చేసినది	Naveeda
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good